ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 60 పేజీలు: 10+4 వెల: 6.50




ఎన్నికల ప్రచారం కోసం కేరళంకు వెళ్లిన సిఎం రేవంత్ రెడ్డి 2



కేరళంలోని పేరంబ్ర ఎన్నికల ప్రచారంలో రాహుల్

శబరిమల బంగారం స్కాంపై ప్రధాని ఎందుకు మాట్లాడరు? -రాహుల్ విమర్శ 5



గాంధీనగర్‌లో మ్యూజియంను సందర్శించిన ప్రధాని మోడీ

సాంస్కృతిక వారసత్వమే మానవాళికి దిశానిర్దేశం -ప్రధాని మోడీ 3



ఆరోగ్యం గుల్ల చేస్తున్న నకిలీ అల్లం పేస్ట్

4 వేల కిలోల పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు 3

# మూసీ ప్లాన్‌పై ప్రజాభిప్రాయం

### 15 రోజులు ఆన్‌లైన్ నమోదు

### విలువైన సూచనలు చేసిన వారితో సబ్‌కమిటీ భేటీ

### 24/7 అభిప్రాయాల స్వీకరణ

### కేబినెట్ సబ్‌కమిటీ సమీక్షలో డి.సిఎం భట్టి విక్రమార్క



మంగళవారం మూసీ సబ్ కమిటీ సమీక్షలో డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి31:** మూసి పునర్జీవనం పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని డిప్యూటీ సీఎం, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ తో కలిసి మూసి పునర్జీవనం పనుల ప్రగతిపై సవివరంగా అధికారులతో చర్చించారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్ లో ముసిఐఆర్‌డిసి మెయిల్ ఐడి ద్వారా మూసి పునర్జీవనంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటిని అధికారులతో కూర్చొని విశ్లేషణ చేసి అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసి నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చ్ 28న శంకుస్థాపన జరిగింది.

ఆ రోజు నుంచి మూసి ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసిపునరావాసి తులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్ల తుది దశకు తీసుకురావడం, బ్యాం కర్స్‌తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలి, మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న మూసి సబ్‌కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రంజన్,మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి. ఇవి. నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మను చౌదరి, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

**రేపటి నుంచి పెద్ద ఎత్తున గ్రామసభలు**

ప్రజాపాలన ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి >>2



# అకాల నష్టం తడిసి మోపెడు!

### నేల వాలిన వరి, మామిడి కాయలు, మొక్క జొన్న పంటలు

### పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

### నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన పసుపు రాశులు

### మరో 2 రోజులు వడగళ్ల వానలు కురిసే అవకాశం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అకాల వర్షాలు రైతులను నిండా ముంచుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రాత్రి నుండి మంగళవారం ఉదయం వరకు పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. అకాల వర్షాలకు కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. చేతికందొచ్చిన మామిడి పంట సైతం నేల పాలయింది. నిజామాబాద్, సిద్ధిపేట, జగిత్యాల, నిర్మల్, జనగామ, ఆదిలాబాద్, జగిత్యాల తదితర జిల్లాల్లో అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. నిజామాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్‌లో పసుపు వరదనీటిలో తడిసిపోయింది. జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. కళ్లాల్లో ఆరబోసిన పసుపు, ఎర్ర జొన్న, జొన్న, మొక్కజొన్న తడిసి ముద్దయ్యాయి. ధర్పల్లి, సిరికొండ మండలాలలో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, వరి పంటలు నేలకొరిగాయి. చేతికొచ్చిన మామిడికాయలు నేలరాలాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మక్కలు తడిసిపోయాయి. నిర్మల్ జిల్లాలో కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన మామిడి పంట నేలపాలయింది. కళ్లల్లో ఆరబెట్టిన పసుపుకొమ్ములు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలో 20 ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఇక నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోనీ పలు మండలాల్లో అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది. అక్కడక్కడ చెట్లు సైతం నేలకొరిగాయి. పెద్దపల్లి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. ఈదురుగాలులతో >>2



# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సిఐడి నోటీసులు

### 4న విచారణకు రావాలని ఆదేశం

### మేడారం జాతరలో పోలీసు విధులకు ఆటంకం కేసు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాత వార్త:** గత జనవరి నెల29వ తేదీన మేడారం జాతర సందర్భంగా కుటుంబంతో పాటు అనుచరులతో జాతరకు వచ్చిన బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ పాడి కౌశిక్‌రెడ్డి అక్కడ విధినిర్వహణలో వున్న పోలీసులతో గొడవ పడిన ఘటనపై విచారణకు >>2



# రోహిత్ సహా ముగ్గురికి మళ్లీ కస్టడీ

### మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాత వార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అరెస్టయిన తాండూరు మాజీ ఎంఎల్ఎ, బిఆర్‌ఎస్ నాయకుడు పైలట్ రోహిత్ రెడ్డి ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలకు >>2

# ఎపి నీటి దోపిడి!

### నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలంలో జల విద్యుదుత్పత్తి చేస్తున్న ఆంధ్రప్రదేశ్

### 'వంటావార్పు' నిరసన పిలుపుతో వెనక్కి తగ్గిన వైనం: మీడియాతో మంత్రి జూపల్లి

**హైదరాబాద్,మార్చి 31,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలంజలాశయం నుంచి జలవిద్యుత్ తయారి నిలపడానికి శ్రీశైలం వద్ద "వంటావార్పు" నిరసనలకు పిలుపు ఇవ్వడంతో జలవిద్యుత్ తయారీ నిలిపివేసిందని ఎక్సైజ్‌శాఖ మంత్రిజూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా శ్రీశైలం జలాశయంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రైతు ప్రయోజనాలను తాగునీటి అవసరాలను తీర్చడానికి వేసవిలో వాడాల్సిన నీటిని ఈ విధంగా దుర్వినియోగం చేయడం తగదని అన్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో కనిష్ట నీటి మట్టం స్థాయి 834 అడుగుల ( 254.2 మీటర్లు)కు చేరుకున్నప్పుడు శ్రీశైలం జలాశయం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన ఉందని గుర్తుచేశారు. తెలంగాణ సాగు, తాగునీటి అవసరాలు పట్టించుకోకుండా ఆంధ్రా సర్కార్ అక్రమంగా, అన్యాయంగా నీటిని తోడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఎన్ని సార్లు విన్నవించినా ఆంధ్రప్రదేశ్ సర్కార్ పట్టించుకోలేదనీ అందుకే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతాంగం, అదే విధంగా కృష్ణా పరివాహక ప్రాంత జిల్లా ప్రజల ప్రయోజనాల కోసం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజాప్రతినిధులం శ్రీశైలం >>2



మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి జూపల్లి

## ప్రమాదకరస్థాయికి శ్రీశైలం నీటిమట్టం

### 885 అడుగులకుగాను 821కి చేరిక

### ప్రాజెక్టులో ఇక మిగిలింది 44 టిఎంసిలే

### వేసవి పంటలకు సాగునీటి కటకట 2



అమెరికా బహుళజాతి సంస్థలే ఇక

# ఇరాన్ టార్గెట్

### గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా ఇతర సంస్థల జాబితా రెడీ

### మహాన్ ఎయిర్‌పై ఇజ్రాయెల్ దాడులు

### యుద్ధం ముగింపునకు ట్రంప్ సానుకూలం

### గల్ఫ్ దేశాలపై యుద్ధ వ్యయం మోపే ప్లాన్

**టెహ్రాన్ / టెల్‌అవీవ్ /వాషింగ్టన్, మార్చి 31:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడులు ఉగ్రరూపం దాల్చాయి. యురేనియం నిల్వలు దాచి ఉంచారన్న అనుమానంతో ఇరాన్‌లోని అత్యంత రద్దీనగరం ఇష్ఫహాన్‌పై అమెరికా బంకర్‌బస్టర్ బాంబులతో దాడులుచేసింది. ఇరాన్ ఈప్రాంతంలో 540 కిలోల శుద్ధిచేసిన యురేనియం దాచిఒంచిందన్న అనుమానంతో ఈ దాడులుచేసారు. అయితే ఇరాన్‌కూడా అందుకు ధీటుగా గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా దాడులకు దిగింది. మరోపక్క ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌లోని మిలిటరీ మౌలికవనరులే టార్గెట్‌గా దాడులకు దిగింది. ఇరాన్‌సైతౌతం తన క్షిపణి, డ్రోన్ దాడులు గల్ఫ్‌దేశాలన్నింటిపైనా ఉధృతంచేసింది. ఇదిలా ఉంటే అమెరికా తన యుద్ధవిమానాలను దించేందుకు కొన్ని యూరోప్ దేశాలు అంగీకరించకపోవడం ఆశ్చర్యకరం. తాజాగా సౌదీ అరేబియా కూడా అమెరికాకు తన గగనతలం వాడుకునేందుకు అనుమతులు నిరాకరించింది. దుబాయ్ ఓడరేవులో లంగరువేసిన కువైటీ ఆయిల్‌ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణి దాడిచేయడంతో నౌక ధ్వంసం అయిందని సౌదీ ప్రభుత్వం ధృవీకరించింది. హార్ముజ్‌ను తెరవకపోయినా తాము తమ లక్ష్యాలను పూర్తిచేస్తామని, ఇప్పటికే సాధించిన లక్ష్యాలన్నీ సాధించామని ఒప్పందాలకు రాకుంటే ఇరాన్‌కు మరింత >>2

# గ్యాస్ దందాపై కొరడా

### పలు జిల్లాల్లో భారీగా సిలిండర్లు సీజ్

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** ఎల్‌పిజి సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ దందాపై పౌరసరఫరాలశాఖ అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. మార్చి రెండోవారంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని హోటల్స్‌పై దాడి చేసి భారీగా డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్ల అక్రమ మళ్లింపు జరుగుతోందని అధికారులు నిఘా పెంచారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వాణిజ్య అవసరాలకు హోటల్స్ ఇతర అవసరాలు డొమెస్టిక్ సిలిండర్లను తరలించినట్టు కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లపై నిరంతర నిఘా కొనసాగుతోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటయ్యాయి.ఎల్పీజీ సిలిండర్ల అక్రమ దందా అరికట్టేందుకు ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. బహిరంగ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్ల బ్లాక్‌దందా చేస్తున్న ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ముఠాగా ఏర్పడి కమర్షియల్ గ్యాస్‌ను అక్రమంగా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. హోటళ్లు, రెస్టారంట్‌లకు అధిక ధరలకు గ్యాస్ విక్రయిస్తున్నట్లు కనిపెట్టారు. డీలర్‌తోపాటు 10 మందిని అరెస్టు చేశారు. పంజాగుట్టలోని శ్మశాన వాటికలో సిలిండర్లు నిల్వ చేశారు. మొత్తం 414 >>2

# అనుమతులిచ్చి ఆరోపణలా?

### కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను ఖండించిన హరీష్‌రావు

### సిఎం రేవంత్‌రెడ్డిది పహిల్వాన్ భాష అని విమర్శ



మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి31:** అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పహిల్వాన్ భాష మాట్లడుతున్నడని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రబడ్జెట్ డొల్ల అని, అందుకే దానికి సంబంధించిన పత్రాలను చించివేశామని హరీష్‌రావు చెప్పారు. తెలంగాణ ప్రజల గొంతుకగా బీఆర్‌ఎస్ వ్యవహరిస్తున్నదని అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అన్నారని, కానీ ఆ హామీలను ఈ సర్కారు నెరవేర్చలేదని విమర్శించారు. కోటి మంది మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని మాటతప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన నోటిఫికేషన్‌లు, ఉద్యోగాలపై నిలదీశామని అన్నారు. 16 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు సభలో ప్రభుత్వమే చెప్పిందని చెప్పారు. సీఎం రేవంత్ మాత్రం 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు కాకి లెక్కలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై మా పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఆయన వ్యాఖ్యలు అచ్చం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాష లాగే ఉన్నాయిని, బీఆర్‌ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల >>2



# దండకారణ్యంలో ఇంకా దళాల కదలికలు!

### వంద మంది పైగానే ఉన్నట్లు గుర్తింపు

### 'కగార్' గడువు ముగిసినా అజ్ఞాతంలోనే మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బెస్రా నరహరి

### అందరూ లొంగిపోతేనే మావోయిస్టు రహిత భారత్ పరిపూర్ణం

**చర్ల, మార్చి 31, ప్రభాతవార్త:** దేశంలో మావోయిస్టుల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ 'కగార్' చేపట్టింది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్‌ను చూస్తారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పలు మార్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఆపరేషన్ కగార్‌తో అడవులను భద్రతా బలగాలు జల్లెడ పట్టాయి. సుమారు 200 వందలకుపైగా జరిగిన ఎన్‌కౌంటర్లలో అధికారిక లెక్కల ప్రకారం 490 మంది మావోయిస్టులు చనిపోగా 2000 మందికిపైగా లొంగిపోగా 1800 మంది వివిధ కేడర్లకు చెందిన మావోయిస్టులు అరెస్టు అయ్యారు. భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు మృతిచెందిన >>2



మహావీర్‌జయంతి సందర్భంగా మంగళవారం గాంధీనగర్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

# ఆరోపణలా?

>> ఫెవికాల్ బంధం బయటపడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 90 వేల కోట్లు, లక్ష కోట్లు కొట్టుకుపోయాయి అని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడుతారు? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమే.కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శం అని కేంద్ర మంత్రులు, అధికారులు చెప్పారు.ఇది తెలంగాణకు వరప్రదాయిని అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. తెలంగాణకు ఇది ముక్తేశ్వర ప్రాజెక్టు అని ఆనాటి గవర్నర్ నరసింహన్ కొనియాడారు. కాళేశ్వరం కంటే గొప్ప ప్రాజెక్టు దేశంలో లేదని సాక్షాత్తూ ప్రస్తుత కాంగ్రెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆనాడు చెప్పారు అని గుర్తు చేశారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేందర్ సింగ్ గోదావరి నదికి నడకలు నేర్పి జీవనదిగా మార్చారు అని ప్రశంసించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పనులు జరుగుతున్నాయి, ప్రాజెక్టు డిజైన్లు, ప్రణాళికలు చాలా బాగున్నాయి అని సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ మసూద్ హుస్సేన్ కితాబిచ్చారు.పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రాజెక్టును విజిట్ చేసి ఇదొక అద్భుతం అని చెప్పారు. ఇక నిన్న బడ్జెట్‌లో సాక్షాత్తూ రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డే.. కాళేశ్వరం ప్రాజెక్టులో పారుతున్న లక్షల ఎకరాలకు అదనంగా 2024 లో 3000 ఎకరాలు కొత్తగా పారకం పెరిగింది. 2025లో కొత్త ఆయకట్టు సాగులోకి తెచ్చాము అని స్పష్టంగా చెప్పారు. ప్రాజెక్టు లక్ష కోట్లు కొట్టుకుపోతే.. ఈ కొత్త ఆయకట్టుకు పారకం ఎక్కడినుంచి వచ్చింది? అని ప్రశ్నించారు. భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువలకు వెళ్లి నీళ్లు వదులుతున్నారు కదా.. అవి కాళేశ్వరం నీళ్లు కావా? గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు, అది కాళేశ్వరంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళ్లు తెస్తామని రూ.8,000 కోట్లతో కాలువలు తవ్వుతున్నారు కదా.. కాళేశ్వరం కొట్టుకుపోతే మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయి? అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు, అలాగే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్, కాంగ్రెస్ నాయకులకు నేను సవాల్ విసురుతున్నాను. మీరు తెలంగాణకు రండి. యాదాద్రి భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ రైతుల్ని అడుగుదాం పదండి.గలగలా పారుతున్న ఆ గోదావరి నీళ్లు ఎక్కడివో అడుగుదాం. కాళేశ్వరం నీళ్ల వల్ల పండిన పచ్చని పొలాలను చూద్దాం, రైతులను పలకరిద్దాం రండి అని సూచించారు.కరీంనగర్, నల్గొండ, యాదాద్రి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు రూ.50 కోట్లు ఇస్తే రెండు లక్షల ఆయకట్టుకు నీళ్లు వస్తాయి. కానీ అలా నీళ్లు ఇస్తే కాళేశ్వరం పోయింది అని తాము చెప్పిన అబద్ధం ఎక్కడ బయటపడుతుందో అన్న అక్కసుతో రైతులకు శిక్ష వేస్తున్నారని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

## మూసీ ప్లాన్‌పై ప్రజాభిప్రాయం

>> విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి గారి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## గ్యాస్ దందాపై కొరడా

>> గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఏడాదిన్నరగా ఈ బ్లాక్ మార్కెట్ దందా కొనసాగిస్తున్నారు. గ్యాస్ కొరత ఉన్నట్లు నిందితులు వదంతులు సృష్టిస్తున్నారని పోలీసులు తెలిపారు. కమర్షియల్ సిలిండర్ రూ.2వేలు ఉంటే.. రూ.6 వేలకు విక్రయిస్తున్నారని పోలీసులు వివరించారు. నిందితుల నుంచి 11 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులకు శంషాబాద్‌లో ఓ గోదాం ఉన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మహ్మద్ అమీర్‌ను బంజారాహిల్స్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామని పోలీసులు వివరించారు. కాగా గ్యాస్ నిల్వ చేసి బ్లాక్ మార్కెట్ చేసే డీలర్లపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అక్రమాలకు పాల్పడే గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులను తక్షణమే రద్దు చేసే అధికారం స్థాక అధికారులకు ప్రభుత్వం కల్పించింది. గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ విక్రయాల గురించి 1967 లేదా 1800 4250033 నెంబర్లను అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు అక్రమంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల దందాకు పాల్పడుతున్న సుమారు 50 మందిని రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో సుమారు 450, నల్గొండలో 124, కరీంనగర్ లో 39, మహబూబ్ నగర్ లో 54, నిర్మల్, ఖమ్మం జిల్లాల్లో 47 ఎల్పీజీ సిలిండర్లను అధికారులు సీజ్ చేశారు. పశ్చిమాసియా యుద్ధంతో వంట గ్యాస్‌కు నెలకొన్న కొరతను అక్రమార్కులు తమ బ్లాక్ దందాకు వినియోగించుకుంటున్నారు.

### ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి
## సిఐడి నోటీసులు

>>సిఐడి రంగంలో దిగింది. అప్పటి ఘటనపై హుజూరాబాద్ పోలీసులు కౌశిక్ రెడ్డితో పాటు 20 మందిపై కేసులు నమోదు చేయడం తెలిసిందే. పోలీసుల విధులకు ఆట ంకం కలిగించడంతో పాటు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, గొడవకు దిగారని కౌశిక్ రెడ్డి సహా ఆయన అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై అప్పట్లోనే స్థానిక పోలీసులు అందరికి నోటీసులు జారీ చేశారు. దీని తరువాత ఈ కేసును సిఐడికి బదలాయిస్తూ సర్కారు మూడు రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసింది. దీని తరువాత వెంటనే రంగంలో దిగిన సిఐడి అధికారులు హుజూరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలను తెప్పించుకుని పరిశీలించారు. దీనిపై కౌశిక్ రెడ్డికి మంగళవారం నాడు నోటీసులు ఇచ్చారు. ఏప్రిల్ నెల నాలుగవ తేదీన ఉదయం 11. 30 గంటకు హైదరాబాద్‌లో సిఐడి కార్యాలయంలో విచారణకు రావాలని అందులో ఆదేశించారు. మేడారం జాతరలో మత విద్వేశాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినట్లు, దీనిపై జరిగే విచారణకు రావాలని కౌశిక్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో సిఐడి అధికారులు పేర్కొన్నారు. కాగా తనకు అందిన నోటీ సులపై కౌశిక్ రెడ్డి స్పందించారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా తనను, తన కుటుంబాన్ని టార్గెట్ చేయడం బాధాకరంగా వుందని ఆయన తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే తనను టార్గెట్ చేస్తున్నారని, తన పోరాటం ఆగదని ఆయన వెల్లడించారు.

## ఏపి నీటి దోపిడి!

>>వద్ద వంటావార్పు కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు.మా హెచ్చరికలతో చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్‌ఉత్పత్తిని నిలిపేసిందనీ చెప్పారు. ప్రజాప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ముఖ్యం తెలంగాణకు దక్కాల్సి న నీటి కేటాయింపుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నీటి చౌర్యం ఘటనలు పునరావృతమైతే ప్రభుత్వం, కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులం ఆంధ్రప్రదేశ్‌పై పోరాటంకు సిద్ధంగా ఉన్నామనీ స్పష్టం చేశారు.పాలమూరు జిల్లాకు నష్టం జరిగితే రైతు పక్షాన మా ప్రభుత్వం పోరాడుతుంది అని ఆంధ్రా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామనీ, ఇలాంటివి పునరావృతం అయితే చూస్తూ ఊరుకొనేది లేదు తెలిపారు. ఏపీ ప్రభుత్వం భవిష్యత్ లో ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తున్నాం ఇలాంటి వాటికి ఒడిగడితే తెలంగాణ ప్రజా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని అన్నారు. ఉమ్మడిరాష్ట్రంలో ఇలాగే వ్యవహరిస్తే ఆందోళన చేపట్టాం, హై కోర్టునాశ్రయించాం, అప్పుడు ఇప్పుడు మా రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం అని ఆయన వివరించారు. విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ,రాజేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

01-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, రేవతి కార్తె
చతుర్దశి ఉ.7.07
ఉత్తరఫల్గుణి సా.4.20
వర్జ్యం : రా.1.12-రా.2.54
దు.ఉ.11.46 - మ.12.35
శుభసమయం: ఉ.8.30-9.30
రాహుకాలం - మ.12.00-4.30

### వార్తాఫలం

**మేషం :** చాలా ప్రాంతాలు పర్యటిస్తారు. విదేశీయాన యోగ్యతకూడా ఉంది. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**వృషభం:** మానసికంగా మీకు అశాంతి కలిగించే విధంగా కొందరు వ్యక్తులు ప్రవర్తిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**మిథునం:** అవివాహితులైన వారికి వివాహకాలంగా చెప్పవచ్చు. నూతన విద్యలయందు ఆసక్తి కలిగిఉంటారు.

**కర్కాటకం:**మాట నిలకడలేని మనుషులతో కలిసి పనిచేసి నష్టపోతారు. వ్యాపారాలలో అధునాతనమైన పద్ధతులు.

**సింహం:** ప్రైవేట్ కంపెనీల్లో కూడా మంచి అవకాశాలు వస్తాయి. మిత్రులను కలిసి సంతోషంగా గడుపుతారు. ధన లాభం.

**కన్య:** విదేశాలలో ఉన్న మీ సన్నిహితవర్గం తిరిగి చేరువ అవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి. వస్త్రలాభం కలదు.

**తుల:**జీవితాశయం నెరవేరుతున్నట్టుగా అనిపిస్తుంది. కీలక నిర్ణయాలలో నిదానం అవసరం. నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** అంతర్గత శత్రువులు సమస్యలు సృష్టించినా ధైర్యంగా ఎదుర్కొంటారు. సోదరుల నుండి ధనలాభం కలుగుతుంది.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక వరిస్థితిలో చెప్పుకోదగిన ఒడిదుడుకులు ఉండవు.

**మకరం:** దీర్ఘకాలంగా వున్న శత్రువులు, మీకన్న ఉన్నత స్థానాలు సాధిస్తారు. మీరు ఏ విధంగానూ స్పందించకుండా వుండటం మేలు.

**కుంభం:** పోటీ ప్రపంచంలో ధనంతోపాటు తెలివితేటలు అవసరమని బోధించిన సన్నిహిత వర్గానికి దూరం అవుతారు.

**మీనం :**మీరు ఊహించిన రాజకీయ పదవులు లభిస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రమాదకరస్థాయికి శ్రీశైలం నీటిమట్టం

### 885 అడుగులకుగాను 821కి చేరిక
### ప్రాజెక్టులో ఇక మిగిలింది 44 టిఎంసిలే
### వేసవి పంటలకు సాగునీటి కటకట



**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** కృష్ణా నదిపై కీలకమైన రిజర్వాయర్లలో ఒకటైన శ్రీశైలం ప్రస్తుతం తీవ్ర నీటికొరతను ఎదుర్కొంటోంది. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు రికార్డుస్థాయిలో అడుగంటాయి. ప్రస్తుత రిజర్వాయర్‌లో కేవలం 44 టిఎంసిల నీటి నిల్వ మాత్రమే ఉంది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 215 టిఎంసిలు అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో 43 టిఎంసిలే ఉండడంతో సాగునీటి విషయంలో పరిస్థితి ప్రమాదకరంగా మారిందని తెలంగాణ నీటిపారుదలరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. శ్రీశైలంలో నీటి మట్టం వేగంగా తగ్గిపోతుండటంతో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 44 టిఎంసిల నీటిని తాగు, సాగునీటి అవసరాలకే అధికారులు పరిమితం చేస్తున్నారు.

జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడగులు కాగా ప్రస్తుతం 824 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. గతేడాది ఇదే రోజున శ్రీశైలం రిజర్వాయర్‌లో 821 అడుగుల నీటిమట్టంతో 42 టిఎంసిల నీరు నిల్వ ఉంది. అయితే శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ప్రమాదకరస్థాయికి పడిపోవడానికి ఎపి రాష్ట్ర వైఖరే కారణమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో పంటలు ఎండుతుంటే ఎపి ఎలా విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని ప్రశ్నించారు. తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తారా అని నిలదీశారు. శ్రీశైలం నీటి వినియోగం విషయంలో హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడాన్ని ఆపాలని ఎపి ప్రభుత్వానికి హితవు చెప్పారు. శ్రీశైలంలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాగా... అదేవిధంగా నాగార్జునసాగర్‌లో 170 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయి. వేసవి అవసరాలు పెరిగితే ప్రాజెక్టులో నీటి నిల్వలు వేగంగా తరిగిపోయే ప్రమాదం ఉంది.



మంగళవారం రాంచీలో ఓ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూలైన్‌లో ఉన్న ఖాళీ సిలిండర్ల వద్ద పహారా కాస్తున్న పోలీసు

## దండకారణ్యంలో దళాల కదలికలు!

>> విషయం తెలిసిందే పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న కేశవరావు (బస్వరాజ్) చనిపోవడంతో మావోయిస్టు అంతిమ గడియలు దెగ్గరపడ్డాయి. ఆయనతోపాటు చలపతి వివిక్ గౌతమ్ గాజర్ల రవి కట్టా రామచంద్రా రెడ్డి గణేష్ హిడ్మా వంటి కేంద్ర కమిటీ సభ్యులు చనిపొగా..కేశవరావు తర్వాత పగ్గాలు చేపట్టిన దేవ్ జీ (తిపరి తిరుపతి) సోను సతీష్ దామోదర్ రాజిరెడ్డి మరికొందరు నేతలు లొంగిపొయారు.నాలుగు దశాబ్దాలపాటు దండకారణ్యంలో సామాంతర పాలన నడిపిన మావోయిస్టు ఉద్యమ చరిత్రలో మునుపెన్నడూ చూడని అనిచివేతను చూసిన మావోయిస్టులు ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యమ బాట వీడి జనజీవన స్రవంతిలో కలవడమే ఉత్తమం అనుకొని అగ్రనేరలతోపాటు కేడర్ ఉద్యమ భాట వీడినా మరికొంత మంది అగ్రనేతలు గణపతి బెస్రా నరహరితోపాటు మరికొందరు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.అయితే గడువులోగా వీరందరూ బేషరతుగా లొంగిపొవాలని లేదంటే అంతం తప్పదని ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చట్టసభలో ప్రస్తావించాయి. దండకారణ్యంలో అక్కడక్కడ మావోయిస్టు కదలికలు ఉన్నాయని నిఘా వర్గాల సూచనల మేరకు భద్రతా బలగాలు నిరంతరం సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తుంది.ఆపరేషన్ కగార్ అధికారికంగా నేటితో ముగిసినా బలగాల వేట కొనసాగుతుంది.ఆపరేషన్ కగార్ లక్ష్యం నెరవేరిందా అంటే ఇంకా పూర్తిస్థాయిలో నెరవేరలేదనే చెప్పవచ్చును. దండకారణ్యంలో ఉన్న బలగాలు వివిధ కేడర్లకు చెందిన నాయకులు దళ సభ్యులు మిలీషియా సభ్యులు పూర్తిస్థాయిలో లొంగిపొతే మావోయిస్టు రహిత భారత్ పరిపూర్ణం కానుంది.

## రోహిత్ సహా ముగ్గురికి మళ్లీ కస్టడీ

>> రెండవ దఫాగా మూడు రోజుల కస్టడీకి ఇస్తూ రాజేంద్రనగర్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లో ని అజీజ్‌నగర్‌లో గల రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులతో పాటు చేవెళ్ల పోలీసులు రట్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా 11 మంది పట్టుబడగా ఇందులో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, ఢిల్లీకి చెందిన నమిత్ శర్మ, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవిలు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం విదితమే. అయితే పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్ రెడ్డికి చె ందిన లైసెన్స్ రివాల్వర్‌ను నమిత్ శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందుకు గాలిలో నాలుగు రౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. పోలీసులపై కాల్పులు జరపాలని రోహిత్ రెడ్డి పురిగొల్పినట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో రోహిత్ రెడ్డి తన ఫాం హౌస్‌లో అసాంఘీక కార్యక లాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివ్వార్‌ను మరో వ్యక్తికి ఇచ్చినందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్‌చేత పోలీసులపై కాల్పులు జరిపినందుకు నమిత్ శర్మను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలు రెండు వారాలుగా చం చల్‌గూడ జైల్లో వున్నారు. ఈ కేసులో వీరిని మరింతగా విచారించేందుకు మార్చి 23వ తేదీన పోలీసుల వినతి మేరకు రాజేంద్రనగర్ కోర్టు మూడు రోజుల కస్టడీ ఇవ్వగా మార్చి 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వీరిని శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో వుంచి విచారించారు. కస్టడీ ము గిసిన తరువాత మళ్లీ జైలుకు తరలించారు. అయితే మొదటి దఫా కస్టడీలో ముగ్గురు పెద్దగా వివరాలు వెల్లడించక పోవడంతో రెండవ దఫాగా ఐ దు రోజుల పాటు కస్టడీకి పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం వాదనలు ముగియగా మంగళవారం మధ్యాహ్న ం కోర్టు తీర్పు చెబుతూ ముగ్గురు నిందితులను మూడు రోజుల కస్టడీకి ఇస్తూ ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు వీరిని బుధవారం ఉదయం చ ంచల్‌గూడ జైలు నుంచి మొయినాబాద్ పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. శుక్రవారం నాడు తిరిగి చంచల్‌గూడ జైలుకు త రలించనున్నారు.

## కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న నందిని సిధారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి31:** ప్రముఖ కవి,రచయిత సామాజిక తెలంగాణ ఉద్యమకారుడు నందిని సిధారెడ్డి మంగళవారం సాయంత్రం ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఆయన రచించిన కవితా సంపుటి అనిమేషకు ఈ అవార్డు లభించింది. అనిమేష అంటే రెప్పలు వాల్చనిది అని అర్థం. కరోనా మహమ్మారి కాలంలో ప్రపంచ దేశాలు ఎదుర్కొన్న సంక్షోభాలు, ఆ సందర్భంగా మానవ సంబంధాల విచ్ఛిన్నం, కూలీల కష్టాలు తదితర అంశాలను ఇతివృత్తాలుగా తీసుకొని అనిమేషలో సిధారెడ్డి హృద్యంగా కవితలు చిత్రీకరించారు.

తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలిచైర్మన్‌గా వ్యవహరించిన సిధారెడ్డి తన రచనలతో తెలంగాణ సంస్కృతిని,అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న నందిని సిద్దారెడ్డికి తెలంగాణ సాహిత్య అకాడమికార్యదర్శి డా.ఎన్.బాలాచారి అభినందనలు తెలియజేశారు. సిద్దారెడ్డి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని,మరింత యశస్సు వరించాలని, అది సాహితీ లోకానికి ఒక స్ఫూర్తి కావాలని కోరారు.




న్యూఢిల్లీలో మంగళవారం ప్రముఖ కవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

## అకాల నష్టం!

>> కురిసిన భారీ వర్షం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న, మామిడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలో నిన్న రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి సుమారు 30 ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురిసిన అకాల వర్షానికి వరి, మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోవడంతో రైతులు విలపిస్తున్నారు. అకాల వర్షానికి చేతికొచ్చిన వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. జగిత్యాల జిల్లాలో నిన్న రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కారణంగా మామిడి, మొక్కజొన్న, నువ్వుల పంటలు నేలరాలాయి. జిల్లా వ్యాప్తంగా వంద ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా సుమారు మూడు వేల ఎకరాల్లో వరి, 3000 ఎకరాల్లో మొక్కజొన్న నేల రాలాగా, సుమారు 4000 ఎకరాల్లో మామిడి కాయలు రాలినట్లు సమాచారం.
ప్రతీ ఏడాది పంటలు చేతికి వచ్చే సమయంలో ఇలాంటి ఈదురు గాలులు, అకాల వర్షాలు కురవడం వల్ల భారీ నష్టాలు ఎదుర్కొంటున్నమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా.. జగిత్యాల జిల్లా కోరుట్లలో వర్షం కారణంగా గోడ కూలి రాజేష్ అనే వ్యక్తికి చెందిన డిజైర్ కారు ధ్వంసం అయ్యింది. కోరుట్ల మండలం నాగులపేట గ్రామానికి చెందిన రాజేష్ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో తన కారు పార్క్ చేశాడు. ఉదయం కురిసిన వర్షానికి ఇంటి రెండో అంతస్తుకు సంబంధించిన ప్రహరీ గోడ కూలి కారు మీద పడింది. రెండో అంతస్తు నుంచి గోడ కూలి పడటంతో కారు పూర్తిగా ధ్వంసమయింది.
రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. మూడు రోజులపాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇంచుమించుఇదేస్థాయిలో కొనసాగుతాయని తెలిపింది. రాష్ట్రంలో బుధ, గురువారాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

## ఎన్నికల ప్రచారం కోసం కేరళంకు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి31:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి కేరళం పర్యటనకు వెళ్లారు. అక్కడ కాంగ్రెస్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు రెండు రోజుల పాటు సమయం కేటాయించనున్నారు. తిరువనంతపురంకు చేరుకుని బుధ, గురు వారాల్లో ఆయన అక్కడ వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇప్పటికే అక్కడ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి కంటే ముందు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్ కేరళంకు చేరుకున్నారు.


## ఇక ఇరాన్ టార్గెట్

>> చుక్కలు చూపిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలుచేసారు. నిజానికి ఏప్రిల్ 6వరకూ దాడులుచేయబోమని ప్రకటించడం వెనుక ట్రంప్ వ్యూహం వేరే ఉందని నిపుణుల అంచనా. ఈ రోజుల్లోనే తన బలగాలను మొత్తం పశ్చిమాసియాకు తరలించి ఆరోతేదీ తర్వాత నుంచి భూతల దాడులు ముమ్మరంచేయాలన్నదే ట్రంప్ లక్ష్యమని ఇందుకు దౌత్యమార్గాల్లోచర్చలని, సంప్రదింపుల, మధ్యవర్తి దేశాలంటూ నాటకం ఆడుతున్నారని ఇరాన్‌మంత్రులు విమర్శిస్తున్నారు. మరోపక్క ఆరువారాల పాటు యుద్ధం ఉంటుందని ప్రకటించిన ట్రంప్ యుద్ధం ముగింపునకే సానుకూలంగా ఉన్నట్లు చెపుతున్నారు. ఈమేరకు వైట్‌హౌస్‌లో తన సహాయకులకు కూడా చెప్పారన్న వార్తలు వెలువడ్డాయి. భూతల దాడులుచేస్తే తమకు రష్యా, చెచెన్యా దేశాలమద్దతు ఉందని, దళాలు కూడా సిద్ధంగా ఉన్నాయంటూ ఇరాన్ అమెరికాకు వార్నింగ్ ఇచ్చింది. ఇదిలా ఉంటే మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధవ్యయం మొత్తం గల్ఫ్‌దేశాలు భరించేవిధంగా ట్రంప్ కొత్తప్రతిపాదన తెస్తున్నారు. ఇరాన్ ఓడిపోయేంతవరకూ యుద్ధం కొనసాగించాలని గల్ఫ్‌దేశాలు ట్రంప్‌ను కోరిన సంగతి తెలిసిందే. ఇదే అదునుగా ట్రంప్ తన బిజినెస్‌మ్యాన్‌ను తెరపైకి తెచ్చారు. యుద్ధ వ్యయం భరించాలని, మిత్రులను రక్షించుకునేందుకు అమెరికా సిద్ధమేనంటూ ప్రతిపాదనలు తెచ్చారని, అయితే గల్ఫ్‌దేశాలు ఎటూ తేల్చలేదని కూడా సమాచారం బయటకు పొక్కింది. ఇక ఇరాన్ ఐఆర్‌జీసీ బుధవారంనుంచి అమెరికా సంస్థలు, స్థావరాలపైనే దాడులుచేయాలనినిర్ణయించింది. యాపిల్, గూగుల్, మెటా వంటి సంస్థలే లక్షనయంగా ముందుకు వెళ్లాలనినిర్ణయించింది. తమ దేశంలో కీలక నాయకులను ఎంపికచేసుకుని మరీ హత్యలుచేసిన దేశాల్లోని టార్గెట్లను వదిలివేయకూడదన్న భావనతో ఐఆర్జీసీ ఉంది. మొత్తం 18 కంపెనీల పేర్లతో జాబితానుకూడా సిద్ధంచేసినట్లు ఇరాన్‌నుంచి వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ బడ్జెట్ ఆర్థికవ్యవహారాల అధిపతి జమ్‌షీద్ ఎషాఘికూడా ఇజ్రాయెల్ అమెరికా కాల్పుల్లో చనిపోయారని ఇరాన్ ధృవీకరించింది.

# సాంస్కృతిక వారసత్వమే మానవాళికి దిశానిర్దేశం

## గుజరాత్‌లో ప్రధాని మోడీ

**గాంధీనగర్, మార్చి 31:** ప్రపంచం అస్థిరత్వంతో సతమతమవుతూ, అశాంతి జ్వాలలతో దహించుకుపోతున్న క్లిష్ట సమయంలో సాంస్కృతిక వారసత్వమే మానవాళికి మార్గం చూపుతుందని ప్రధాని నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు. మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని గాంధీ నగర్‌లోని కోబా తీర్థ్‌లో ఏర్పాటు చేసిన సమ్రాట్ సంప్రతి మ్యూజియం ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మ్యూజియం ఇచ్చే సందేశం కేవలం భారత దేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని అన్నారు. అశోక చక్రవర్తి మనవడు, అహింసా మార్గాన్ని ప్రచారం చేసిన సమ్రాట్ సంప్రతి పేరుతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సేకరించిన జైన సమాజానికి చెందిన అమూల్యమైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని 1000 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావడం విశేషం. దశాబ్దాల పాటు తమ జీవితాలను అంకితం చేసి, భారతదేశం, నేపాల్ నుంచి ఈ కళాఖండాలను సేకరించిన జైన సన్యాసి ఆచార్య పద్మసాగర్ సూరీశ్వర్జీ సేవలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ మ్యూజియం కేవలం కళాఖండాల భాండాగారం మాత్రమే కాదని, ఇది జైన ఆరాధనకు, సంస్కృతికి, వారసత్వ పరిరక్షణకు ఒక శక్తిమంతమైన కేంద్రమని ప్రధాని మోడీ అభివర్ణించారు. కోబా తీర్థ్ ఎంతో కాలంగా శాంతికి, ఆధ్యాత్మిక సాధనకు నెలవుగా ఉందని గుర్తుచేశారు. ఈ మ్యూజియం రూపకల్పనలో వేదాలు, పురాణాలు, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని, ఇది మన భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ కేంద్రాన్ని పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యూజియంలో జైన తత్వశాస్త్రం, తీర్థంకరుల జీవితాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, ఆలయ నమూనాలు, చారిత్రక కళాఖండాలతో కూడిన ఏడు గ్యాలరీలు ఉన్నాయి. సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియోవిజువల్ టెక్నాలజీని మేళవించి సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఈ మ్యూజియం సాంస్కృతిక పరిరక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ మాట్లాడుతూ వికాస్ , విరాసత్ భీ (అభివృద్ధి, వారసత్వం రెండూ) అనే ప్రభుత్వ దార్శనికతకు ఈ మ్యూజియం నిదర్శనమని, ప్రధాని చేతుల మీదుగా ఇది ప్రారంభం కావడం జైన సమాజానికి గర్వకారణమని తెలిపారు.





# నేడు ఆర్టెమిస్-2 ప్రయోగానికి నాసా సన్నాహాలు




**న్యూయార్క్, మార్చి 31:** అంతరిక్ష ప్రయోగాల్లో మరో చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమైంది. దశాబ్దాల తర్వాత తొలిసారిగా మానవులను చంద్రుడి వద్దకు పంపేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) చేపట్టిన ఆర్టెమిస్2 ప్రయోగానికి సన్నాహాలు పూర్తయ్యాయి. బుధవారం ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ఈ మిషన్ లో భాగంగా నలుగురు వ్యోమగాములు సుమారు 10 రోజుల పాటు చంద్రుడి చుట్టూ ప్రయాణించి తిరిగి భూమికి రానున్నారు. ఆర్టెమిస్ కార్యక్రమంలో భాగంగా మానవులతో చేపడుతున్న తొలి యాత్ర ఇదే. అపోలో మిషన్ల తర్వాత మనుషులు భూమికి అత్యంత దూరంగా ప్రయాణించడం కూడా ఇదే మొదటిసారి. ఈ బృందంలో నాసా వ్యోమగాములు రీడ్ వైజ్‌మన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్‌తో పాటు కెనడియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన జెరెమీ హాన్సెన్ ఉన్నారు. నాసాకు చెందిన అత్యంత శక్తిమంతమైన స్పేస్ లాంచ్ సిస్టమ్ రాకెట్ ద్వారా ఒరియన్ వ్యోమనౌకను నింగిలోకి పంపనున్నారు. ఈ యాత్రలో తొలిసారిగా మానవులతో ఒరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లోని జీవనాధార వ్యవస్థలను (లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్) పరీక్షించనున్నారు. ప్రయోగం రోజున వాతావరణం 80 శాతం అనుకూలంగా ఉంటుందని నాసా అంచనా వేస్తోంది. మేఘాలు, గాలుల తీవ్రత సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపింది. ప్రయోగం తర్వాత వ్యోమనౌక భూమి ఎగువ కక్ష్యలోకి చేరి, అక్కడి నుంచి చంద్రుడి వైపు ప్రయాణిస్తుంది. చంద్రుడి సుదూర ప్రాంతం చుట్టూ తిరిగి, ఎటువంటి అదనపు ఇంధనం అవసరం లేకుండానే భూమికి తిరిగి వచ్చేలా ఫ్రీరిటర్న్ ట్రాజెక్టరీఖిలో ఈ యాత్రను రూపొందించారు.

# కూకట్‌పల్లి కైతలాపూర్‌లో దారుణం

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**హైదరాబాద్(కెపిహెచ్‌బి కాలనీ), మార్చి 31, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కైతలాపూర్‌లోని రాఘవేంద్రకాలనీలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులను హత్యచేసి అనంతరం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోడమాణిక్యం తండాకు చెందిన బానోతు స్రవంతి(27) ఇద్దరు కుమారులైన బానోతు కార్తీక్(10), బానోతు కౌశిక్(8)లతో కలిసి కైతలాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో కొంత కాలంగా నివాసం ఉంటున్నది. కాగా భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరగడంతోపాటు ఇటీవల భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని స్రవంతికి తెలియడంతో మానసిక వేదనకు గురైంది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఇద్దరు పిల్లలకు ఉరివేసి చంపేసిన అనంతరం స్రవంతి కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు, క్లూస్‌టీం ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కూకట్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# నేటి నుంచి అంగన్‌వాడి కేంద్రాలు ఒంటిపూట

## మే నెలలో వేసవి సెలవులు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎప్రిల్ నెలలో అంగన్‌వాడి కేంద్రాలను హాఫ్‌డే పద్ధతిలో నిర్వహించేందుకు అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎప్రిల్ 1 నుంచి ఎప్రిల్ 30 వరకు అంగన్‌వాడి కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయి. మే 1 నుంచి మే 31 వరకు అంగన్‌వాడి పిల్లలకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లకు సెలవులు మంజూరు చేశారు. అయితే సెలవుల సమయంలో అంగన్‌వాడి సిబ్బంది కొన్ని బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటిలో భాగంగా పిల్లలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయాలి. 0-5 సంవత్సరాల పిల్లల్లో అభివృద్ధి లోపాలను ముందుగానే గుర్తించేందుకు ఇంటింటా సర్వేలు నిర్వహించాలి. ప్రీస్కూల్‌లో పిల్లల నమోదు, డ్రాప్‌ఔట్ అయిన పిల్లలను మళ్లీ అంగన్వాడి కేంద్రాల్లో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలి. వేసవి సెలవుల్లో అంగన్వాడీ సిబ్బంది తాము నిర్వహించిన కార్యకలాపాలపై సమగ్ర నివేదిక సమర్పించాలి. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు జరిగే చైల్డ్ సేఫ్టీ వీక్, మే 25 నుంచి మే 30 వరకు నిర్వహించే ఉమెన్ థీమ్ వారోత్సవ కార్యక్రమాల్లో అంగన్ వాడీ సిబ్బంది పాల్గొనాలని మహిళాశిశు సంక్షేమశాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# నేటి నుంచి జూనియర్ కాలేజీలకు వేసవి సెలవులు

## 10న ఇంటర్ ఫలితాలు

## జూన్ 1 నుంచి 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు నేటి(బుధవారం-ఏప్రిల్ 1) నుంచి వేసవి సెలవులు ఇవ్వనున్నారు. సుమారు 2 నెలలపాటు వేసవి సెలవులు కొనసాగి తిరిగి జూన్ 1 నుంచి 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇప్పటికే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగిసి రెండు వారాలు కావొస్తోంది. ఇంటర్ పరీక్షల ఫలితాలను ఈ నెల 10న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 10న ఫలితాలు విడుదల చేయకపోతే 11న గానీ లేదంటే 13న గానీ ఫలితాలను ప్రకటించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభమై మార్చి 18తో ముగిశాయి. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 15 నుంచి 20 కేంద్రాల్లో ప్రారంభించారు. నేటి(ఏప్రిల్1)తో మూల్యాంకన ప్రక్రియ ముగియనుంది. దీంతో ఫలితాలకు సంబంధించిన క్రోడీకరణ పనులకు ఇంటర్ బోర్డు అధికారులకు కనీసం 8 రోజులు పట్టే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9 నాటికి ఫలితాల క్రోడీకరణ పనులను సైతం పూర్తి కానున్నాయి. ఆ తరువాత ఈ నెల 10న ఫలితాలను విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫలితాల విడుదలకు సంబంధించి ప్రభుత్వ పెద్దల అందుబాటును దృష్టిలో పెట్టుకొని ఈ నెల 10న ఫలితాల విడుదలకు అవకాశం లేకపోతే 11న గానీ లేకపోతే 13న ఇంటర్ ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది.

ఏప్రిల్‌లో ఫలితాలు వెలువడిన వెంటనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు గడువు, పరీక్షల నిర్వహణతోపాటు ఫలితాల విడుదల ప్రక్రియను మే 31లోపుగా పూర్తి చేసుకొని జూన్ 1 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరంతోపాటు మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా 2026-27 విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 31.03.2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) (పార్టీ పేరు) అధ్యక్షులు శ్రీ డాక్టర్ దార శేషగిరిరావు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకోనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో 1) శ్రీ డాక్టర్ దార శేషగిరిరావు, స్టేట్ ప్రెసిడెంట్ గారు 2) శ్రీ కె. సంజీవులు, స్టేట్ జనరల్ సెక్రటరీ 3) శ్రీ ఎస్. వెంకయ్య, స్టేట్ ట్రెజరర్ గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు, మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము: 15-20-326, యుపిహెచ్ కాలనీ, బాలాజీ నగర్, ఖానాపురం హవేలీ, ఖమ్మం-507002. సదరు పార్టీ రిజిస్ట్రేషన్‌పై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, డిటిసిపి భవనము, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్దిష్ట గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల సరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) PPID (పార్టీ పేరు)ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

డాక్టర్ దార శేషగిరిరావు
అధ్యక్షులు
పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) తెలంగాణ రాష్ట్రం
(రాజకీయ పార్టీ పేరు)

# నేటి నుండి చికెన్ షాప్‌లు బంద్

## మార్జిన్ తగ్గించి పొట్ట గొడుతున్నాయని

## చికెన్ కంపెనీలపై యజమానుల ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా చికెన్ సెంటర్లు మూతపడనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపుల బంద్‌కు తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. హైదరాబాద్ మహా నగరంలో కూడా చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరగనుంది. పౌల్ట్రీ కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ మార్జిన్‌ను తగ్గించడం వల్ల తీవ్ర నష్టాలు వస్తున్నాయని చికెన్ షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో 1.8 గా ఉన్న మార్జిన్‌ను ప్రస్తుతం 1.5కి తగ్గించడమే ఈ బంద్‌కు ప్రధాన కారణమని స్పష్టం చేస్తున్నారు. ఫలితంగా చికెన్ షాపుల నిర్వహణ భారంగా మారిందని, తమకు వచ్చే మార్జిన్ అస్సలు సరిపోవడం లేదంటున్నారు. గతంలో కిలో చికెన్‌పై రూ.30 నుండి రూ.35 వరకు లాభం మిగిలేదని, కానీ ప్రస్తుతం పెరిగిన ధరల వల్ల అన్ని ఖర్చులు పోను కేవలం రూ.5 నుండి రూ.6 మాత్రమే మిగులుతోందని వాపోతున్నారు. షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, పనివారి జీతాలు, మున్సిపాలిటీ నీటి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని, లాభాలన్నీ పెద్ద పౌల్ట్రీ కంపెనీలకే వెళ్తున్నాయని, రిటైల్ వ్యాపారులను ఆదుకోవడానికి మార్జిన్ పెంచాలని చికెన్‌షాపుల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా ఒక కిలో బతికున్న కోడి ధర రూ.120 అనుకుంటే దానిని కట్ చేసిన తర్వాత వచ్చే మాంసం సుమారు 750 గ్రాములు మాత్రమే ఉంటుంది. దీనివల్ల కిలో చికెన్ ధర అప్పటికప్పుడే రూ.160కి చేరుతుంది. దీనిని కస్టమర్‌కు రూ. 200కి అమ్మినప్పుడు రూ. 40 లాభం కనిపిస్తుంది. కానీ ఇందులో షాపు రెంట్, కరెంట్ బిల్లు, కూలీల జీతాలు వేస్టేజ్, అమ్ముడుపోని స్టాక్ వంటివి తీసేస్తే తమకు మిగిలేది చాలా తక్కువ అని షాపు ఓనర్లు చెబుతున్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 8,000 నుండి 10,000 వరకు చికెన్ షాపులు ఉన్నాయి. ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు, షాపు యజమానుల మధ్య ఈ ధరల యుద్ధం త్వరగా ముగియకపోతే, మార్కెట్ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన చేపట్టాలని చికెన్ షాపుల యజమానులు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చికెన్ షాపుల యజమానులందరూ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని నాచారం అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మార్జిన్ పెంపుపై పౌల్ట్రీ కంపెనీలు స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అసోసియేషన్ స్పష్టం చేసింది. కాదని షాపులు తెరిచే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించింది.

# అమెరికా పర్యటనకు కెటిఆర్

## కొలంబియా ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి31: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటనకు బయల్దేరి వెళ్లారు. వారం రోజుల పాటు ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మరోసారి గ్లోబల్ వేదికపై ఆయన స్వరాన్ని వినిపించనున్నారు. కొలంబియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న బిజినెస్ కాన్ఫరెన్స్ లో కేటీఆర్ పాల్గొననున్నారు. కొలంబియా ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ 2026లో ప్రసంగించనున్నారు. కేటీఆర్ పర్యటనతో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు మెరుగుపడవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్లను తెలంగాణకు పరిచయం చేసే బ్రాండ్ అంబాసిడర్‌గా కీలక పాత్ర పోషించారు

# ముగిసిన ఐ సెట్ దరఖాస్తు గడువు

## రూ. 250 అపరాధ రుసుంతో 15 వరకు అవకాశం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఎంబిఏ, ఎంసిఏ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఐ సెట్-2026కి సంబంధించిన దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. ఇప్పటి వరకు 39వేల దరఖాస్తులు వచ్చినట్టు ఐ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ ఆలవాల రవి తెలిపారు. అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు గడువును రెండుసార్లు పొడిగించి మార్చి 31 వరకు అవకాశం కల్పించారు. అపరాధ రుసుం రూ. 250తో ఈ నెల 15 వరకు అవకాశం కల్పించారు. ఐ సెట్‌కి సంబంధించి.. ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ వెలువడగా.. ఫిబ్రవరి 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించారు. ఐ సెట్-2026 పరీక్షను మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించనుంది. ఫిబ్రవరి 12 నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. నోటిఫికేషన్‌లో మార్చి 16 వరకు దరఖాస్తుల స్వీకరకు తుది గడువుగా ప్రకటించగా.. అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువును కాస్త మార్చి23 వరకు ఆ తరువాత మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్టు ఐ సెట్ అధికారులు ప్రకటించారు.

మే 13, 14న పరీక్షలను నిర్వహించనున్నారు. మే 13న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉదయం సెషన్‌ను, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు. మే 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒకటే సెషన్‌లో పరీక్షలను నిర్వహించనున్నారు.

# ఆరోగ్యం గుల్లచేస్తున్న నకిలీ అల్లం పేస్ట్

## 4 వేల కిలోల పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## హైదరాబాద్ కాటేదాన్ పారిశ్రామికవాడలో కుప్పతెప్పలుగా నకిలీ కంపెనీలు

**హైదరాబాద్ (అత్తాపూర్), మార్చి 31, ప్రభాతవార్త:** కాటేదాన్ పారిశ్రామిక వాడ నకిలీల తయారీ అక్రమార్కులకు అడ్డాగా మారింది. నిత్యం అధికారులు తనిఖీలు చేసి నిర్వాహకులను అరెస్టు చేసి కంపెనీలను సీజ్ చేస్తున్నా మళ్లీ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. మంగళవారం మైలార్‌దేవ్ పల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో కలుషిత అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్, హెచ్ ఫాస్ట్ బృందం సంయుక్తంగా దాడులు చేశాయి. ఎస్‌కెఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీలో నకిలీ అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నారని పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి అబిడ్స్‌కు చెందిన నిందితుడైన హసన్‌అలీ రూపానీ (55)ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అపరిశుభ్ర వాతావరణం, అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల్లో ప్లాస్టిక్ డబ్బాల్లో ఈ పేస్ట్‌ను తయారుచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి కలుషిత పేస్టు తయారు చేస్తున్నారు. అదేవిధంగా పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్ వంటి రసాయనాలను కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ కలుషిత పేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం వల్ల దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు గమనించారు. దీనిని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రూ. 22,00,000ల విలువైన 4,032 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. 6,000 కిలోల నాణ్యత లేని వెల్లుల్లి, 210 కిలోల నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్, 5 గ్రైండింగ్ యంత్రాలు సీజ్ చేశారు. నిందితుడిని, సీజ్ చేసిన సామాగ్రిని తదుపరి చర్యల నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. రాఘవేందర్, ఎస్సై శ్రీకాంత్, మైలార్‌దేవ్‌పల్లి ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌కెఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీలో దాడులు చేస్తున్న అధికారులు

BAJAJ FINANCE

**బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన**

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్డి, పూణె - 411035**

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు. నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యూవెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యూవెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;

(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;

(c) నియమాలు మరియు షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/-ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;

(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు

(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.

(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.

(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్‌ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత(లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యూవెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీపై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in

(11-05-26): ఆర్మూర్ - అంబేడ్కర్ చౌరాస్తా; PB56SGL17141736. భద్రాచలం - ఆర్‌టిసి బస్ స్టాండ్; PEK5SGL17130838, 17344331. భైంసా - ఆర్‌టిసి బస్ స్టాండ్; PPA4SGL16920584, 17015284, 17111530, 17237780, 17365243. భోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్; PEJ7SGL16903445, 17114951, 17106115, 17129987, 17369842. భూపాల్‌పల్లి - మైన్ రోడ్; PCW2SGL16806111, 16891022, 17370631. సూర్యపేట్ - గాంధీ విగ్రహం; PJG4SGL16851908, 16860430, 16875739, 16902254, 17089904, 17183907, 17235688, 17295280. (12-05-26) గద్వాల్ - రాజీవ్ పార్క్; PCW4SGL16892876, 16920843, 17162877, 17284945, 17317191. గజ్వేల్ - పిడ్చేడ్; PEJ6SGL17066970, 17110274, 17116145, 17142348, 17262324. హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్; PGC7SGL16875238, 16893510, 16945802, 17181265. హుజూరాబాద్ - వరంగల్ రోడ్; PJH1SGL17072072. ఇబ్రాహింపట్నం - బీజీఎల్; POC5SGL17159944, 17269241. జగ్తియల్ - ధర్మపురి రోడ్; PCW6SGL17340443. తాండూర్ - ఇందిరా చౌక్; PDA6SGL16798710, 17013740. (13-05-26): జనగాం - బాలాజీ నగర్; PCW7SGL17241593. కామారెడ్డి - నిజామ్‌సాగర్ రోడ్; P86QSGL16849199, 16935257, 17317453, 17333722. ఖమ్మం - గాంధీ చౌక్; PB54SGL16798647, 16820131, 16947160, 17016084, 17044081, 17066491, 17314426. ఖమ్మం - జమ్మిబండ రోడ్; PGG1SGL17284351, 17379771. ఖమ్మం - ఖానాపురం హవేలీ; POH9SGL17180333. (14-05-26) కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్; PJV4SGL17269974, 17270740. కొత్తగూడెమ్ - మధుర బస్తి; PEJ5SGL17131037. మహబూబ్‌నగర్ - తెలంగాణ చౌరాస్తా; POI2SGL17119929. మణుగూరు - అశోక్ నగర్; PCX1SGL17223666, 17323602. మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్; PCX2SGL16072286, 16786153, 16897525, 17005118. (15-05-26) మెట్‌పల్లి - మైన్ రోడ్; PEF7SGL16827551, 16903209, 17046041, 17106488, 17343241. మిర్యాలగూడ - బీజీఎల్; PNT9SGL16768808, 16769778, 16829578, 16823866, 17027416, 17163737, 17214054, 17273420. ములుగు - గాంధీ చౌక్; PJV5SGL17180864, 17241935, 17236109, 17369335. నల్గొండ - ఆర్‌పీ రోడ్; PNT8SGL16895281. నారాయణ్‌పేట్ - నర్సిరెడ్డి చౌరాస్తా; PJH5SGL17217611. (18-05-26) నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్; PCX3SGL16829610, 16946139. నిర్మల్ - గంగా కాంప్లెక్స్; PCX4SGL16972358, 17004972, 17338588. నిజామాబాద్ - కపిలా హోటల్ రోడ్; PB94SGL17187780, 17309506. నిజామాబాద్ - వినాయక నగర్; PCX5SGL16871390, 17215109. పర్కల్ - బస్ స్టాండ్; PJG8SGL16769600, 16946943, 17219212. పెద్దపల్లె - సుభాష్ నగర్; PEO3SGL17065790, 17315726. (19-05-26) సంగారెడ్డి - బీజీఎల్; P4D3SGL15698395, 16850030, 17088693. సత్తుపల్లి - సూపర్ మార్కెట్; PCX8SGL16811609, 16835079, 17175732, 17381699, 17365063. శంశాబాద్ - బీజీఎల్; POA8SGL15797284, 16807450, 17039670, 17063742, 17062381, 17130242, 17298796, 17368495, 17368671. సిద్దిపేట్ - మెదక్ రోడ్; PGM8SGL16776630, 16799334, 17040181, 17244053. సిర్సిల్లా - మెయిన్ రోడ్; PB66SGL16850733, 17090859, 17085313. (20-05-26): తొర్రూర్ - వరంగల్ రోడ్; PJH3SGL17211725. తూప్రాన్ - రామాయంపేట్ రోడ్; PJT5SGL16934910, 17048427, 17366786. తంగ్కయగాంజల్ - రాఘవేంద్ర నగర్; PLP1SGL17346443. వనపర్తి - రాజీవ్ చౌక్; PCX9SGL16883070, 17145149, 17222288. వరంగల్ - కెయు క్రాస్‌రోడ్; PGP7SGL16779243. వరంగల్ - స్టేషన్ రోడ్; P04ISGL16880414. వరంగల్ - సూబేదారీ; PB55SGL16785648, 16784965, 16856349.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటుందో దాన్ని సాధించడానికి ఎంచుకునే మార్గం కూడా అంతే సమున్నతంగా ఉండాలి.

- రామకృష్ణ పరమహంస

# ఎందుకంతటి 'యుద్ధం'!

తమ ఓటు ద్వారా రెండో సారి గద్దెనెక్కిన డొనాల్డ్ ట్రంప్ తమ అభీష్టాలకు వ్యతిరేకంగా,ఆకాంక్షలను పట్టించుకోకుండా నిర్వహిస్తున్న పాలనను ఇప్పుడు అమెరికన్‌లే వ్యతిరేకిస్తున్నారు. అనేక దేశాల్లో జెన్ జి విప్లవాలు మొదలయ్యాక ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆలో చనలలో తేడా వచ్చింది. ప్రజాస్వామ్యయుతంగా గళ మెత్తుతున్నారు.అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ తన నికృష్ట పాలనతో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టేసారన్నది అక్కడి విపక్షం నుంచే కాదు స్వపక్షం నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమౌతోంది. కొందరు కీలక సలహాదారులు సైతం ఆయన్ని విడిచి వెళ్ళారు.ఒక అడుగు ముందుకేసి 'నో కింగ్స్' పేరిట ఉద్యమిస్తున్నారు. దేశవ్యాప్తంగా లక్ష లాది మంది జనం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇమిగ్రేషన్ వ్యతిరేక విధానాలను తప్పుబ డుతూ 'ప్లేకార్డు'లు ప్రదర్శన చేశారు. సెయింట్ పాల్ నగరంలో కనీవినీ ఎరుగనంతగా భారీ ప్రదర్శన జరిగిం ది. దేశవ్యాప్తంగా 50రాష్ట్రాల్లో, మూడు వేలఐదు వంద లకు పైగా నగరాల్లో, పట్టణాల్లో ట్రంప్‌కు వ్యతి రేకంగా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇజ్రాయిల్ కోసం ట్రంప్ ఇరాన్‌పై దాడులకు పురికొల్పి చివరకు అమెరికా ఖజానా ఖాళీ అయ్యే పరిస్థితి తెచ్చిపెట్టారని ఆరోపిస్తున్నారు. తమ దేశంకోసం కాక మిత్రదేశాల కోసం ట్రంప్ అనవ సర యుద్ధ వ్యయం చేస్తున్నారని మండి పడుతున్నారు. ఇరాన్ పై యుద్ధానికి అమెరికన్లు ఎందుకు మూల్యం చెల్లించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి యుద్ధాల వల్ల సంపన్న దేశాలు మరింత సంపన్నంగా మారితే పేద దేశాలు మరీ పేద దేశాలుగా మారుతా యని అభిప్రాయాలున్నాయని పలువురు ఆర్థిక వేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని మింగేసే వంటి ట్రంప్ విపరీత పోకడలకు తెరదింపాలని వారు కోరుకుంటున్నారు. దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి రావడం ఇదే ప్రథమం. ఈ ఆందోళన అమెరికాకే పరిమితం కాలేదు. దక్షిణ అమెరికా,యూరప్ దేశాల్లోనూ ప్రజలు పెద్దఎత్తున 'నో కింగ్స్' ర్యాలీల్లో పాల్గొని అమెరికా ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఒక పక్క తాను ఇప్పటికే 8 యుద్ధాలను ఆపానని, ప్రపంచానికే శాంతిదూత కావాలనుకున్నట్లు చెప్పుకునే ట్రంప్ దూకుడుకు ఇప్పటికే ఎన్నో దేశాలలో ప్రశాంత జీవనం కరువైంది. అంతర్జాతీయంగా చమురు సంక్షోభం తలె త్తింది. సాధారణ జీవనానికి, ఆహార భద్రతకు సమస్య లు తలెత్తాయి. ఇవన్నీ ఇప్పుడు అమెరికన్లు కలత చెందే విషయాలు.వీటిని ట్రంప్ దృష్టికి తీసుకు వెళ్లాలనే పరోక్ష ఆశాభావం కూడా వారిలో ఉండచ్చు. అదే వారి నిరసనలకు కారణం. యుద్ధం మరింత కాలం కొనసాగించాలంటే భారీ ఎత్తున నిధులు కావాలని పెంటగాన్ ఇండెంట్ పెట్టింది. ఇవన్నీ అమెరికన్ల రక్షణ కోసమో, భద్రత కోసమో కాదని తేలిపోయింది. ఈ యుద్ధంతో తనకేమీ పనిలేదని కూడా జనం నమ్ము తున్నారు. అందుకే వారు నడి వీధుల్లోకి వచ్చారు. ఒక పక్క నాటో కూటమి ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకిస్తోం ది. స్పెయిన్, శ్రీలంక వంటి దేశాలు సైతంఅంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా అమె రికా, ఇజ్రాయిల్‌లు చేస్తున్న యుద్ధాలకు తమ దేశ గగన తలాలను వాడుకునేందుకు సైతం అంగీకరించడం లేదు. అమెరికా సాగించే యుద్ధా నికి ఏకపక్ష యుద్ధంగా తేల్చేసింది. ఐక్యరాజ్యసమితి కూడా అమెరికా చేసే యుద్ధా నికి సానుకూలత వ్యక్తం చేయడం లేదు. ట్రంప్ తనంతట తానే శాంతి కాము కుడినని చెప్పుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదు. తమ దేశ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సి న అవసరముంది. మొన్నామధ్య వెనిజువెలాపై దాడిలో దేశాధ్యక్షుడిని బంధించి అమెరికాకు తీసుకురాగలగడంతో ఆయన అహంకారానికి అడ్డు అదుపులేకుండా పోయింది.ప్రపంచ శాంతికి పెనుముప్పు తెచ్చినా ఆయనను ఏవర్గాలు అంగీకరించకపోయినా ఆయనలోమార్పు లేదు. ఆయన వ్యూహాలపై ఎవరికీ నమ్మకం లేదు. రోజురోజుకూ తన ను ఆయన దూకుడు భూతలదాడుల వరకు వెళ్లినట్లు చెప్పుకుంటున్నా, వైరి పక్షం బలిమి గురించి అంచనా లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారనే అభిప్రాయాలు ప్రజల్లో ఉన్నాయి. మరింత అభిశంసనకు గురికాకుండా ట్రంప్ తన సైనిక విన్యాసాలను తగ్గించుకోవడంమంచిది. ట్రంప్ నిర్ణయాలతో అమెరికా ఖజానా కూడా తరిగిపో తోంది. అమెరికా ఇంతవరకు చేసినయుద్ధానికి దాదాపు 27.68 మిలియన్ డాలర్ల ఖర్చు చేసినట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక విడు దల చేసింది. 'ఖర్గ్ ద్వీపాన్ని పేల్చేస్తాం, చమురు క్షేత్రా లతోపాటు విద్యుత్ వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేసేస్తా' మంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ఇరాన్‌కు అల్టిమేటం జారీ చేసిన సంక్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్ బెదరడం లేదు. అందుకే ట్రంప్ ఎంత వీలైతే అంత తొందరలో యుద్ధ విరమణ చేయడం మంచిదేమో! ట్రంప్ పెట్టే స్వల్పకాలపు గడువులన్నీ తన బెదిరింపు లకు వైరి దేశాలు లొంగిపోతున్నట్లు ఊహించుకునే చేస్తున్నట్లు ఉంది. సరకు రవాణా నౌకలరాకపోకల కోసం హార్మూజ్ జలసంధిని తెరవాలని ట్రంప్ ఎన్నో మార్లు విజ్ఞప్తి చేసినా ఇరాన్ స్పందించలేదు. దానిపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యుద్ధం ముగింపు కోరు కోవడం మంచిదే కానీ యుద్ధాన్ని ప్రారంభించిన వారే ముగింపు పలకాలనీ, పాకిస్థాన్ మధ్యవర్తిత్వం తమకు అవసరం లేదని ఇరాన్ ఖరాఖండిగా తేల్చి చెప్పింది. ఇలాంటి పరిస్థితుల్లో తన దేశంలో అంతర్గతంగా మరిన్ని నిరసనలు వ్యక్తం కాకుండా ట్రంప్ పునరాలోచించుకోవాలి.



పగతీర్చుకుంటే ఆ రోజు మాత్రమే ఆనందం కలుగుతుంది. ఒకరోజు ఆనందం కోసం చిరకాలం కలిగే ఆనందాన్ని బలిపెట్టకూడదు.

తిరుక్కురళ్



మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.

స్వీడన్ బర్గ్

## ప్రజావాక్కు



### ఎఐతో సమస్యకాదు.. యుద్ధంతో సమస్య

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏమిటి అనేప్రశ్నకు చాలామంది వెంటనే చెప్పే సమాధా నం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ). ఉద్యోగాలు పోతా యనే భయం, యంత్రాలు మనుషులను భర్తీ చేస్తాయనే ఆందోళన. ఇవన్నీ నిజమే. కానీ ఒక అడుగు వెనక్కి వేసి చూస్తే అసలు ప్రమాదం అక్కడ కాదు. నిజమైన భయం యుద్ధం.ఎందుకంటే ఎఐజీవనోపాధిని ప్రభావితం చేస్తుం ది. యుద్ధం జీవనాన్నే తీసుకుపోతుంది. ఎఐ వల్ల ఉద్యో గాలు మారుతున్నాయి.కొన్నిరంగాల్లో మానవ శ్రమ అవ సరంతగ్గుతోంది.ఇదిచాలామందికిఆందోళన కలిగిస్తున్నది. అంటే ఎఐ ఒకమార్పు కొత్త నైపుణ్యాలునేర్చుకుంటే, కొత్త అవకాశాలు దొరుకుతాయి. జీవితం కొనసాగుతుంది.కానీ యుద్ధం అలాంటిది కాదు.యుద్ధం అంటేఎప్పుడు ఎక్కడ బాంబులు పడతాయో తెలియని భయం.ఎఐ వల్ల ఉద్యో గంపోయిన వ్యక్తి మళ్లీ లేచినిలబడే అవకాశం ఉంటుంది.

- ఎల్లబోయిన వెంకటేశ్వర్లు, హైదరాబాద్

### ముందస్తు టోకెన్లు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,కర్ణాటక వంటి రాష్ట్రా ల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల రద్దీ పెరిగిన మాట నిజమే. మీరుచెప్పిన టోకెన్ వ్యవస్థ,డిజిటల్ క్యూ మేనేజ్మెంట్ ద్వారాక్రమశిక్షణ తీసుకురావచ్చు. ముందస్తు టోకెన్లతో బస్సుసామర్థ్యాన్ని బట్టి టోకెన్లు ఇవ్వడం వల్ల తోపులాటలుతగ్గుతాయి.దివ్యాంగులకు,వృద్ధులకు ప్రత్యే కంగారంగుల టోకెన్ల ద్వారా వారికి ప్రాధాన్యత ఇవ్వడం మంచి ఆలోచన.మొబైల్ యాప్‌ద్వారా బుకింగ్ సౌకర్యం కల్పిస్తే రద్దీని ముందే అంచనా వేయవచ్చు. టోకెన్లు అం దించేందుకు రద్దీ ఉన్న బస్టాండ్స్‌లో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేయాలి. ఈ కౌంటర్స్‌లో నిరుద్యోగ భృతి ఇచ్చే ఆలోచనలు వున్న ప్రభుత్వాలు నిరుద్యోగులకు టోకెన్లు ఇచ్చే పని అప్పగించాలి.

- వె.వెంకటేష్, నెల్లూరుజిల్లా

### మళ్ళీ మొదలైన క్రికెట్ సందడి

బెట్టింగ్ ప్రియులారాబెట్టింగ్‌లో డబ్బులుపెట్టిచాలా ఎక్కు వ డబ్బులు సంపాదించొచ్చు అనే ఆశ పడకండి .మనకి డబ్బులు వచ్చే కంటే మన నుండి డబ్బులు పోయేటివే ఎక్కువ. బెట్టింగ్ మాయలో పడి మీ విలువైన జీవితాన్ని ఆగం చేయొద్దు. త్వరగా డబ్బులు సంపాదించాలి అనే పేరుతో డబ్బులు పెట్టి అప్పుల పాలు అవ్వొద్దు. అమ్మ నాన్నలను దూరం చేసుకోవద్దు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### గుళ్లు కాదు బడులు నిర్మించండి

గుళ్ల ఆటవికం,బళ్ళు ఆధునికం.ఈమధ్య పాత గుళ్లను పున ర్నిర్మించడం ఒకఫాషన్ అయిపోయింది.ప్రతివాడు సనాతనం అని ప్రచారం చేస్తున్నాడు.వాస్తవానికి సనాతనం అంటే ఏమి టో కూడా తెలియదు. అది ఈనాటి సమాజానికి ఎందుకు పనికిరాదో తెలియదు.మా నాయనమ్మ, మాతాత సనాతనం అన్నారు కాబట్టినేను అంటున్నాను, మీరుకుడా అనండి తప్ప ఏమీతెలియదు.పూర్వజనం గుళ్ల నిర్మించేవాళ్ళు. గుళ్ల భక్తిని పెంచుతాయి.భక్తి ఆలోచనని చంపుతుంది.ఇదంతా మతస్తుల పన్నాగం.ప్రశ్నించకుండా,ఆలోచించకుండాగొర్రెలా తలూప డం మతస్తులకు కావాలి. రాజుల కాలంలో ప్రజలను గొర్రె లుగా ఉంచటానికి ఈగుళ్ల ఉపయోగపడ్డాయి.అందుకే వాళ్ళ గుళ్లఎక్కువగాకట్టించేవారు.ఇపుడాఅవసరంలేదు.గుళ్ల కాదు, బళ్లనిర్మించండి.విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పోస్టల్ శాఖ వింత నిబంధనలు

పోస్టల్ సేవింగ్స్,రిక్కరింగ్ వంటిఖాతాలేమైనా రద్దు చేసుకో వాలంటే మదుపరులను పోస్టల్ శాఖ వారుకాలం చెల్లిన నిబంధనలతో ఇబ్బంది పెడుతున్నారు. ఖాతాదారులు తమ ఖాతా తెరిచే వేళ జీవిత భాగస్వామినైనా పిల్లలైనా నామినీగా తెలుపుతారు. ఒకవేళ ఖాతా తెరిచిన వ్యక్తి మధ్యలో చనిపోతే ఆ డిపాజిట్ సొమ్ము నామినీకి చెల్లించాలి. సందేహం వస్తే మిగతా వారసుల నుండి అంగీకారపత్రంతీసుకోవాలి. వీటిల్లో అక్రమాలకు ఆస్కారంవుండదు. ఏమైనా తేడావస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి.కాని చనిపోయిన వ్యక్తి నామినీకి డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా,పోస్టల్ అధికారులు నామి నీకి తెలిసిన ఇద్దరు వ్యక్తులు ఆధార్, పాన్ జిరాక్స్ కాపీలతో సంబంధిత పోస్టాఫీసుకి వచ్చి సంతకం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- టి. సాంబశివరావు, గుంటూరు

### ఉద్యోగులకు కూడా క్రీడలు నిర్వహించాలి

శాసన సభ్యులకు,శాసన మండలి సభ్యులకు క్రీడలుసంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించినట్లుగానే ఉద్యోగులకు కూడా నిర్వహించడం అవసరం. క్రీడలు,ఆటలు సంస్కృతిక కార్యక్ర మాలు ఉద్యోగులకు కొంతఊరట,అలసట తీరుతుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయంలో అందరు ఉద్యోగాలు చేస్తున్నవారు పాల్గొనే విధంగా చూడాలి. ఉద్యోగులకు కొంత ఊరట కల్పిస్తే వారు చేసే పనిపై దృష్టి ఎక్కువగా పెట్టగలరు.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సమాజం అవినీతిని అంగీకరిస్తోందా?

**భారతదేశంలో అవినీతిని నియంత్రించడానికి బలమైన చట్టపరమైన, సంస్థాగత, పరిపాలనా సంస్కరణలు అవసరం. వేగవంతమైన, ఖచ్చితమైన శిక్షలను నిర్ధారించడానికి ప్రత్యేక అవినీతి నిరోధక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. తద్వారా విచారణలు త్వరగా పూర్తవుతాయి. ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదు చేయడానికి ముందస్తు అనుమతి అవసరాన్ని పరిమితం చేయడం లేదా తొలగించడం ద్వారా ఆలస్యాలను తగ్గించాలి. అక్రమంగా సంపాదించిన ఆస్తులను కఠినంగా స్వాధీనం చేసుకోవడం ద్వారా అవినీతి అధికారుల అక్రమ సంపదను పూర్తిగా కోల్పోయేలా చేయాలి. లోక్‌పాల్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి స్వతంత్ర సంస్థలను బలపరచి, రాజకీయ జోక్యం నుంచి రక్షించాలి. పారదర్శకమైన, నియమాల ఆధారిత బదిలీ, పోస్టింగ్ వ్యవస్థలు రాజకీయఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ గవర్నెన్స్, డిజిటల్ రికార్డులు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థలను విస్తరించడంద్వారా మానవ జోక్యాన్ని తగ్గించి లంచాలకు అవకాశాలను తగ్గించవచ్చు.**

డాక్టర్. పి.ఎస్. చారి

అవినీతి అంటే అధికారాన్ని, పదవిని లేదా బాధ్యతను వ్యక్తిగత లాభం కోసం దుర్వినియోగం చేయడం. సాధా రణంగా ఇది చట్టవిరుద్ధం లేదా నైతికంగా తప్పు. ప్రభు త్వాధికారి,ఉద్యోగి లేదా నాయకుడు వంటి నమ్మక స్థానం లో ఉన్న వ్యక్తి ప్రజలకు న్యాయంగా సేవచేయకుండా తనకు ప్రయోజనం కలిగేలా వ్యవహరించినప్పుడు అవినీతి జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో అవినీతి సాధారణంగా మారుతోంది. ఎందుకంటే ధనిక దేశాలుగానీ, పేదదేశాలలో అవినీతి రూపాల స్థాయి దేశానికొకలా ఉన్న ప్పటికీ, దాని మూలకారణాలు ప్రపంచవ్యాప్తంగా ఒకేలా ఉన్నాయి.ఉదాహరణకు, రష్యాలో రాజకీయ శక్తి, వ్యాపార ప్రయోజనాల మధ్య ఉన్న సంబంధాలు, మయన్మార్‌లో సైనిక ఆధిపత్యం, భారత్‌లో భూమి, నిర్మాణం, అనుమ తుల ప్రక్రియ, నైజీరియాలో సాధారణ సేవల కోసం అన ధికారిక చెల్లింపులు జరుగుతాయి.బంగ్లాదేశ్, కెన్యాలో తక్కు వ జీతాలు, ఉద్యోగభద్రత లేకపోవడం, అమెరికా, బ్రెజిల్ లో ఎన్నికల ఖర్చులు ఎక్కువగా ఉండడంవల్ల రాజకీయ నాయకులు పెద్దదాతలపై ఆధారపడుతూ, తర్వాత వారికి అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం మొదలయినవి. స్విట్జర్లాండ్, పనామా వంటి దేశాల్లో అంతర్జాతీయంగా అక్రమ డబ్బును దాచుకోవడం సులభం.యుద్ధాలు, ప్రకృతి విపత్తులు అత్యవసర ఖర్చులు కూడా పర్యవేక్షణను బల హీనపరుస్తాయి. ఉదాహరణకు, ఉక్రెయిన్ యుద్ధ సమ యంలో అత్యవసర కొనుగోళ్లలో అవినీతి అనుమానాలు ఉన్నాయి. హైతీలో విపత్తు సహాయ నిధుల దుర్వినియోగం జరిగింది. ఈఅన్నిఅంశాలు కలిసి అవినీతిని ప్రపంచ వ్యాప్త సమస్యగా మారుస్తున్నాయి. ప్రపంచబ్యాంక్ ప్రకారం, అవి నీతి వ్యాపారాలపై అదనపు పన్నులా పనిచేస్తుంది. దీని వల్ల సామర్థ్యం, ఆవిష్కరణ తగ్గుతాయి. ఇది ప్రజావనరుల కోసం కేటాయించిన నిధులు వ్యక్తిగత లాభాలకోసం మళ్లిం చబడతాయి. ఫలితంగా మౌలిక వసతులు బలహీనపడతా యి. పేదరికం, అసమానతలను కూడాపెంచుతుంది. ద్రవ్యో ల్బణం, నల్లధన ఆర్థికవ్యవస్థను ప్రోత్సహిస్తుంది. చివరికి, ఇది ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్నిదెబ్బతీసి, ప్రజాస్వామ్య స్థిరత్వానికి ముప్పుకలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అవినీతిని పర్యవేక్షించడానికి, మంచిపాలనను ప్రోత్సహించడానికి అనేక అంతర్జాతీయ సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ అంతర్జా తీయ సంస్థలు అవినీతి కొలిచే, బాధ్యతాయుత పాలనను ప్రోత్సహించే సంస్కరణలను ప్రేరేపించే కీలకపాత్ర పోషిస్తు న్నాయి. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ప్రచురించిన కరప్ష న్పర్సెప్షన్స్ ఇండెక్స్ ప్రకారం, డెన్మార్క్, ఫిన్లాండ్, సింగ పూర్, న్యూజిలాండ్, నార్వే వంటి దేశాలు పారదర్శకత, బలమైనసంస్థలు, కఠినమైన చట్టం అమలు వల్ల అత్యల్ప అవినీతి దేశాలుగా నిలుస్తాయి. వీటిలో ప్రజాబాధ్యతా యుతం, చట్టపరిపాలనకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. మరోవైపు, దక్షిణసూడాన్, సోమాలియా, వెనిజులా, సిరి యా, యెమెన్ వంటిదేశాలు రాజకీయ అస్థిరత, బలహీన పాలన దీర్ఘకాలిక ఘర్షణల కారణంగా అత్యధిక అవినీతిని ఎదుర్కొంటున్నాయి. భారతదేశంలో అవినీతి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన 2025 అవినీతి అవగాహన సూచిక ప్రకారం,182దేశాలలో భారతదేశం 91వ స్థానంలో ఉంది. భారతదేశంలో ఉన్నతస్థాయి అధికారుల్లో అవినీతి పలు నిర్మాణాత్మక సంస్థాగత కారణాల వల్ల ఏర్పడుతుంది.



ముఖ్యంగా రాజకీయ ఒత్తిడి ఒక ప్రధానకారణం. ఇందులో రాజకీయ నాయకులు కొన్ని వ్యక్తులు, కాంట్రాక్టర్లు లేదా వ్యాపారాలకు అనుకూలంగా పనిచేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తారు, ముఖ్యంగా బదిలీలు, పోస్టింగుల విషయం లో. భూసంబంధ పరిపాలన, పోలీసింగ్, లైసెన్సింగ్ కొను గోలు వంటిరంగాల్లో ఉన్నవిస్తృత స్వేచ్ఛా అధికారాలు పర్య వేక్షణ బలహీనంగా ఉన్నప్పుడు దుర్వినియోగానికి దారితీస్తా యి.క్రమశిక్షణా చర్యల్లో ఆలస్యం, క్లిష్టమైన అనుమతి ప్రక్రి యలు శిక్ష భయాన్ని తగ్గించి అవినీతిని నిరోధించే శక్తిని బలహీనపరుస్తాయి. గనులు, మౌలికవసతులు, రియల్ ఎస్టేట్ రంగాల్లో రాజకీయ నాయకులు,వ్యాపారులు అధి కారుల మధ్య ఉన్న సంబంధాలు అక్రమ లాభాల కోసం ప్రవర్తనకు దారితీస్తాయి. కొన్ని సందర్భాల్లో ఉన్నత జీవన శైలి నిర్వహించాలనే సామాజిక ఒత్తిడులు కూడా అనైతిక నిర్ణయాలకు దారితీస్తాయి. అత్యున్నత స్థాయి అధికారులతో సంబంధం ఉన్న పలు అవినీతి కేసులు భారతదేశంలో పరిపాలనాబాధ్యతపై ఉన్న సవాళ్లను బయటపెట్టాయి. అవి నీతి కొనసాగడానికి ఒక ముఖ్యకారణం శిక్షలు తక్కువగా ఉండడం లేదా ఆలస్యంగా అమలవడం, శిక్షల నిర్ధారణ తక్కువగా ఉండటంవల్ల చాలా కేసుల్లో నేరస్తులవిచారణలు, కోర్టు ప్రక్రియలు సంవత్సరాల పాటు కొనసాగుతాయి. దీర్ఘ కాలిక విశ్లేషణ ప్రకారం, ప్రపంచంలో నమోదుచేసిన అవి నీతి కేసుల్లో కేవలం సుమారు 19మాత్రమే శిక్షకు దారితీస్తు న్నవి. అంటే, అన్నినమోదైన కేసులను పరిగణనలోకి తీసు కుంటే,దాదాపు ప్రతి 5 కేసుల్లో 1 కేసు మాత్రమే శిక్షతో ముగుస్తుంది. భారతదేశంలో ఇటీవలి సంవత్సరాల్లో దాదాపు 65-75 శాతం వరకు శిక్ష విధింపు రేటు ఉంది. ఉదాహరణకు 2022లో-74.59శాతం, 2023లో -71.47 శాతం, 2024లో -సుమారు 69 శాతం తీర్పు వచ్చే సమయానికి చాలామంది అధికారులు పదవీ విరమణ పొందుతారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వంటి సంస్థల బలహీన అమలు కూడా సమస్యను పెంచుతుంది.రాజకీయ-బ్యూరోక్రాటిక్ సంబం ధాలు అవినీతి అధికారులకు రక్షణ కల్పిస్తాయి. పబ్లిక్సర్వెం ట్స్‌పై కేసులు నమోదు చేయడానికి ముందస్తు అనుమతి అవసరం వంటి క్లిష్టచట్టపరమైన ప్రక్రియలు కూడాఆలస్యం కలిగిస్తాయి. అనేక సందర్భాల్లో అక్రమ ఆస్తులు పూర్తిగా స్వాధీనం చేయకపోవడంవల్ల నేరస్తులు లాభాలను కొనసా గిస్తారు. కఠినంగా వ్యవహరించే అధికారులకు తగిన రక్షణ లేకపోవడం చట్టాల అసమాన అమలు బాధ్యతను బలహీన పరుస్తుంది. అవినీతి భారతదేశంలో గణనీయమైన ఆర్థిక నష్టాలకు కారణమైంది. దేశస్థూల దేశీయోత్పత్తిలో సుమారు 16.6 వరకు ప్రభావం చూపవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 4ట్రిలియన్ డాలర్లకు చేరువవుతున్న నేపథ్యంలో, దీనివల్ల దీర్ఘకాలంలో దాదాపు 56-57లక్షల కోట్లు నష్టంగా భావించవచ్చు. గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ నివేదిక ప్రకా రం, 1948 నుండి 2008 మధ్యకాలంలో అవినీతి, పన్ను ఎగవేత, అక్రమ చర్యల వల్ల భారతదేశం సుమారు 462 బిలియన్ డాలర్లను కోల్పోయింది. భారతదేశంలో అవినీతిని నియంత్రించడానికి బలమైన చట్టపరమైన, సంస్థాగత, పరి పాలనా సంస్కరణలు అవసరం. వేగవంతమైన, ఖచ్చితమై న శిక్షలను నిర్ధారించడానికి ప్రత్యేక అవినీతి నిరోధక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. తద్వారా విచారణలు త్వరగా పూర్తవుతాయి. ప్రభుత్వఉద్యోగులపై కేసులు నమో దు చేయడానికి ముందస్తు అనుమతి అవసరాన్ని పరిమితం చేయడం లేదాతొలగించడం ద్వారా ఆలస్యాలను తగ్గించాలి. అక్రమంగా సంపాదించిన ఆస్తులను కఠినంగా స్వాధీనం చేసుకోవడం ద్వారా అవినీతి అధికారుల అక్రమ సంపదను పూర్తిగా కోల్పోయేలా చేయాలి. లోక్‌పాల్, సెంట్రల్ విజి లెన్స్ కమిషన్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి స్వతంత్ర సంస్థలను బలపరచి, రాజకీయ జోక్యం నుంచి రక్షించాలి. పారదర్శకమైన, నియమాల ఆధారిత బదిలీ, పోస్టింగ్ వ్యవస్థలు రాజకీయఒత్తిడిని తగ్గిస్తాయి. ఈగవర్నె న్స్, డిజిటల్ రికార్డులు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థ లను విస్తరించడంద్వారా మానవ జోక్యాన్ని తగ్గించి లంచా లకు అవకాశాలను తగ్గించవచ్చు.రాజకీయ నిధుల సంస్కర ణలు అవసరం. ఉద్యోగసంఘాలు కూడా అవినీతిని నియం త్రించడంలో, నైతిక నాయకత్వాన్ని ప్రోత్సహించడం చట్ట బద్ధ విచారణలకు సహకరించడం ద్వారా విశ్వసనీయతను ప్రజల నమ్మకాన్ని బలపరుస్తాయి. ●

# కన్నవారికి కవచం సంరక్షణ బిల్లు

ఎక్కులూరి నాగార్జున్ రెడ్డి


తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిన తల్లిదండ్రుల పోషణ బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం చరి త్రాత్మకం. ప్రభుత్వం ఈ బిల్లుకు రూపకల్పన చేయడం ఒక సామాజిక విప్లవంగా అభివర్ణించవచ్చు. కన్నవారిని నిర్లక్ష్యం చేసే ఉద్యోగుల జీతం నుంచి 15 శాతం కోత కోసి, ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేయాలనే నిర్ణయించడం అభినందనీయం.భారతీయ సంస్కృతిలో 'మాతృదేవోభవ.. పితృదేవోభవ' అనేది కేవలం ఒక సూక్తి మాత్రమే కాదు. అది ఒక జీవన విధా నం. కానీ, ఆధునిక పోకడలు, వ్యక్తిగత స్వార్థం పెరగడం వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కుప్పకూలింది. లక్షల్లో జీతాలు తీసుకుంటూ, విలాసవంతమైన జీవితం గడుపు తున్న కొందరు, తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల ను వృద్ధాప్యంలో అనాథలుగా వదిలేస్తున్నారు. ఈ సామా జిక క్యాన్సర్‌ను నయం చేయడానికి కేవలం నీతి వాక్యాలు సరిపోవని గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం,'ఆర్థికఆంక్షల' ద్వారా బాధ్యతను గుర్తు చేసేందుకు సిద్ధమైంది. కన్నవారి కన్నీరు తుడిచే ఈ చట్టం అమల్లోకి వస్తే వృద్ధాప్యంలో ఉన్న ఎందరికో అది ఆసరాగా మారుతుంది. వృద్ధులు తమ అవసరాలైన ఆహారం, మందుల కోసం ఇతరుల ముందు లేదా పిల్లల ముందు చేతులు చాచకుండా ఉండ టం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఉద్యోగం అనేది కేవలం వ్యక్తిగత ఆస్తికాదు, అది సమాజానికి, కుటుంబానికి జవా బుదారీగా ఉండాలని నొక్కిచెప్పడం. తల్లిదండ్రుల కష్టార్జి తంతో చదువుకుని ఉద్యోగం సంపాదించిన పిల్లల సంపా దనలో తల్లిదండ్రులకు చట్టబద్ధమైన వాటా కల్పించడం లాంటివి ఇందులో ఉన్నాయి. అటు ఆర్థిక సాయం అందు తుందనే భరోసా ఉంటే, చాలామంది వృద్ధులు ఆశ్రమా లకు వెళ్లడం మానేసి, తమ సొంత ఊర్లలోనే గౌరవంగా జీవించగలరు. జీతం కట్ అవుతుందనే భయంతోనైనా, కనీసం లోకనిందకు భయపడి తల్లిదండ్రులను ఇంటికి తీసుకెళ్లే పరిస్థితులు ఏర్పడవచ్చు. వృద్ధాప్యంలో వచ్చే జబ్బులకు చికిత్స చేయించుకోవడానికి డబ్బుల్లేక అల మటించే వారికి ఈ '15 శాతం జీతం' ఒక సంజీవనిలా మారుతుంది. నాణేనికి రెండో వైపు ఉన్నట్లుగా, ఈ చట్టం అమలులో కొన్ని చిక్కులు లేకపోలేదు. బలవంతంగా జీతం నుంచి డబ్బులు తీసుకుంటే, అది తల్లిదండ్రులు పిల్లల మధ్య ఉన్న ప్రేమానురాగాలను మరింత దూరం చేయవచ్చు. డబ్బులు ఇచ్చినప్పటికీ, మానసిక హింసపెరిగే ప్రమాదం ఉంది. కుటుంబ తగాదాల వల్ల కొందరు తల్లి దండ్రులు తప్పుడు ఫిర్యాదులు చేసే అవకాశం ఉంటుంది. దీనిని అరికట్టడానికి అత్యంత పారదర్శకమైన విచారణ వ్యవస్థ ఉండాలి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వోగులు అంటే సరే కానీ అత్యధిక సంపాదన ఉన్న ప్రైవేటు/ఐటీ రంగ ఉద్యోగులను దీని పరిధిలోకి ఎలా తీసుకువస్తారనేది పెద్ద సవాలనే చెప్పాలి.భారతదేశంలోఅస్సాం ఇప్పటికే ఈతరహా చట్టం 'ప్రణామ్'ను విజయవంతంగా అమలు చేస్తోంది. అక్కడ కూడా ఉద్యోగి జీతం నుంచి 10-15 శాతం కోత విధిస్తారు.దీనిస్ఫూర్తిగా తెలంగాణ ప్రభుత్వం ఆ మోడల్‌ను మరింత పకడ్బందీగా, వికలాంగులైన తోబుట్టువుల బాధ్య తను కూడా చేర్చి అమలు చేయాలని భావించింది. పాఠశా ల దశనుంచే నైతిక విలువలను బోధించడం, తల్లిదండ్రుల పట్ల బాధ్యతను పెంచడం వంటివి సమాంతరంగాజరగాలి. చివరగా,'తల్లిదండ్రులను గౌరవించడం అనేదిఒకఆప్షన్‌కాదు అది తప్పనిసరి బాధ్యత' అని ఈచట్టం స్పష్టంచేస్తోంది. ●

# విగ్రహాలతో రాజకీయ విన్యాసాలు!



ఐ.ప్రసాదరావు

మానవుడు మరింత ఉన్నత లక్షణాలు కలిగి ఉండటా నికి, ఒక ఉన్నత లక్ష్యాలను సాధించ డానికి తనకు ఇష్టమైన దైవ రూపాల ను లేదా రాజకీయ, సామాజిక సంస్కరణవేత్తలను ఆదర్శంగా తీసు కుని తనకు, తన కుటుంబానికి తన దేశానికిఉపయోగపడే వ్యక్తిగా తయా రు అవడానికి విగ్రహాల రూపంలో దర్శించి ఔన్నత్యాన్ని పెంచుకోవడా నికి ప్రయత్నాలు చేయడం పరిపాటి గా ఉంటుంది. అలాగే పాలకులు కూడా ఆయా రాష్ట్రాల్లో, దేశంలో ప్రముఖులు విగ్రహాలు ఏర్పాటు చేయడం, వారి ఆశయాలను ఆచరణలో చేయడానికి ప్రయత్నాలు చేయడం గత అనాది కాలంగా వస్తున్న విధానం.అయితే గతనాలుగు దశాబ్దాలుగా మనదేశంలో ఉన్న కేంద్ర,రాష్ట్ర పాలకులు వారి పాలనలో వారి పేర్లు శాశ్వతంగా చరిత్రలో నిలిచి పోయేరీతిలో, గిన్నీస్ బుక్‌లో రికార్డు సృష్టించడానికి కొంత మంది ప్రముఖులు విగ్రహాలు ఏర్పాటు చేయడం జరుగు తుంది. గతంలో యన్.టి.ఆర్ చే హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌లో బుద్ధవిగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది. విగ్ర హాలు ఏర్పాటు చేయడం తప్పుకాదు కానీ రాజకీయంగా లబ్ధి పొందేందుకు ఏర్పాటు చేయడం సమంజసం కాదు. ఇక ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం గత కాంగ్రెస్ పాల కులు పక్కన పెట్టిన కొంతమంది స్వాతంత్ర్య సమరయోధు లను, వారి పార్టీల నాయకుల విగ్రహాలు ఏర్పాటుచేయడం జరుగుతుంది. ఇక మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇటు వంటి ధోరణులు, నేటి పాలకులు ప్రథమ ప్రాధాన్యతఇస్తూ వేల కోట్ల రూపాయలు విగ్రహాల ఏర్పాటుకు చర్యలు చేప ట్టడం జరుగుతుంది. గుజరాత్‌లో ప్రధాని మోడీ సుమారు 3 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది. ఇదే సంద ర్భంలో వేల కోట్ల రూపాయల ఖర్చుతో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్న భారత్‌కు మేము ఆర్థికంగా ఆదుకోవాల్సి న అవ సరం లేదు అని ఆనాడే బ్రిటిష్ ప్రభుత్వం తెలిపింది. ఇక మన తెలుగు రాష్ట్రాలైన తెలంగాణా ప్రభుత్వం కే.సి.ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం జరిగింది. నేడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి బాపూఘాట్/ గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ పేరుతో సుమారు 1లక్షా 50వేలకోట్ల రూపాయలతో మూసీనది ప్రక్షాళన, మహాత్మాగాంధీ విగ్ర హం ఏర్పాటు చేయడం తన కర్తవ్యం అంటూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు సవ్యంగా జరగడం లేదు. ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వవ లసిన డీఏలు, ఆర్థిక బకాయిలు, పి.ఆర్.సి, మధ్యంతర భృతి, రిటైర్ అయిన వారికి పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదు.ఇటువంటి పరిస్థితుల్లో ఇంత భారీ స్థాయిలో విగ్రహం ఏర్పాటు చేయవలసి ఆవశ్యకత ఏమి ఉంది? కేవలం పేరు కోసమే అని గ్రహించాలి. దీనికితోడు రాష్ట్రం అప్పుల ఊబి లో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. ఎంత ఆదాయం వచ్చినా, అప్పులు తీర్చడం



మాట అటుంచి, వడ్డీలు కట్టడానికి కూడా సరిపోవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో లక్షలకోట్ల రూపా యలు ఖర్చుచేసి విగ్రహం ఏర్పాటు చేయడం అవసరమా!? సాక్షాత్తు మహాత్మాగాంధీ మనవడే ఈ విగ్రహం ఏర్పాటు పట్ల ఆసక్తి చూపడం లేదు. దీనికి చేసే ఖర్చు పేద మధ్య తరగతిప్రజల అవసరాలు కోసంవెచ్చించండి అని తెలిపారు. అయినా నేటి ముఖ్యమంత్రి గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేయడం కోసం ముందుకు సాగుతున్నారు. ఇక 2014లో ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటి నుంచి అప్పు లతో సతమతం అవుతున్నది. హైదరాబాద్ వంటి ఆదా యం సమకూర్చే నగరం ఆంధ్రప్రదేశ్ కోల్పోవడం జరిగిం ది.రాజధానిలేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. నవ్యాం ధ్ర ప్రదేశ్ ఏర్పాటు చేయాలని రాజధానిగా అమరావతి చేయాలని అప్పటి ప్రభుత్వం ముందుకు సాగుతున్న సమ యంలో హుదూద్ వంటి తుఫాన్ అతలాకుతలం చేసింది. తదుపరి వచ్చిన ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కాలం గడుపుతూ, కనీసం రోడ్లుకూడా వేయకుండా, పరిశ్ర మలు ఏర్పాటు చేయకుండా, రాష్ట్ర అభివృద్ధి కోసం సరైన చర్యలు చేపట్టలేదు. సుమారు నాలుగు వందలకోట్ల రూపా యలు ఖర్చుచేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం విజయవాడలో ఏర్పాటు చేసి, వారి పేరు శాశ్వతం చేసుకో వడం జరిగింది. ఇక రెండు సంవత్సరాల క్రితం అధికారం చేపట్టిన నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానా లు అమలు చేయడం కోసం తలకిందులుగా తపస్సు చేయ డం జరుగుతుంది.దీనికితోడు కొన్నిలక్షల కోట్ల రూపాయలు అప్పుల్లో రాష్ట్రం కూరుకుపోయింది. అయినప్పటికీ, విగ్రహా లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు ముమ్మరం చేశారు. సుమారు150కోట్ల రూపాయలు ఖర్చుచేసి పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ యన్టీఆర్ విగ్ర హాన్ని సుమారు 2వేల కోట్ల రూపాయల పైబడి ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధంచేశారు.వచ్చిన ఆదాయం సరిపోక దాదాపు ప్రతీవారం అప్పులు కోసం పరిగెత్తుకుంటూ కేంద్ర ప్రభుత్వం వద్దకు, వివిధ ఆర్థికవ్యవస్థల వద్దకు వెళుతున్నా పరిస్థితిల్లో ఇంత భారీస్థాయిలో విగ్రహం ఏర్పాటుకు నిధు లు ఖర్చు చేయడం సమంజసమా! కావలిస్తే, వారి పేర్లు మీద విమానాశ్రయాలకు పేర్లుపెట్టడం, పేదవారికి ఉపయో గపడే వివిధ పథకాలకు,ఆ విగ్రహాలు ఏర్పాటుకుచేసే నిధు లు కేటాయించడం మంచిది. కేవలం పాలకులు వారి పేర్లు శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోవడానికి మాత్రమే ఈ విగ్రహా లను, ప్రాజెక్టులను చేపట్టడం జరుగుతుంది. ఇకనైనా పాల కులు ఆలోచన మారాలి. విగ్రహాలు ఏర్పాటు ద్వారా ఓట్లు రాబట్టుకోవడం మంచిది కాదు.పర్యాటక రంగం అభివృద్ధికి, ఆర్థిక వనరులు సమకూర్చడం కోసం ఈ విగ్రహాలను ప్రాజె క్టులను చేపట్టడం జరుగుతుంది అని పాలకులు చెబుతూ ఉంటారు. మన దేశంలో, రాష్ట్రాల్లో అధిక ధరలు, ద్రవ్యో ల్బణం, రూపాయి విలువ పతనం, పేదరికం, నిరుద్యోగం, కనీస అవసరాలు లేని పరిస్థితుల్లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చి సుమారు ఎనిమిది దశాబ్దాల పూర్తి అవుతున్నా అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఏ మాటలు వెనుక పాలకుల మర్మం దాగి ఉందో ప్రజలు గ్రహించలేనంత వరకూ మోసపోతూనే ఉంటారు. ●

# 8వ కేంద్ర వేతనం సంఘం ఏర్పాటు



## కమిషన్ సిఫారసులకు 18 నెలల గడువు

## పార్లమెంటులో ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి

**న్యూఢిల్లీ, మార్చి 31:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన సిఫార్సులను సమర్పించేందుకు 18 నెలల గడువు విధించింది. దీంతో లక్షలాది మంది ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ల సవరణకు మార్గం సుగమమైంది. కొత్త వేతనాలు 2026 జనవరి ఒకటినుంచే అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంటులో అధికారికంగా వెల్లడించారు. 2025 నవంబర్ 3న 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. జీతాలు, అలవెన్సులు, పెన్షన్ నిర్మాణం వంటి పలు అంశాలపై ఈ కమిషన్ సమీక్షించి, 18 నెలల్లోగా ప్రభుత్వానికి తన నివేదికను సమర్పిస్తుందని వివరించారు. నివేదిక రావడానికి 2027 మధ్య కాలం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, గత సంప్రదాయం ప్రకారం 2026 జనవరి 1 నుంచే బకాయిలతో సహా కొత్త జీతాలను వర్తింపజేయవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఈ వేతన సవరణలో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అత్యంత కీలకం కానుంది. ఉద్యోగులందరి మూల వేతనాన్ని ఒకేసారి పెంచడానికి ఈ గుణిజాన్నే ఉపయోగిస్తారు. 7వ వేతన సంఘం 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను సిఫార్సు చేయగా, దానిని ప్రభుత్వం ఆమోదించింది. దీంతో అప్పుడు కనీస మూల వేతనం రూ. 7,000 నుంచి రూ. 18,000కు పెరిగింది. గరిష్ఠ వేతనం రూ. 2.5 లక్షలకు చేరింది. ఒకవేళ 8వ వేతన సంఘం కూడా ఇదే 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను కొనసాగిస్తే, ప్రస్తుతం రూ. 18,000గా ఉన్న కనీస మూల వేతనం సుమారు రూ. 46,000కు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉద్యోగుల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మధ్య సమతుల్యం సాధించాల్సి ఉంటుందని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. 7వ వేతన సంఘం గడువు 2025 డిసెంబర్ 31తో ముగియడంతో ఈ కొత్త కమిషన్‌ను నియమించారు. మూల వేతనంతో పాటు ఇతర అలవెన్సులు, ప్రస్తుతం 3 శాతంగా ఉన్న వార్షిక ఇంక్రిమెంట్లు, పెన్షన్ విధానంపైనా ఈ కమిషన్ తన సిఫార్సులను అందించనుంది. కమిషన్ నివేదిక, ప్రభుత్వ ఆమోదం తర్వాతే జీతాలు ఎంతమేర పెరుగుతాయనే దానిపై పూర్తి స్పష్టత వస్తుంది.



## అభివృద్ధి అజెండాగా కేరళం బిజెపి మేనిఫెస్టో

### పార్టీ జాతీయ అధ్యక్షుడు నబిన్ చేతుల మీదుగా విడుదల

**తిరువనంతపురం, మార్చి 31:** రాష్ట్రంలో తన ప్రాబల్యాన్ని విస్తరించుకునే లక్ష్యంతో, భారతీయ జనతా పార్టీ (బిజెపి)మంగళవారం కేరళం అసెంబ్లీ ఎన్నికల కోసం తన మేనిఫెస్టోను ఆవిష్కరించింది. ఇందులో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, కేరళంలో ఎయిమ్స్‌ను ఏర్పాటు చేయడం, తిరువనంతపురం, కోజికోడ్‌లలో మెట్రో రైలుప్రాజెక్టులను ప్రారంభించడం, తిరువనంతపురం నుండి కన్నూర్ వరకు హైస్పీడ్ కారిడార్‌ను అమలుచేయడం వంటివి ఈ మేనిఫెస్టోలో హామీలుగా ఉన్నాయి.

సంక్షేమ హామీలలో భాగంగా పేద కుటుంబాలకు ఏటా రెండు ఉచిత ఎల్‌పిజి సిలిండర్లు, ప్రతిఇంటికి నెలకు 20,000 లీటర్ల ఉచిత తాగునీరు, పింఛన్లను రూ. 3,000కు పెంచడం వంటివి ఉన్నాయి.

## డిజిటల్ చెల్లింపులతోనే టోల్‌ప్లాజాల రుసుం

### నగదు చెల్లింపులకు చెక్..!

**న్యూఢిల్లీ,మార్చి 31:** దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు హైవేస్ అథారిటీ అప్‌డేట్ ఇచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను పూర్తిగా నిలిపివేయనున్నట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్ఎఐ స్పష్టంచేసింది. ఇకపై టోల్ రుసుములను ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై కొత్త నిబంధన అమల్లోకి వస్తున్న ఈ నిబంధన కేవలం రహదారుల వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా తీసుకున్నట్లు హైవేస్ అథారిటీ చెపుతోంది.

## పితృత్వ సెలవును చట్టబద్ధంచేయాలి..

## పార్లమెంటులో ఆప్ ఎంపి డిమాండ్



**న్యూఢిల్లీ, మార్చి 31:** పితృత్వ సెలవును దేశ వ్యాప్తంగా అన్ని రంగాల్లో చట్టబద్ధమైన హక్కుగా మార్చాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. బిడ్డ సంరక్షణ బాధ్యత కేవలం తల్లులకే పరిమితం కాదని, అది తల్లి దండ్రులిద్దరి ఉమ్మడి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఎంపి రాఘవ్ చద్దా మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడు తల్లిదండ్రులిద్దరికీ శుభాకాంక్షలు వెల్లువెత్తుతాయి, కానీ సంరక్షణ బాధ్యత మాత్రం చట్టపరంగా తల్లిపైనే పడుతోంది. ఇది చట్టం బలవం తంగా రుద్దుతున్న సామాజిక వైఫల్యమని వ్యాఖ్యానించారు. ప్రసవానంతరం ఒక మహిళకు శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా భర్త అండ ఎంతో అవసర మని ఆయన అన్నారు. ఆ సమయంలో భర్త తోడు విలాసం (లగ్జరీ) కాదు, అత్యవసరం. భార్య పట్ల భర్తకు ఉండే సంరక్షణ బాధ్యత కూడా అంతే ముఖ్యమని సభకు వివరించారు. ప్రస్తుతం దేశంలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే 15 రోజుల పితృత్వ సెలవు లభిస్తోందని, ప్రైవేట్ రంగంలో అలాంటి నిబంధన ఏదీ లేదని చద్దా గుర్తుచేశారు. దేశంలోని 90 శాతం మంది ఉద్యోగులు ప్రైవేట్ రంగంలోనే ఉన్నారని, దీనివల్ల అత్యధిక మంది తండ్రులు ఈ సౌకర్యానికి దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వీడన్, ఐస్‌లాండ్, జపాన్ వంటి దేశాలు 90 రోజుల నుంచి 52 వారాల వరకు పితృత్వ సెలవులు కల్పిస్తున్నాయని ఉదహరించారు. బిడ్డ సంరక్షణ, ఉద్యోగం రెండింటి మధ్య తండ్రి దేన్ని ఎంచుకోవాలన్న పరిస్థితి రాకూడదని, భర్త మద్దతు లేకుండా తల్లి ప్రసవ వేదనను ఎదుర్కోకూడదని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, పితృత్వ సెలవును చట్టబద్ధమైన హక్కుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలనిఎంపి కోరారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ ఓడిపోయే దాకా యుద్ధం ఆపొద్దు

### ట్రంప్‌ను ప్రైవేట్‌గా కోరిన గల్ఫ్ దేశాలు



**వాషింగ్టన్, మార్చి 31:** ఇరాన్ ఓడిపోయేవరకు యుద్ధం కొనసాగించాలని గల్ఫ్ దేశాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరుకుంటున్నాయట. అలా కోరిన దేశాల జాబితాలో సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్, బహ్రెయిన్ ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది. 'నెల రోజులుగా జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్ చెప్పుకోదగ్గ స్థాయిలో బలహీనపడలేదు. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలి. అప్పటివరకు సైనిక చర్య ముగియకూడదు' అని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరారని ఆ వార్తా ఏజెన్సీ కథనం వెల్లడించింది. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ అధికారులను ఉటంకించింది. ఇరాన్‌పై దాడి గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయట. ఈ ఘర్షణలు ఎలాగూ కొనసాగుతున్నాయి గనక టెహ్రాన్‌లోని మత పెద్దల పాలనను పూర్తిగా కూలదోయడానికి ఇదొక చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని పేర్కొంది.

**హర్మూజ్ గురించి నాకెందుకు.. ఎపిక్ ఫ్యూరీని ఆపేస్తా!**

అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో యుద్ధ రంగంలోకి దిగడంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. దానిని తెరిపిస్తామని ట్రంప్ ప్రకటనలు చేశారు. అయితే ఇప్పుడు వాటికి భిన్నమైన కథనాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసుకొచ్చింది. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. హర్మూజ్ ఇప్పటికీ మూతపడే ఉన్నా.. ట్రంప్ ఈ ఆలోచన చేస్తున్నారట. ఈ కథనాలు ఇలా ఉంటే.. మరోవైపు పశ్చిమాసియాలో అమెరికా బలగాల మోహరింపులు పెరుగుతండటం గమనార్హం.

# శీతలాష్టమి దేవాలయంలో తొక్కిసలాట

### 8 మంది మృతి, 12 మందికి తీవ్రగాయాలు

**నలంద, మార్చి 31:** బీహార్‌లోని నలందలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఇక్కడి ఓ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో దాదాపు ఎనిమిది మంది భక్తులు మృతి చెందారు. మృతులంతా మహిళలే కావడం విశేషం. మరోవైపు పదుల సంఖ్యలో భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఒక్కసారిగా భక్తులు ఆలయంలోకి ప్రవేశించడంలో పరిస్థితి అదుపు తప్పింది. అకస్మాత్తుగా తొక్కిసలాట జరగడంతో గందరగోళం నెలకొంది. ఈ తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళలు మరణించారు. 12 మంది మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సర్దు మణిగేలా చేశారు. గాయపడిన వారిని హుటాహుటీన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తం అవుతోంది. తొక్కిసలాట సమయంలో ఎటు చూసినా భక్తులు భయంతో హాహాకారాలు చేశారు. ప్రమాదం అనంతరం పదుల సంఖ్యలో మహిళలు నేలపై అపస్మారక స్థితిలో పడి ఉన్న వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్గా మారాయి. ఈ ఫొటోల్లో ఓ వ్యక్తి ఒక మహిళ తల వద్ద వంగి ఆమెకు సీపీఆర్ చేస్తూ కనిపించాడు. మరో మహిళ స్పృహ కోల్పోయిన మహిళ ముఖాన్ని నిమురుతూ ఆమెను స్పృహలోకి తీసుకురావ డానికి ముఖంపై నీళ్ళు చల్లుతూ కనిపించింది. ఎటు చూసినా హృదయవిదారక దృశ్యాలే కనిపించాయి.



## ఆసుపత్రినుంచి సోనియా గాంధీ డిశ్చార్జి

**న్యూఢిల్లీ, మార్చి 31:** ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న అస్వస్థత కారణంగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యులు కొన్ని రోజులపాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. చికిత్సకు ఆమె శరీరం సానుకూలంగా స్పందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. సోనియా పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆమె అభిమానులు, పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా సోనియా గంగారామ్ ఆసుపత్రిలో చేరి చికిత్సలు పొందారు. శ్వాసకోస ఇబ్బందులు, వయోభారంతో వచ్చే సమస్యలతోనే ఆమె ఆసుపత్రిలో చేరినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి.

## హర్మూజ్ నౌకలనుంచి టోల్ వసూలుకు ఇరాన్ నిర్ణయం

### పార్లమెంటరీ సెక్యూరిటీ కమిటీ ఆమోదం

**టెహ్రాన్, మార్చి 31:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించే దిశగా అడుగులు వేసింది. ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలపై టోల్ విధించడంతో పాటు అమెరికా, ఇజ్రాయెల్ నౌకలను నిషేధించడం వంటి అంశాలతో కూడిన హర్మూజ్ జలసంధి నిర్వహణ ప్రణాళికకు ఇరాన్ పార్లమెంట్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ ఐఆర్ఐబీ వెల్లడించింది. ఈ కొత్త ప్రణాళిక ప్రకారం హర్మూజ్ జలసంధిలో భద్రతా ఏర్పాట్లు, నౌకల భద్రత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికపరమైన అంశాలపై ఇరాన్ దృష్టి సారించనుంది. ముఖ్యంగా ఈ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ కరెన్సీ రియాల్ రూపంలో టోల్ వసూలు చేయనున్నారు. భారత కరెన్సీలో 18.90కోట్ల రూపాయలు ఒక్కో నౌకనుంచి వసూలు చేస్తుంది. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఇరాన్‌పై ఏకపక్ష ఆంక్షలు విధిస్తున్న దేశాల నౌకలను కూడా ఈ జలసంధిలోకి అనుమతించబోమని ప్రణాళికలో స్పష్టంగా పేర్కొన్నారు. జలసంధిపై ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, సాయుధ బలగాల పాత్రను బలోపేతం చేయడం, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ రూపకల్పనలో ఒమన్‌తో సహకరించడం వంటివి కూడా ఈ ప్రణాళికలో భాగమని ఐఆర్ఐబీ నివేదిక తెలిపింది.

**ఇరాన్ నిర్ణయంపై అమెరికా మండిపాటు**

ఇరాన్ నిర్ణయంపై అమెరికా మండిపడింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తమ నియంత్రణలోకి తీసుకుంటామని, అక్కడ స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని పునరుద్ధరిస్తామని యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ స్పష్టం చేశారు. "ప్రస్తుతానికి కొన్ని దేశాలు ఇరాన్‌తో వ్యక్తిగత ఒప్పందాలు కుదుర్చుకుని తమ నౌకలను పంపుతున్నాయి. కానీ, సమీప భవిష్యత్తులో అమెరికా యుద్ధ నౌకల ఎస్కార్ట్‌తో గానీ, బహుళ దేశాల కూటమి ఎస్కార్ట్‌తో గానీ జలసంధిపై నియంత్రణ సాధించి తీరుతామని ఆయన అన్నారు.

## పాలస్తీనీయులకు మరణశిక్ష విధించేచట్టానికి ఇజ్రాయెల్ ఆమోదం



**టెల్ అవీవ్, మార్చి 31:** ఉగ్రవాదచర్యల్లో పాల్గొంటే పాలస్తీనా వాసులకు మరణశిక్ష విధించే చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్ ఆమోదించింది. మొత్తం 120 మంది సభ్యులు ఉన్న నెస్సెట్‌లో ఈ బిల్లుకు 62 మంది సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని మితవాద ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయంపై అంతర్జాతీయంగా, దేశీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చట్టం 30రోజుల్లో అమలులోకి వస్తుంది.ఉగ్రవాద చర్యలో భాగంగా ఇజ్రా యెలీ పౌరులను హత్య చేసిన పాలస్తీనియన్లకు మరణశిక్ష విధిస్తారు. ఇదే నేరం చేసి పట్టుబడ్డ ఇజ్రాయెలీ పౌరులకు మాత్రం ఇదే శిక్ష విధించే వీలులేదు. దీంతో ఇది కేవలం పాలస్తీనియన్లను అణచివేసేందుకే తీసుకొచ్చిన చట్టమని మానవహక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ బిల్లును ప్రధాని నెతన్యాహు గట్టిగా సమర్థించారు. ఉగ్రవాదులకు జైళ్లలో చోటు లేదు, వారికి మరణమే సరైన శిక్ష అని అన్నారు. దేశ భద్రత కోసం ఈ చట్టం అవసరమని ప్రభుత్వం వాదిస్తోంది. ఈబిల్లుపై ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ మానవ హక్కుల నిబంధనలకు విరుద్ధమని, పశ్చిమాసియాలో హింసను మరింత పెంచుతుందని హెచ్చరించాయి.మరోవైపు, ఈ చట్టాన్ని పాలస్తీనా అథారిటీ జాతి నిర్మూలన ప్రయత్నంగా అభివర్ణించింది. ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వర్ణవివక్షకు ఇది పరాకాష్ట అని మండిపడింది. సాధారణంగా ఇజ్రాయెల్‌లో నేరాలకు మరణశిక్ష విధించే సంప్రదాయం లేదు. 1962లో నాజీ నేరస్థుడు అడాల్ఫ్ ఐచ్‌మాన్‌కు మాత్రమే అక్కడ మరణశిక్ష అమలు చేశారు. దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ చట్టం తీసుకురావడంపై ఇజ్రాయెల్‌లోని ప్రతిపక్షాలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ చట్టం అమల్లోకి వస్తే ఉద్రిక్తతలు మరింత ముదిరే ప్రమాదం ఉంది. దీనిపై ఇజ్రాయెల్ సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఇరాన్‌పై యుద్ధంకోసం అమెరికా రూ.2.63 లక్షల కోట్ల వ్యయం

### స్టాక్ హోమ్ సంస్థ సిప్రీ నివేదిక వెల్లడి

**స్టాక్‌హోమ్, మార్చి 31:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేస్తున్న యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. ఈ యుద్ధం కోసం అమెరికా చేస్తున్న ఖర్చు వింటే వణుకుపుడుతోంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిప్రీ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ యుద్ధం కోసం అమెరికా ప్రతి సెకనుకు 10,300 డాలర్లు (సుమారు రూ.9.8 లక్షలు) ఖర్చు చేస్తోంది. గతనెల 28న ప్రారంభమైన ఈ యుద్ధం 31వ రోజుకు చేరుకోగా, ఇప్పటివరకు అమెరికా ఏకంగా 27.68 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.2.63 లక్షల కోట్లు ఖర్చు చేసింది. యుద్ధం ముగిసే సూచనలు కనిపించకపోవడంతో ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌పై యుద్ధానికి అమెరికా రోజుకు సగటున 890 మిలియన్ డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.8,455 కోట్లు వెచ్చిస్తున్నట్లు సిప్రి వెల్లడించింది. ఈ రోజువారీ ఖర్చులో ఆయుధాలు, వైమానిక, నౌకాదళ కార్యకలాపాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా, రవాణా వంటివి ఉన్నాయి. ఈ ఖర్చులో సింహభాగం, అంటే రోజుకు 320 మిలియన్ డాలర్లు సుమారు రూ.3,040 కోట్లు, ఆయుధాలు, క్షిపణులకే వెళుతోంది. టోమహాక్ క్రూయిజ్ క్షిపణులు, జేడీఏఎం బాంబులు వంటి వాటి కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. వైమానిక కార్యకలాపాల కోసం రోజుకు 245 మిలియన్ డాలర్లు, నౌకాదళ కార్యకలాపాల కోసం 155 మిలియన్ డాలర్లు ఖర్చవుతున్నాయి. థాడ్, పేట్రియాట్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థల కోసం రోజుకు 95 మిలియన్ డాలర్లు, నిఘా, సైబర్ ఆపరేషన్ల కోసం 45 మిలియన్ డాలర్లు వెచ్చిస్తున్నారు. భారీగా పెరుగుతున్న ఈ యుద్ధ భారాన్ని అరబ్ దేశాలతో పంచుకోవాలని ట్రంప్ యోచిస్తున్నట్టు వైట్‌హౌస్ సంకేతాలు ఇచ్చింది. 1990 గల్ఫ్ యుద్ధ సమయంలో అరబ్ దేశాలు అమెరికాకు ఆర్థికంగా సహకరించిన విషయాన్ని గుర్తుచేయగా, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ స్పందిస్తూ అధ్యక్షుడు ట్రంప్ కూడా దీనిపై ఆసక్తిగా ఉన్నారని నేను భావిస్తున్నాను. ఈ విషయంపై త్వరలోనే ఆయన నుంచి ప్రకటన వెలువడవచ్చని తెలిపారు. గల్ఫ్ యుద్ధం సమయంలో మిత్రదేశాలు కలిసికట్టుగా ఉండగా, ఈసారి అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్షంగా ఇరాన్‌పై దాడికి దిగాయి. మరోవైపు యుద్ధ నష్టపరిహారం చెల్లించిన తర్వాతే చర్చలకు వస్తామని ఇరాన్ స్పష్టం చేస్తోంది. మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది.

# ఓటర్ల జాబితాలో అక్రమాలు

### బయటి వ్యక్తులను చొప్పించేందుకు ఇసి, బిజెపి కుట్ర

### సిఇసి జ్ఞానేష్ కుమార్‌కు సిఎం మమతాబెనర్జీ లేఖ



**కోల్‌కతా, మార్చి 31:** పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలోకి బయటి వ్యక్తులను చొప్పించేందుకు బిజెపి, ఎన్నికల సంఘం ప్రమేయంతో కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాశారు. ఆ లేఖను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో ఈ లేఖ రాసినట్లు బెనర్జీ తెలిపారు. 'బెంగాల్ ప్రజల ప్రజాస్వామ్య హక్కులకు వ్యతిరేకంగా జరుగుతున్న తీవ్రమైన కుట్రపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశా' అని ఆమె అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉపయోగించిన వ్యూహాలను ఇక్కడ కూడా పునరావృతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని మమత ఆరోపించారు. "బెంగాల్ ఓటర్ల జాబితాలోకి బయటి వ్యక్తులను చొప్పించే ప్రయత్నంలో, పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో వేలాది నకిలీ ఫారం 6 దరఖాస్తులను సమర్పిస్తూ బిజెపి ఏజెంట్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇది 'ఓటర్ల హైజాకింగ్' ప్రయత్నమే. బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీలలో బిజెపి విజయవంతంగా ఆడిన అదే నీచమైన ఆట ఇది అని ఆమె అన్నారు. 'ఈ అప్రజాస్వామిక ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తక్షణమే నిలిపివేయాలని, గౌరవనీయ సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా పాటించాలని, 2026 ఫిబ్రవరి 28న తుది ఓటర్ల జాబితా వెలువడిన తర్వాత మోసపూరిత ఓటర్లను జాబితాలో చేర్చకుండా చూడాలి. పట్టపగలు తమ ప్రజాస్వామ్యాన్ని దొంగిలించడానికి బెంగాల్ అనుమతించదు. బెంగాల్ ప్రజలు గమని స్తున్నారని మమతాబెనర్జీ పేర్కొన్నారు.

## భారత్‌లో సగటు మొబైల్ డేటా నెలసరి వాడకం 31జిబి

### నోకియా మొబైల్‌బ్రాడ్‌బ్యాండ్ సూచీ నివేదిక

**న్యూఢిల్లీ, మార్చి 31:** భారతీయుల మొబైల్ డేటా వినియోగం గత ఏడాది చివరి నాటికి దేశంలో ఒక్కో వినియోగదారుడి సగటు నెలవారీ డేటా వాడకం 31 జీబీ దాటింది. గత ఐదేళ్లలో ఇది ఏటా సగటున 18శాతం చొప్పున వృద్ధి చెందింది. ప్రముఖ టెలికాం పరికరాల తయారీ సంస్థ నోకియా మంగళవారం విడుదల చేసిన మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ ఇండెక్స్ నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలో 5జీ సేవలు వేగంగా విస్తరించడం, 4కే వీడియో స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్, ఏఐ ఆధారిత యాప్‌ల వాడకం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని నివేదిక స్పష్టంచేసింది. 2025 నాటికి భారతదేశంలో మొత్తం మొబైల్ డేటా ట్రాఫిక్ నెలకు 27ఎక్సాబైట్లు దాటింది. ఇందులో దాదాపు 47 శాతం వాటా ఒక్క 5జీదే కావడం గమనార్హం. 5జీ డేటా ట్రాఫిక్ ఏకంగా 70 శాతం వృద్ధితో నెలకు 12.9ఎక్సాబైట్లకు చేరుకుంది. మెట్రో నగరాలు 5జీ వినియోగంలో ముందున్నాయి.

## గ్యాస్ బుకింగ్‌తో పట్టుబడిన నిందితుడు


### భార్య హత్య కేసులో నాలుగేళ్లుగా పరార్



**భోపాల్, మార్చి 31:** భార్య హత్యకేసులో నాలుగేళ్లుగా తప్పించుకుతిరుగుతున్న ఓ ఆర్మీ మాజీ కెప్టెన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. గ్యాస్ సిలిండర్ బుకింగ్ అతడిని పట్టించడం గమనార్హం. సందీప్ తోమర్ అనే ఆర్మీ మాజీ కెప్టెన్ 2013లో పంజాబ్‌లోని అబోహార్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో తన భార్యను హత్య చేశాడు. తొలుత ఆత్మహత్య అని బుకాయించేందుకు యత్నించినా విచారణలో ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా తేలింది. ట్రయల్ కోర్టు తోమర్‌ను దోషిగా నిర్ధారించి 2014లో జీవిత ఖైదు విధించింది. 2019లో బెయిల్ రావడంతో బయటకు వచ్చాడు. అప్పీల్‌ను 2022లో హైకోర్టు కొట్టివేసినా. లొంగిపోలేదు. అప్పటి నుంచి ఎప్పటికప్పుడు తన గుర్తింపు, లొకేషన్లు మార్చుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే తోమర్‌ను అరెస్ట్ చేసేందుకు పంజాబ్ పోలీసులు సిట్ ఏర్పాటు చేశారు. తోమర్ పాన్ కార్డుతో అనుసంధానమై ఉన్న బ్యాంక్ ఖాతాను పోలీ సులు ఇటీవల ట్రేస్ చేశారు. ఆ అకౌంట్ ద్వారా మధ్యప్రదేశ్‌లో పాండుర్నాలో ఓ ఎల్పీజీ సిలిండర్ బుక్ చేసినట్లు బ్యాంకు స్టేట్‌మెంట్‌లో వెల్లడయింది. దీంతో పోలీసులు ఆ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి, డెలివరీ చిరునామాను తీసుకున్నారు. ఆ సమాచారాన్ని స్థానిక పోలీసులకు చేరవేయగా వారు అతడిని అరెస్ట్ చేశారు.

## శబరిమల బంగారు తాపడాల స్కాంపై ప్రధాని మోడీ ఎందుకు మాట్లాడరు?

### రాహుల్‌గాంధీ విమర్శ



**తిరువనంతపురం, మార్చి 31:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేరళలోని కన్నూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్‌పార్టీ అని పేర్కొన్నారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బిజెపితో జత కట్టారని ఆరోపించారు. అందువల్లే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ విజయం సాధించాలని ప్రధాని కోరుకుంటున్నారన్నారు. ఇతర చోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోడీ కేరళలో మాత్రం ఆ విషయాలను ప్రస్తావించరన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల స్కాం గురించి ఇప్పటి వరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనుక సిపిఐ నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో బిజెపి మౌనంగా ఉందని రాహుల్ అన్నా రు. సిపిఐ బిజెపితో జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు నచ్చలేదని అందువల్లే వారు యుడిఎఫ్ మద్దతు తో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ సిటీ మిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనంలేదని రాహుల్ అన్నారు. ఈ పథకం గురించి మోడీ ఎప్పుడూ గొప్పలు చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులుభిన్నంగా ఉన్నాయన్నారు. పౌరులకు ప్రాథమిక గౌరవం, స్వచ్ఛమైన నీరు, గాలి, భద్ర తను అందించడంలో ఆ నగరాలు విఫలమవుతుండడంతో అది ఓ అసంపూర్ణ పథకంగా మిగిలిపోయిందన్నారు.

## ఇస్ఫహాన్ నగరంపై బంకర్‌బస్టర్ బాంబులతో అమెరికా దాడి

**టెహ్రాన్, మార్చి 31:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడులు ఉగ్రరూపం దాల్చాయి. అటు చర్చల పేరిట ప్రకటనలు ఇస్తూనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ధోరణి తాను అవలంభిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు మంగళవారం తెల్లవారుజామున ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరంపై సంయుక్తంగా భారీ దాడులు జరిపాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇస్ఫహాన్‌లోని ఒక ప్రధాన ఆయుధ డిపోను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఈ దాడిలో సుమారు రెండువేల కిలోల బరువున్న బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ బాంబు దాడితో ఆయుధాగారంలో వరుసగా శక్తిమంతమైన పేలుళ్లు సంభవించి, ఆ ప్రాంతమంతా దట్టమైన మంటలు వ్యాపించాయి. దాదాపు 23 లక్షల జనాభా కలిగిన ఇస్ఫహాన్ నగరం సైనికపరంగా చాలా వ్యూహాత్మకమైనది. ఇక్కడ బద్ర్ సైనిక విమానాశ్రయం ఉంది. ఇరాన్ తన వద్ద ఉన్న 540 కిలోల యురేనియం నిల్వలను ఇక్కడి భూగర్భ కేంద్రంలో దాచిపెట్టి ఉండవచ్చని అనుమానాలున్నాయి. ఈ దాడికి ఒకరోజు ముందు ట్రంప్ ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించేందుకు వెంటనే ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌లోని ఇంధన వనరులు, అణు కేంద్రాలు, నీటి ప్లాంట్లు వంటి కీలక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని హెచ్చరిక చేశారు. ఒకవైపు దాడులు జరుగుతుండగా, మరోవైపు పాకిస్థాన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, టర్కీ వంటి దేశాలు దౌత్య మార్గాల ద్వారా సంక్షోభాన్ని నివారించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్ అణుబాంబు తయారీకి దగ్గరలో ఉందంటూ ట్రంప్, నెతన్యాహులు చేస్తున్న ఆరోపణలను ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షణ సంస్థ ఇప్పటివరకు ధ్రువీకరించలేదు. ఈ తాజా దాడులతో పశ్చిమాసియాలో పరిస్థితి మరింత చేయిదాటిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



డిజిపి కార్యాలయంలో ఈగల్ వెబ్‌సైట్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి, చిత్రంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు

## డ్రగ్స్ కట్టడిలో ఈగల్ విశేష కృషి

### వెబ్‌సైట్‌ను ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటైన ఈగల్ (పూర్వపు టి.నాబ్) వెబ్‌సైట్‌ను డిజిపి శివధర్‌రెడ్డి మంగళ వారం ప్రారంభించారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ వెబ్‌సైట్ ప్రారం భోత్సవ కార్యక్రమంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యాతో పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, కమాండ్ కంట్రోల్ ఇన్‌ఛార్జి కమలాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి ఈగల్ పోలీసులు విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కొత్తగా ఏర్పాటైన ఈగల్ వెబ్‌సైట్ లో అనేక అంశాలు వున్నాయని, వీటివల్ల మాదకద్రవ్యాలకు సంబంధించి సమాచారం ఇవ్వదలచుకున్న వారు దీనిని వినియోగించుకునే వీలుందని ఆయన తెలిపారు. దీంతో పాటు బాధితులు తమ నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని, మాదకద్రవ్యాల బాధితుల కోసం వున్న పునరావాస కేంద్రాల వి వరాలు ఇందులో వున్నాయని, వీటిని అందరు పరిశీలించుకోవచ్చని డిజిపి తెలిపారు. డ్రగ్స్ కట్టడికి ఈగల్ విభాగం చేబడుతున్న కార్యక్రమాలు ఈ వెబ్‌సైట్‌లో వుంటాయని తెలిపారు. ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా మాట్లా డుతూ డ్రగ్స్ కట్టడికి తమ విభాగం చేస్తున్న కృషికి పోలీసుల సహకారం ఎంతో అండగా వుందని తెలిపారు. రాష్ట్రంలో మాదకవ్యాలను సమూలంగా నిర్మూలించాలనే సర్కారు సంకల్పాన్ని ఈగల్ కచ్చితంగా నె రవేరుస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ డిఐజి అభిషేక్ మొహంతి, ఎస్‌పి రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ సర్కార్ హాయాంలో తెలంగాణలో పెరిగిన రేషన్‌కార్డులు

### జిఎస్‌టి ఆధారంగా 1,40,947 కార్డులను తొలగించాం

### పార్లమెంట్‌లో కేంద్రమంత్రి జయంతిబాయి జాంబానియా

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** తెలంగాణలో రేషన్‌కార్డుల సంఖ్య పెరిగినట్లు పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్న కార్డుల కంటే రేవంత్ సర్కారు హాయాంలో 15 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు పెరిగాయని వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 17,348 రేషన్ దుకాణాలు ఉండగా వాటి ద్వారా నెలకు 1.05 కోట్ల కార్డులకు రేషన్ పంపిణీ జరుగుతుంది. అందులో ఫుడ్‌సెక్యూరిటీ కార్డులు 99,36,073 ఉండగా, అంత్యోదయ అన్న యోజన కార్డులు 5,66,660, అన్నపూర్ణ కార్డులు 5146 ఉన్నాయి. రాష్ట్రంలో 33 జిల్లాలో అత్యధిక కార్డులు గ్రేటర్ మూడు జిల్లాల్లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో 936 రేషన్ దుకాణాలుంటే కార్డులు 8.39 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 588 షాపులు ఉండగా 6.53 లక్షలు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 655 రేషన్ దుకాణాలు ఉంటే 6.41 లక్షల కార్డులు ఉన్నాయి. తక్కువ కార్డులు ములుగు జిల్లాలో 1.02 లక్షలు, నారాయణపేట జిల్లాలో 1.69 లక్షలు ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ తెలిపింది. అయితే దేశ వ్యాప్తంగా నిబంధనలకు విరుద్దంగా ఉన్న 41.41 లక్షల కార్డులను తొలగించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా ప్రకటించారు. ఇందులో ఆదాయపు పన్నుశాఖ, రహదారి రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, జిఎస్‌టి డేటా ఆధారంగా అక్రమ కార్డులకు కత్తెర పెట్టినట్లు వెల్లడించారు. అతి తక్కువగా ఆంధ్రప్రదేశ్‌లో 102 కార్డులు కాగా, అత్యదికంగా రాజస్థాన్‌లో 6 లక్షలకు పైగా కార్డులు తొలగించామని చెప్పారు. తెలంగాణలో 1,40,947 కార్డులను తొలగించినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న 5.51 లక్షల రేషన్ దుకాణాలో లబ్దిదారుల ఆధార్ బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఆహార ధాన్యాల పంపిణీని సులభతరం చేసేందుకు ఆపాస్ పరికరాలను అమర్చడం జరిగిందని తెలిపారు. దీంతో రేషన్ సరకుల పంపిణీ అక్రమాలకు చోటు లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం, ప్రజా పంపిణీ వ్యవస్థ డేటాబేస్‌ను ఇతర సంక్షేమ పథకాలతో లింక్ చేయడానికి ఎటువంటి ప్రతిపాదన లేదని చెప్పారు.

## మైక్ ఇస్తే పచ్చి అబద్ధాలు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టించారు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అసెంబ్లీలో హారీష్ రావు, కెటిఆర్ కు మా స్పీకర్ మైక్ ఇస్తే పచ్చి అబద్దాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్‌ఎస్ వ్యవహరించిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపంచారు. సిఎల్‌పిలో ఆయన మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్‌ఎస్ సభ్యులు 16 గంటలు మాట్లాడితే అధికార పక్ష సభ్యులు 13 గంటలే మాట్లాడారనీ అన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడు కెసిఆర్ అసెంబ్లీకి రాలేదు, ప్రజా సమస్యలపైన మాట్లాడలేదనీ విమర్శించారు. 16 గంటలు బిఆర్‌ఎస్ పక్షానికి అవకాశం ఇస్తే హారీష్ రావు నాలుగు గంటలకు పదహారు నిమిషాలు..కెటిఆర్ గంటా నలభై నాలుగు నిమిషాలు మాట్లాడారనీ వివరించారు. ఆరు గంటలు హారీష్ రావు, కెటిఆర్ మాట్లాడి మిగితా బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే ల గొంతు నొక్కారనీ అన్నారు. హారీష్‌రావు, కెటిఆర్ ఎవరు ఎవరి గొంతు నొక్కారో తెలుస్తూనే ఉందంటూ ఎకసెక్కాలు చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ వల్ల 4 గంటల 56 నిమిషాల సభా సమయం వృథా అయిందనీ ఆరోపించారు. మా ముఖ్యమంత్రి నాయకత్వంలో అసెంబ్లీలో అర్థవంతమైన చర్చలు జరిగాయనీ స్వోత్కర్షలు చెప్పుకొన్నారు. సభ నుంచి సస్పెండ్ కావాలన్న ఉద్దేశంతోనే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంశాన్ని బిఆర్‌ఎస్ నాయకులు ప్రస్తావించారనీ ఆరోపించారు. సన్నబియ్యం భోజనం చేయాల్సి వస్తుందన్న భయం, కుట్రతో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి సస్పెండ్ అయి పోయారనీ విమర్శించారు. సన్న బియ్యం భోజనం చేయకపోతే పేదల నుంచి వ్యతిరేకత వస్తుందని భయపడ్డారనీ ఆయన భాష్యం చెప్పారు.

## పంచాయతీలకు రూ.247.94 కోట్ల నిధులు

### విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** దేశంలోని గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు రూ. 1,500 కోట్లకు పైగా గ్రాంట్లను విడుదల చేస్తూ కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక స్వపరిపాలనను మెరుగుపరచడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థలకు ఈ నిధులను కేటాయించారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల కోసం కేంద్రం రూ. 247.94 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇవి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత ఖిఅన్‌టైడ్ గ్రాంట్లను విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 12,600 గ్రామ పంచాయతీలకు నేరుగా లబ్ధి చేకూరనుంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించుకోవాల్సి ఉంటుంది. అయితే జీతాలు, కార్యాలయ ఖర్చులకు ఈ నిధులను వినియోగించకూడదని కేంద్రం తేల్చి చెప్పింది. తెలంగాణతోపాటు రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, మిజోరం, మేఘాలయ రాష్ట్రాలకు కూడా నిధులు విడుదలయ్యాయి.

# పసుపు రైతులకు అండగా సర్కారు

### కోతలు లేకుండా తడిసిన పసుపు కొనుగోలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అకాల వర్షాలు, బలమైన గాలులతో నష్ట పోయిన పసుపు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టింది. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తేమకు గురైన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తి తూకంతో కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు భారీగా పసుపు రాక కొనసాగుతోంది. నిన్నటి వరకు సుమారు 4,500 పసుపు కుప్పలు (27,400 బస్తాలు) మార్కెట్ యార్డుకు చేరుకున్నాయి. వీటిలో ఎక్కువ భాగాన్ని పైకప్పు ఉన్న షెడ్లలో భద్రపరచగా, సుమారు 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయబడ్డాయి. బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పసుపును రక్షి ంచేందుకు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 1,500 టార్పాలిన్‌ల పంపిణీకి బిడ్డింగ్ ప్రక్రియ పూర్తయింది. సోమవారం అర్ధరాత్రి సంభవించిన బలమైన గాలులు, వర్షాల ప్రభావంతో సుమారు 35-40 మంది రైతులకు చెందిన 70-80 పసుపు కుప్పలు తడిసిపోయాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తడిసిన పసుపును కూడా ఎటువంటి కోతలు లేకుండా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయం, నానో యూరియా వాడకంపై రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతు వేదికల ద్వారా పాల్గొన్న రైతులు రాష్ట్రవ్యాప్తంగా రైతులను నూతన సాంకేతికతలు, ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించేందుకు నిర్వహించిన రైతు నేస్తం 88వ ఎపిసోడ్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు, అధికారులకు ప్రకృతి వ్యవసాయ, నానో యూరియా వాడకంపై మంత్రి దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయం, నానో యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా మే 4 నుండి 9 వరకు నిర్వహించనున్న రైతు ఉత్సవాల్లో రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో పది లక్షల ఇప్పపూవు మొక్కలు నాటాలి

### సిఎం రేవంత్‌కు లేఖ రాసిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

### 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సంతకాల సేకరణ

### సినిమా రిలీజ్ ముందు సినీనటులకు డ్రగ్స్ టెస్ట్ చేయాలి

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పది లక్షల ఇప్ప మొక్కలు నాటాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖను రాశానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. మంగళవారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ లేఖలో 52 మంది బిజెపి, కమ్యూనిస్టు, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల సంతకాలు కూడా సేకరించామని తెలిపారు. సారా దుకాణాలు తెరవమని నేను చెప్పలేదని ఆయన వివరించారు. తెలుగుదేశం హయాంలోనే సారాను నిషేధించారు వాళ్లే మళ్లీ తీసుకువచ్చారనీ గతంను గుర్తుచేశారు. ఎస్‌టి సోదరులు ఇప్ప సారా చేస్తే తప్పైతే డిస్టలరీలు చేస్తే కరెక్ట్ ఎలా అవుతుందనీ ఆయన ప్రశ్నించారు. ప్రకృతి నుంచి వచ్చేది ఏదైనా మంచిదే అని ఆయన అభిప్రా యపడ్డారు. మన దగ్గర నుంచి ఇప్ప పువ్వు తీసుకెళ్లి లండన్‌లో సారాయి ఉత్పత్తి చేస్తున్నారనీ ఆయన చెప్పారు. ఇప్ప పువ్వు తో చేసేది ఆర్గానిక్ అవుతోందని, చాలా దేశాల్లో ఇప్ప పువ్వుతో అనేక ఉత్పత్తులు చేస్తున్నారని తెలిపారు. ఆదివాసీలను ఆర్థికంగా పటిష్టం చేయడమే నా ఉద్దేశమనీ అన్నారు. ఇప్ప పువ్వు సారా గురించి చెప్పినప్పుడు బిఆర్‌ఎస్, బిజెపి వాళ్లు కొందరు ఎగతాళి చేశారనీ ఆవేదన చెందారు.

మద్యం తాగొద్దు, తాగితే లిమిట్ లో ఉండాలని మా వాళ్లకు నేను చెపుతాను అని అన్నారు. ఇప్ప పువ్వు ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తే ఆదివాసీలకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలన్నదే నా ఉద్దేశమని చెప్పారు. ఇప్ప పువ్వు చెట్లు ప్రస్తుతం తక్కువ సంఖ్యలో ఉన్నాయనీ అన్నారు. సినియా యాక్టర్లు మందు తాగమని చెప్పడం తప్పు కదా అయినా సెన్సార్ బోర్డు ఎందుకు పట్టించుకోవడం లేదనీ ఆయన ప్రశ్నించారు. ఇప్పపువ్వు గురించి మాట్లాడితే సోషల్ మీడియాలో నా పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ ఆవేదన చెందారు. లిక్కర్ హెల్త్ కు మంచి కాదు కానీ ఈప్ప పువ్వు ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేద్దామనీ అన్నారు. ఇప్ప పువ్వుతో కూల్ డ్రింక్స్ , చాక్ లెట్లు లాంటి వి చేయోచ్చని చెప్పారు. తెలంగాణలో ఇప్ప పువ్వు కు బ్రాండ్ క్రియేట్ చేసి ఎగుమతు లు చేయాలనీ అన్నారు సినిమా నటులు డ్రగ్స్ తీసుకుంటున్నారని రూమర్స్ ఉన్నాయనీ డ్రగ్ టెస్ట్ తరువాతనే వారి సినిమాలను విడుదల చేయాడానికి అవకాశం కల్పించాలని సూచించారు. సినిమా నటులు ప్రతి రోజు 90 రోజులకోసారి డ్రగ్స్ టెస్ట్ చేసి రిపోర్ట్ లు చూపించాలనీ సినిమా నటులకు డ్రగ్స్ టెస్ట్ పైన నిబంధనలు పెట్టాలనీ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ ను తీసుకువచ్చి డ్రగ్స్ పైన కఠిన చర్యలు తీసుకుంటున్నారని నా కొడుకు కూడా చెపుతున్నాడనీ ఈగల్ అంతగా పాపులర్ అయిందని అన్నారు. నేను కూడా డ్రగ్స్ టెస్టు చేసుకున్నానని తెలిపారు.

# గ్రామ సభలను విజయవంతం చేయండి

### అధికారులకు మంత్రి సీతక్క దిశానిర్దేశం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిసీతక్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమా వేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యదేవరాజన్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యాచరణలో భాగంగా గురువారం గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ సభల్లో ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అత్యంత ముఖ్యమైన వేదికలని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించడం ద్వారా పాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చవచ్చని చెప్పారు. గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టి గ్రామస్థులం దరూ హాజరయ్యేలా చూడాలని చెప్పారు. సభల అజెండాను స్పష్టంగా ప్రజలకు తెలియజేసి, ప్రభుత్వ పథకాలపై సమగ్ర చర్చ జరిగేలా చూడాలని పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై గ్రామ సభల్లో విస్తృతంగా చర్చించా లన్నారు. ప్రతి గ్రామసభలో విధిగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశించారు. ప్రజల సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామ సభలను పల్లెల్లో పండగలా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గ్యాస్‌తో నడిచే ఆటోలకు ఎల్‌పిజి కొరత తీర్చండి

### కేంద్రమంత్రి హార్దీప్‌సింగ్‌కు మంత్రి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** హైద రాబాద్‌లో ఎల్‌పిజి ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హార్దీప్‌సింగ్‌పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పిజి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పిజి పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పిజి రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. కాగా.. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి.

రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పిజి కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొన సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ కంపెనీలకు గ్యాస్ సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వరంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పిజి అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని, కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయన్నారు.

# ఆరోపణల్లో పసలేకే అసెంబ్లీ నుంచి పలాయనం

### బిఆర్‌ఎస్‌పై ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అసెంబ్లీలో 11 బిల్లులు ప్రవేశ పెట్టి 10 బిల్లులు ఆమోదం చేసుకున్నామనీ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం సిఎల్‌పిలో మాట్లాడతూ ప్రజలకు ఉపయోగపడే బిల్లులు ప్రవేశపెడుతుంటే బిఆర్‌ఎస్ పార్టీ వ్యవహారించి తీరు బాగాలేదనీ ఆవేదన వ్యక్తంచేశారు. తల్లిదండ్రులను పట్టించుకొని ఉద్యోగస్తుల జీతంలో కోత పెట్టే బిల్లు తీసుకువచ్చామనీ అన్నారు. వృద్దాప్యంలో ఇబ్బంది పడే అనేక వర్గాలకు మేలు చేసే బిల్లులు పెట్టామనీ అన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపణల్లో పసలేకనే అసెంబ్లీ నుంచి పారిపోయారని దుయ్యబట్టారు. బడ్జెట్ కాఫీ లను చించి అనాగరిక చర్యకు పాల్పడ్డారనీ విమర్శించారు. బడ్జెట్ బ్రహ్మాస్త్రాలు లాంటి అంశాలు పెడుతున్నామని భయపడిపోయారని అన్నారు. ఇందిరమ్మ జీవిత బీమాతో పాటు కీలక పథకాలు తీసుకువచ్చామనీ చెప్పారు. కుట్ర, సంకుచితమైన బుద్ధితోనే బిఆర్‌ఎస్ అసెంబ్లీలో వ్యవహారించిందని చెప్పారు. అవినీతిని కప్పిపుచ్చు కోవడానికి బిఆర్‌ఎస్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. పదేళ్లలో బిఆర్‌ఎస్ అక్రమాలను వెలికితీస్తామని చెప్పడం మా చిత్తశుద్ధికి నిదర్శమని తెలిపారు. కాళేశ్వరంలో అవినీతి జరిగింది, ఒక్క ఎకరానికి నీళ్లివ్వలేదని కేంద్రమంత్రి సిఆర్ పాటిల్ పార్లమెంట్‌లో తేల్చి చెప్పారని గుర్తుచేశారు.

# సిఎం ప్రజావాణిపై ప్రజల్లో పెరిగిన విశ్వాసం



సిఎం ప్రజావాణిని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### మంత్రి పొన్నం ప్రభాకర్, ఇన్‌చార్జి చిన్నారెడ్డి

### అందిన దరఖాస్తులు 405

**హైదరాబాద్ (బేగంపేట), మార్చి 31, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 211వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 405 దరఖా స్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ది శాఖకు సంబంధించి 160 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 53దరఖాస్తులు, ఇంది రమ్మ ఇళ్ల కోసం 114 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణికి 01 దరఖా స్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం ప్రజావాణీని సందర్శించారు. అన్ని డెస్క్‌లను పరిశీలించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రవాసీ ప్రజావాని తీరును మంత్రి పరిశీలించారు. సీఎం ప్రజావాణీ అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంచార్జి చిన్నారెడ్డితో చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సీఎం ప్రజావాణీ కేంద్ర బిందువుగా నిల్చిందని ,సీఎం ప్రజావాణీ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానా రాయణ, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అమెజాన్‌లో గడ్డి మందు విక్రయాలు

### రాష్ట్ర రైతు కమిషన్ ఆగ్రహం

### నోటీసుల జారీకి అధికారులకు ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** పారక్వాట్ గడ్డి మందును నిషేదిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మాణం చేయడాన్ని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి స్వాగతించారు. అత్యంత విషపూరితమైన పారక్వాట్ వల్ల వందలాది మంది తెలంగాణ రైతులు ప్రాణాలు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి మందు, కలుపు మందు నిషేదించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రైతు సంఘాల నేతలు రైతు కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గడ్డి మందు నిషేదించడంతో పాటు దేశంలో కూడా నిషేధించడానికి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని రైతు కమిషన్ కోరింది. రైతు కమిషన్ సూచన మేరకు అసెంబ్లీలో తీర్మానం పెట్టడం సంతోషమని కోదండరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కమిషన్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో చర్చించారు. అమెజాన్ ఆన్‌లైన్ మార్కెట్ ప్లాట్‌ఫామ్‌లోనూ గడ్డిమందు అందుబాటులో ఉండడంపై కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. అమెజాన్ కు లైసెన్స్ ఇవ్వడంపై, విషపూరితమైన గడ్డి మందును ఎలా సరఫరా చేస్తుందని ప్రశ్నించారు. అమెజాన్‌కు గడ్డి మందు విషయంపై నోటీసులు ఇవ్వాలని అధికారులను కమిషన్ ఆదేశించింది. ఇక భూసార పరీక్షా కిట్ల పనితీరుపై వ్యవసాయ అధికారులను కమిషన్ అడిగి తెలుసుకుంది. రైతుల్లో భూసార పరీక్షపై మరింత అవగాహన కల్పించాలని, నేలకు తగ్గట్టుగా రైతులు పంటలను సాగుచేసేలా చూడాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. పంటల మార్పిడి విధానంపై కూడా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, కెవిఎన్‌రెడ్డి, మెంబర్ సెక్రెటరీ గోపాల్, వ్యవసాయశాఖ అధికారులు గీతారెడ్డి, సుచరిత, శ్రీధర్‌తోపాటు కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## కగార్ చివరిరోజు భారీగా మావోయిస్టుల లొంగుబాటు

### బీజాపూర్‌లో 25 మంది, దంతెవాడలో ఐదుగురు, సుక్మాలో ఇద్దరు

**చర్ల, మార్చి 31, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ చివరి రోజైన మంగళవారం చత్తీస్‌గఢ్ లో 32 మంది మావోయిస్టులు లొంగిపోయారు. బీజాపూర్ జిల్లాలో 25 మంది మావోయిస్టులు 93 ఆయుధాలతో పాటు 7.2 కిలోల బంగారం, రూ,2.90 కోట్ల నగదును ఈ సందర్భంగా పోలీసులకు అప్పగించారు. మరోపక్క సుక్మా జిల్లాలో ఇద్దరు నక్సల్స్ లొంగి పోయారు. బీజాపూర్ ఎస్పీ కిరణ్ చవాన్ మాట్లాడుతూ నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ లో రూ.10 లక్షల నదులతో పాటు ఆటోమేటిక్ ఆయుధాలు ఉన్న భారీ నక్సల్స్ డంపును స్వాధీనం చేసుకోవడం ద్వారా భద్రతా బలగాలు పెద్ద విజయాన్ని సాధించాయి అన్నారు. బస్తర్ ఐజి సుందర్ రాజ్ ఈ సందర్భంగా బీజాపూర్ ఎస్పీ జితేందర్ కుమార్ యాదవ్ ను అభినందించారు. అదే విధంగా దంతెవాడ జిల్లాలో ఐజి పి.సుందర్ రాజ్ సిఆర్ పిఎఫ్ డిఐజి రాకేష్ దంతెవాడ కలెక్టర్ దేవేశ్ కుమార్ ఎదుట లొంగిపోయారు. లొంగిపొయిన వారిలో భైరామ్ గఢ్ ఏరియా కమిటి సభ్యులు సోమెన్ కడ్తీ లఖ్మా పోయం జోగి కల్మా ఉన్నారు. ఈ సందర్భంగా ఐజి సుందర్ రాజ్ మాట్లాడుతూ గడిచిన రెండేళ్లలో నాలుగు వేల మంది ఉండగా ఇప్పుడు పదుల సంఖ్యలో కొద్దిమంది మాత్రమే ఉన్నారని వారందరూ ఆయుధాలు వీడి లొంగిపోవాలని విజ్ఞప్తి చేసారు. సమావేశంలో ఎస్పీ గౌరవ్ రాయ్ ఉన్నారు.



జిహెచ్‌ఎంసి అధికారులు సీజ్ చేసిన జయలలితకు చెందిన భవనం

## హైదరాబాద్‌లోని జయలలిత భవనం సీజ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మార్చి 31, ప్రభాతవార్త:** తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలితకు చెందిన భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్‌కాలనీలో జీప్లస్ 4తో నిర్మించిన ఒక ఇళ్లు జయలలిత పేరుతో ఉంది. ఇందుకు సంబంధించి ఆస్తిపన్ను బకాయి 2017 నుంచి పేరుకుపోయాయి. దీంతో యూసుఫ్‌గూడ సర్కిల్-38 ఉపకమిషనర్ సురేష్ ఫిబ్రవరిలో జయలలితకు సంబంధించిన వారికి నోటీసులను అందించారు. వారి నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాకపోవడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ భవనాన్ని సీజ్ చేశారు. ఓటీఎస్ పథకం అమలులో ఉన్న నేపథ్యంలో రాయితీ మినహాయించి రూ. 82,91,822 బకాయిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతంలో వాణిజ్య కార్యాకలాపాలు కొనసాగినప్పటికి 2017 నుంచి ఇది నివాసిత భవనంగా కొనసాగుతున్న నేపథ్యంలో జయలలిత మేనల్లుడు ఈ భవనాన్ని వాణిజ్యం నుంచి నివాసిత భవనంగా మార్పు చేసి అందుకు అనుగుణంగా పన్ను క్రమబద్ధీకరించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను గతంలో కోరారు. అయితే బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈ భవనాన్ని సీజ్ చేశారు.

## హారీశ్‌రావు దోపిడీని చూసి నీటిపారుదల శాఖ నుంచి తప్పించారు

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** హరీశ్‌రావు దోపిడిని చూసి నీటిపారుదల శాఖ నుంచి కెసిఆర్ తప్పించారనీ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆరోపించారు. సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 10 ఏళ్లు హరీష్ రావు పాల డైరీ పెట్టి దోచుకున్నాడనీ విమర్శించారు. కెసిఆర్‌ను ఫామ్ హౌస్ కు పరిమితం చేసి బావ బామ్మర్థి ఆధిపత్యం కోసం బిఆర్‌ఎస్ లో కొట్లాడుకుంటున్నారనీ అన్నారు. అన్ని ఎన్నికల్లో బిఆర్‌ఎస్ చిత్తుగా ఓడిపోయిందనీ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారనీ అన్నారు. కాళేశ్వరం పైన కేంద్ర మంత్రిసిఆర్ పాటిల్ నిజాలు బయటపెట్టాడనీ ఆయన అన్నారు. హరీష్ రావు ఇప్పుడు తలకాయ ఎక్కడ పెట్టుకుంటవనీ ప్రశ్నించారు. ఇందిరమ్మ బీమా పేరుతో రాష్ట్ర ప్రజలందరకి భరోసా కల్పించినందుకు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## తప్పను కప్పిపుచ్చుకోవడానికే మాపై బురద

### హారీశ్‌రావుపై ప్రభుత్వ విప్ విజయరమణరావు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** హరీశ్‌రావు చేసిన తప్పులు కప్పి పుచ్చుకోవడం కోసం మా ప్రభుత్వం పైన బురద జల్లుతున్నారనీ ప్రభుత్వ విప్ విజయరమణరావు ఆరోపించారు. మంగళవారం ఆయన సిఎల్‌పిలో మాట్లాడుతూ దళిత స్పీకర్ అని హరీష్ రావు సభా నిర్వహణ పైన ఆరోపణలు చేస్తున్నాడనీ దళితుడు స్పీకర్ కుర్చీలో కూర్చుంటే అవమానించేలా హరీష్ రావు మాట్లాడుతున్నాడనీ ఆవేదన చెందారు. 2023 నుంచి వరుసగా అన్ని ఎన్నికల్లో బిఆర్‌ఎస్ చిత్తుగా ఓడిపోయింది, అయినా బుద్ధి రావడం లేదనీ విమర్శించారు. అసెంబ్లీలో గతంలో కెసిఆర్ మాట్లాడిన మాటలను ఎథిక్స్ కమిటీకి పంపాలనీ డిమాండ్ చేశారు. కెటిఆర్ బయటకు ఎంత వల్గర్ గా మాట్లాడుతున్నాడో అంతా చూస్తున్నారని అన్నారు. పార్టీ గుర్తుపై జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 90 శాతం సీట్లు గెలిచామనీ చెప్పారు. మైనింగ్ అంశంను సిట్టింగ్ జడ్జి, హౌస్ కమిటీ వేయాలని హరీష్ రావు అడుగుతున్నాడనీ. మేం సిబిసిఐడికి ఇస్తామంటే ఎందుకు ఒప్పుకోవడం లేదు? అని ప్రశ్నించారు.

# పాక్‌లో జైషే మహమ్మద్ చీఫ్ అజర్ మసూద్ సోదరుడి అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** భారత్‌లో ఉగ్రవాద దాడులకు పాల్పడి పాక్‌లో తలదాచుకుంటున్న ఐఎస్ఐ, దాని అనుబంధ సంస్థలకు చె ందిన ఉగ్రవాదుల అనుమానాస్పద మరణాలు, హత్యలు ఆగడం లేదు. ఇప్పటికే అనేక మంది కరుడుగట్టిన ఉగ్రవాదులు పాక్‌లోని తమ స్థావరాల వద్ద హత్యలకు గురవడం లేదా వున్నట్లుండి కుప్పకూలి చనిపోవడం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో జైష్ ఏ మహమ్మద్ అధినేత అజర్ మసూ ద్ సోదరుడు, కీలక నేత తాహిర్ అన్వర్ సోమవారం ఉదయం పాక్‌లోని జైష్ ఏ మహమ్మద్ ప్రధాన కార్యాలయం వున్న బహావల్పూర్‌లో వున్నట్లుండి ఒక్కసారిగా కుప్పకూలాడు. సహచరులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. అతను అప్పటికే చనిపోయాడు. అన్వర్ మరణంపై పాకిస్తాన్ కానీ జైష్ ఏ మహమ్మద్ కానీ ఎలాంటి ప్రకటన చేయలేదు. అతను ఎలా చనిపోయాడనే విషయం కూడా వెల్లడించలేదు.

సోమవారం రాత్రి అదే ప్రాంతంలో గల జామియా మసీదులో అన్వర్ భౌతికకాయానికి హడావిడిగా అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ అంత్యక్రియల్లో జైష్ ఏ మహమ్మద్ అధినేత అజర్ మసూద్‌తో పాటు ఆ సంస్థ కీలక నేతలు పాల్గొన్నారు.

# ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం అత్యవసర ల్యాండింగ్

## 148 మంది ప్రయాణికులు సురక్షితం



**లక్నో, మార్చి 31:** బాగ్డోగ్రా నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో పొగలు రావడంతో కలకలం రేగింది. అప్రమత్తమైన పైలట్, విమానాన్ని లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 148 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా, అందరూ సురక్షితంగా బయటపడ్డారు. విమానం గాల్లో ఉండగా, కీలకమైన ఎలక్ట్రానిక్ వ్యవస్థలు ఉండే ఏవియానిక్స్ బేలో సిబ్బంది పొగలను గుర్తించారు. వెంటనే పైలట్ అత్యవసర పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు తెలియజేశారు. ప్రాణాపాయం లేని, కానీ అత్యవసరమైన పరిస్థితుల్లో వాడే పాన్‌పాన్ కాల్ ద్వారా సమాచారం అందించారు. ఇది తీవ్రమైన ప్రమాదాన్ని సూచించే మేడే కాల్ కంటే భిన్నమైనది. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని లక్నోకు మళ్లించినట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తెలిపింది. లక్నోలో సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికులకు అల్పాహారం అందించి, ప్రత్యామ్నాయ విమానాల్లో వారిని ఢిల్లీకి పంపించారు. జరిగిన అసౌకర్యానికి ప్రయాణికులకు క్షమాపణలు చెబుతున్నట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం ఈ విమానాన్ని ఎయిర్‌క్రాఫ్ట్ ఆన్ గ్రౌండ్ (ఏఓజీ)గా ప్రకటించి, పూర్తిస్థాయి తనిఖీల కోసం లక్నోలోనే నిలిపివేశారు. ఇటీవల కాలంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం ఇది రెండోసారి.



సలేశ్వరంలో కొలువుదీరిన లింగమయ్య

# నేటి నుంచి సలేశ్వరం జాతర

## తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా ప్రసిద్ధి

## లక్షలాదిగా తరలిరానున్న యాత్రికులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 31 ప్రభాతవార్త :** చుట్టూ దట్టమైన అడవులు.. కనుచూపుమేరా కొండ చర్యలు.. దారేలేని ప్రయాణం.. నడకే శరణ్యం.. దారి పొడున్న వన్యప్రాణుల కనువిందు.. పక్షుల కిలకిల రాగాలు.. పచ్చని ప్రకృతి వెంట సాగే యాత్ర.. కొన్ని గంటలపాటు సాహసోపేతంగా సాగే జర్నీ తెలంగాణ అమర్నాథ్ యాత్రగా పేరుపొందిన సలేశ్వరం జాతర ఉత్సవాలకు వేళయింది. మూడు రోజులపాటు జరిగే సాహస యాత్రకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో సలేశ్వరం జాతరకు ప్రత్యేక పేరు ఉన్నది. తెలంగాణ అమర్‌నాథ్ యాత్రగా పిలుచుకునే ఈ జాతరకు ఏటా లక్షలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. కాలి నడకన నల్లమల అడవిలో ప్రయాణించి కొండల్లో కోనల్లో దాగిన ఆ శివయ్య చెంతకు చేరుకుని పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 1 నుండి 3 వరకు సలేశ్వరం జాతర జరగనుంది. దట్టమైన నల్లమల అడవుల్లో ప్రకృతి ఒడిలో సాగే అద్భుత సాహస యాత్రగా పిలుస్తుంటారు. నాగర్ కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని నల్లమల అభయారణ్యంలో సలేశ్వరం ఉన్నది. ఏటా ఉగాది పండగ తర్వాత వచ్చే చైత్ర పౌర్ణమి సందర్భంగా ఒక్కసారి మాత్రమే ఈ అటవీ మార్గాన్ని భక్తుల కోసం తెరుస్తారు. ఇక నల్లమల అడవిలో దాగిన ఈ ఆలయాన్ని చేరుకోవాల బస్సు మార్గం తప్ప వేరే దారి లేదు. హైదరాబాద్ నుంచి వెళ్లే భక్తులు ఎంజీబీఎస్ నుంచి శ్రీశైలం వెళ్లే బస్సు ఎక్కి మన్ననూర్ వద్ద దిగాలి. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో సలేశ్వరం బేస్ క్యాంప్(రాంపూర్ పెంట) వరకు ప్రయాణించవచ్చు. ఇక్కడి నుంచి సలేశ్వరం యాత్ర స్టార్ట్ అవుతుంది. దట్టమైన అడవిలోని కొండలు, లోయలు దాటుకుంటూ కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది.

# కరెంట్ చార్జీలు పెరగవు

## విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉత్తర్వులు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త** విద్యుత్ వినియోగదారులకు ఊరట. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27 లో ప్రస్తుతం అమల్లో ఉన్న కరెంట్ చార్జీలే అమలుకానున్నాయి. ఈ మేరకు దీనికి సంబంధించి తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టీజీఈఆర్సీ) టారీఫ్ ఉత్తర్వులును విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో కరెంట్ బిల్లులు పెంచడం లేదని ఇటీవల దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు వార్షిక ఆదాయ, వ్యయ, నిర్వహణ నివేదికలను సమర్పించాయి. వీటిపై విచారణ జరిపిన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఈమేరకు టారిఫ్ ఉత్తర్వులు ఇచ్చింది. డిస్కమ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పాత కరెంట్ చార్జీల వసూలుకే పరిమితం కావాలని, అందుకు అనుగుణంగా టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ టారిఫ్ ఉత్తర్వులు విడుదల చేశారు.

# కుమ్మెర ఘటనపై సిబిఐ విచారణ జరపాలి

## జాతీయ బిసి సంక్షేమ సంఘం డిమాండ్

### పసిపాప మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

### ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా

**హైదరాబాద్ మార్చి 31 ( ప్రభాతవార్త ) :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా రజక దంపతులపై జరిగిన దాడి, పసిపాప మరణానికి కారణమైన ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ దారుణానికి నిరసనగా మంగళ వారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వందలాది మంది కార్యకర్తలతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి బీసీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి పార్లమెంట్ పరిసరాల్లో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. సభ్య సమాజం తలవంచుకునేలా ఉన్న కుమ్మెర ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించే తీరు సరిగా లేదని విమర్శించారు. పసిపిల్లలను కూడా చూడకుండా దౌర్జన్యం చేయడం, ఆ క్రమంలో శిశువు మరణించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అగ్రకులాల అరాచకాలు పెరిగిపోతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి బీసీ, దళిత వర్గాలకు రక్షణ కరువైందని అరుణ్ కుమార్ ఆరోపించారు. కుమ్మెర కంటే ముందు నల్గొండలో యాదవులపై, కరీంనగర్‌లో నాయి బ్రాహ్మణులపై, నిజామాబాద్‌లో వడ్డెరలపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. ఈ దాడులను అరికట్టకపోతే బీసీలు ఐక్యంగా ఎదురుదాడి చేస్తారని హెచ్చరించారు.

# బిసిలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది

## బడ్జెట్‌లో బిసిలకు తక్కువ నిధులు కేటాయించి నిరాశ మిగిల్చింది : బిసి జెఏసి చైర్మన్ జాజుల ఆరోపణ

**సైఫాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికి బిసిల డిమాండ్లపై చర్చించకుండా తీవ్ర నిరాశ మిగిల్చిందని బిసి జెఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వం బిసి వ్యతిరేక వైఖరి విడనాడకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. మంగళవారం సైఫాబాద్‌లోని బిసి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి సబ్‌ప్లాన్, ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని వదిలేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాత్మా జ్యోతిభా పూలే పేరుతో బిసి సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకువస్తామని, ప్రతి ఏడాది బిసిలకు బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయిస్తామని, ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని ఆరోపించారు. గత రేండేళ్ళలో బిసిలకు బడ్జెట్‌లో తక్కువగా నిధులు కేటాయించిందని, కేటాయించిన దానిలో మొత్తం నిధులను ఖర్చు చేయలేదని, ఈ ఏడాది బిసి సబ్‌ప్లాన్ ఊసే లేదన్నారు. బిసిల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, తక్షణమే బిసి సబ్‌ప్లాన్ చట్టబద్ధత కోసం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించాలని, బడ్జెట్‌ను 20 వేల కోట్లకు పెంచాలని, ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని జాజుల డిమాండ్ చేశారు.

# ఉజ్వల్ లబ్ధిదారులకు కేంద్రం కొత్త నిబంధన

**న్యూఢిల్లీ, మార్చి 31:** వంటగ్యాస్‌పై సబ్సిడీ పొందుతున్న ప్రధానమంత్రి ఉజ్వల్‌యోజన లబ్దిదారులకు కేంద్రం కేవైసీ తప్పనిసరి చేసి కొత్త నిబంధన విధించింది. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో ఒకసారి తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలనే నిబంధన విధించింది. ఈ కేవైసీ చేయించుకోకపోతే రూ.300 సబ్సిడీ నిలిపివేయనుందని ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీ అయిన హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో వివరాలు వెల్లడించింది.14.2 కిలోల సిలిండర్లకు సంబంధించి 8,9వ రీఫిల్‌పై రూ.300 సబ్సిడీ పొందాలంటే తప్పనిసరిగా బయోమెట్రిక్ ఆధార్ ఐథెంటిఫికేషన్ చేయించుకోవాలని సూచించింది. ఇక 5 కిలోల సిలిండర్ వాడుతుంటే 21 రిఫీల్‌కు ఇది వర్తిస్తుంది. రూ.300 సబ్సిడీ కోల్పోకుండా ఉండాలంటే ఆర్థికసంవత్సరం ముగిసేలోపు తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలి. లేకపోతే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రావాల్సిన రూ.300 సబ్సిడీ ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఇక గ్యాస్ రీఫిల్లింగ్ సేవలు కూడా నిలిచిపోయే అవకాశముంది. ప్రతీ ఏడాదిలో ఒక్కసారైనా కేవైసీ పూర్తి చేస్తే సబ్సిడీ, రీఫిల్లింగ్‌లో ఎలాంటి అంతరాయాలు ఉండవు. కేవైసీని ఇంట్లోనే ఉండి సులువుగా చేసుకోవచ్చు.



# శ్రీసిద్దేశ్వర్ తీర్థ్ బ్రహ్మశ్రీ ఆశ్రమాన్ని సందర్శించిన గవర్నర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి31:** తిరుపతి సమీపంలోని సి. రామాపురంలో ఉన్న శ్రీ సిద్ధేశ్వర్ తీర్థ్ బ్రహ్మశ్రీ ఆశ్రమాన్ని మంగళవారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి జానకి శుక్లా సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఆవరణలోని లక్ష్మీ నారాయణ ఆలయం, జైన్ మందిరాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు గవర్నర్ దంపతులకు ఆశీస్సులు అందించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం ఉదయం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు.

# అయిదేళ్ల చిన్నారిపై అసభ్య దృశ్యాల చిత్రీకరణ.. యువకుడి అరెస్టు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులతో పాటు అశ్లీల దృశ్యాలు, సాహిత్య వ్యాప్తిని నిరోధించే క్రమం లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరో కేసులో నిందితుడిని అరెస్టు చేసింది. గోల్కొండలో గల కుమ్మరివాడిలో ఐదేళ్ల చిన్నా రిపై లైంగిక అసభ్య దృశ్యాలను చిత్రీకరించి వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కేసులో ఆ బాలికకు సమీప బంధువైన మహమ్మద్ ఫహాద్ (19) అలియాస్ ఆదిల్ అనే యువకుడిని టిజిసిఎస్‌బి అరెస్టు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ మంగళ వారం మీడియాకు వెల్లడించారు. కుమ్మరివాడిలో వుంటున్న ఓ కుటుంబంలో ఐదేళ్ల చిన్నారికి సమీప బంధువైన ఆదిల్ తరచూ ఆ ఇంటికి వచ్చేవా డు. ఈ క్రమంలో ఆ బాలికను ఇంటి టెర్రస్ పైకి తీసుకెళ్లి ఎవరూ లేని సమయంలో ఆ బాలికపై లైంగిక దాడిచేస్తున్నట్లు వీడియోలు తీసేవాడు. దీ ంతో పాటు ఆ బాలిక అశ్లీల ఫోటోలను తీసుకున్నాడు. ఈ ఫోటోలను, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. దీనిపై సమాచారం అ ందుకున్న చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై రంగంలో దిగిన టిజిసిఎస్‌బి చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లోతుగా విచారించగా ఈ నేరానికి పాల్పడింది ఆదిల్ అని తేల్చారు. ఆదిల్‌ను మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద అసభ్య ఫోటోలు, వీడియోలు తీసే ఎలక్ట్రాని క్ పరికరం లభ్యమయ్యింది. నిందితుడిపై ఐటి చట్టం, సహ పోక్సో చట్టం, సిసిపిఎస్ కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

# బెంగళూరులో విషాదం! సిద్దిపేట యువకుడు మృతి.. షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన ప్రియురాలు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి** బెంగళూరులో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లాకు చెందిన యువకుడు బాబు రెడ్డి (33) మంగళవారం ఆత్మహత్య చేసుకోగా, అతనితో సహజీవనం చేస్తున్న యువతి కూడా షాక్‌తో భవనం పై నుంచి దూకి ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కథనం ప్రకారం సిద్దిపేట జిల్లాకు చెందిన బాబురెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఒక అపార్ట్‌మెంట్‌లో యువతితో కలిసి నివసిస్తున్నాడు. ఘటన జరిగిన రోజు యువతి ఇంటి అవసరాల కోసం బయటకు వెళ్లిన సమయంలో బాబురెడ్డి తమ అపార్ట్‌మెంట్‌లో ఉరివేసుకుని మృతి చెందాడని, ఇంటికి తిరిగి వచ్చిన యువతి ఈ దృశ్యం చూసి తీవ్ర ఆవేదనకు గురై వారు నివసిస్తున్న అపార్ట్‌మెంట్ భవనం పై అంతస్తు నుంచి దూకి ప్రాణాలు కోల్పోయిందని తెలుస్తుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. పోలీసులు పూర్తి వివరాలు తెలియరాలేదు.

# చివరి శ్వాస వరకు ఉత్సాహంగా పనిచేస్తా

## - బసవతారకం కేన్సర్ ఆసుపత్రి చైర్మన్, నటుడు నందమూరి బాలకృష్ణ




డాక్టర్ టి. సుబ్రమణ్యేశ్వర్‌రావును సత్కరిస్తున్న బాలకృష్ణ, బ్రాహ్మణి, బసవతారకం వైద్యులు

**జూబ్లీహిల్స్, మార్చి 31, ప్రభాత వార్త:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ డైరక్టర్ డాక్టర్ టి. సుబ్రమణ్యేశ్వర్‌రావు గ్లోబల్ ఫోరం ఆఫ్ క్యాన్సర్‌కు తొలి భారతీయ అధ్యక్షుడిగా ఎంపిక య్యారయి మేరకు ఆయనకు మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యురాలు నారా బ్రహ్మణిలతో పాటు ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ పేదలకు సేవ చేసే అవకాశం ఆసుపత్రి రూపంలో తనకు వచ్చిందన్నారు. సినీనటుడిగా, ఎమ్మెల్యేగా, ఆసుపత్రి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించే క్రమంలో తానెప్పుడు భారంగా భావించలేదన్నారు. ప్రపంచ స్థాయి సంస్థకు ఆసుపత్రి వైద్యుడు అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. తన చివరి నిమిషం వరకు ఉత్సాహంగా పనిచేస్తానన్నారు. డాక్టర్ సుబ్రమణ్యేశ్వర్‌రావు మాట్లాడుతూ నల్గొండ జిల్లాలోని రైతు కుటుంబంలో జన్మించిన తాన ఈ స్థాయికి చేరడం వెనుక అందరి సహకారం ఉందన్నారు. గ్లోబల్ ఫోరం ఫర్ క్యాన్సర్ సర్జన్స్‌కు అధ్యక్షుడిగా ఎంపికవ్వడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణను సైతం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ట్రస్టు బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, సీఓఓ రావి శ్రీనివాస్‌రావు, అసోసియేట్ డైరక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికోటేశ్వర్‌రావు, డాక్టర్ సెంథిల్ రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

# మూల సూత్రాలను వదిలేసిన వామపక్షాలు

## బిజెపి - ఎల్‌డిఎఫ్ మధ్య రహస్య ఒప్పందం

## కన్నూరు ఎన్నికల సభలో రాహుల్‌గాంధీ



**కన్నూర్, మార్చి 31:** కేరళంలో అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్‌పై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వామపక్షాలకు, భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి మధ్య రహస్య ఒప్పందం ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను సిద్ధాంతాల పోరుగా రాహుల్ గాంధీ అభివర్ణించారు. యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) స్టార్ క్యాంపెయినర్‌గా కన్నూర్‌కు చేరుకున్న గాంధీ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు హాజరైన భారీ ర్యాలీలో ప్రసంగించారు. అంతకు ముందు స్థానిక నాయకులతో అల్పాహార సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం యుడిఎఫ్ మద్దతు ఉన్న అభ్యర్థులు, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు టి.కె. గోవిందన్, వి. కుంజికృష్ణన్ హాజరు కావడం ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వామపక్షాలలో వస్తున్న మార్పుకు వారి వేదికే 'నిదర్శనం' అని గాంధీ పేర్కొన్నారు. "ఈ ఎన్నికలు వామపక్షాలు, యుడిఎఫ్ అనే రెండు సిద్ధాంతాల మధ్య పోరు. కానీ, చారిత్రాత్మకంగా పరస్పర విరుద్ధమైన వైఖరులున్న వామపక్షాలు, బిజెపిల మధ్య భాగస్వామ్యాన్ని చూడటం ఇదే మొదటిసారి," అని గాంధీ అన్నారు. ప్రస్తుత వామపక్షాలు తమ మౌలిక సూత్రాలకు దూరమయ్యాయని, ప్రజలకు ప్రాతినిధ్యం వహించడం మానేసి, ఇప్పుడు కార్పొరేట్ల పట్ల సానుభూతి చూపుతున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా మతపరమైన సమస్యలను ప్రస్తావిస్తారని, కానీ కేరళంలో, ముఖ్యంగా శబరిమల విషయంలో అలా చేయడానికి వెనుకాడతారని ఆయన పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి పినరయి విజయన్ లేదా ఆయన కుటుంబంపై ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికి ఎందుకు చర్య తీసుకోలేదని రాహుల్ ప్రశ్నించారు. "సిపిఐ(ఎం)ను అధికారంలోకి తీసుకురావాలని బిజెపి కోరుకుంటోంది, ఎందుకంటే వారిని నియంత్రించగలరు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వాన్ని వారు నియంత్రించలేరు," అని గాంధీ అన్నారు. జాతీయ స్థాయిలో ప్రధాని మోడీని సమర్థవంతంగా వ్యతిరేకించే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. జాతీయ సమస్యల విషయానికి వస్తే, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, విదేశాంగ విధానాలను తీవ్రంగా తప్పుపట్టారు. అమెరికాకు అనుకూలంగా ఇటీవల తీసుకున్న వాణిజ్య నిర్ణయాలు భారతీయ రైతులకు, ముఖ్యంగా రబ్బరు, మొక్కజొన్న, సోయా, పండ్ల పంటలు పండించే వారికి నష్టం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత ఇంధన భద్రతకు, చిన్న వ్యాపారాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కాంగ్రెస్ నేత హెచ్చరించారు.

# టివికె చీఫ్ విజయ్‌పై కేసు

## - మరో అభ్యర్థిపై లైంగిక వేధింపుల కేసు

## - సిఎం స్టాలిన్ వాహనం అధికారుల తనిఖీ

**చెన్నై, మార్చి 31:** తమిళగ వెట్రి కజగమ్ (టివికె) చీఫ్ విజయ్‌పై మంగళవారం పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ కుమార్ ఫిర్యాదు మేరకు విజయ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి 30 లౌడ్ స్పీకర్ వినియోగించడం, ఐదే వేల మందికి పైగా ప్రజలను సమీకరించి సభ నిర్వహించడంతో ప్రజల సాధారణ జీవనానికి తీవ్ర ఆటంకం కల్గించారంటూ ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ ఫిర్యాదు చేసినట్లు పెరవల్లూరు పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా పూనమల్లీ అసెంబ్లీ నియోజకవర్గం టివికె అభ్యర్థి ప్రకాష్ అలియాస్ కుట్టిపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ప్రకాష్ ప్రస్తుతం తిరువల్లూరు దక్షిణ జిల్లా కార్యదర్శిగా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తిరువల్లూరులో ఓ వివాహ వేడుకకు హాజరుకాగా, ప్రకాష్ తనను లైంగికంగా వేధించాడని, ఆరోజు నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని పార్టీ మహిళా ఎగ్జిక్యూటివ్ ఒకరు తిరువల్లూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ వాహనాన్ని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది. ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా మంగళవారం ఉదయం తిరుచి - నాగపట్నం జాతీయ రహదారిపై స్టాలిన్ వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేసింది. అందులో అనుమానించదగ్గ వస్తువులేమీ లభించలేదని పోలీసులు తెలిపారు.

# ఓవర్ డ్రాఫ్ట్‌గా రూ.37,457 కోట్లు

## అత్యవసరాలకూ ఖజానాలో నిధులు నిల్

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త** తెలంగాణ ప్రభుత్వం ఓవర్ డ్రాఫ్ట్‌పై ఆధారపడింది. పెరిగిన అత్యవసర ఖర్చులకు సైతం ఖజానాలో నిధులు లేకపోవడంతో రిజర్వ్ బ్యాంక్ వద్ద 123 రోజుల పాటు ఓవర్ డ్రాఫ్ట్ రుణాలను తీసుకోవాల్సి వచ్చింది. ఈ విధంగా మొత్తం 37,457 కోట్ల రూపాయలను ఓవర్ డ్రాఫ్ట్ రుణాలుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ప్రకారం రాష్ట్ర ఖజానాలో ప్రతీ రోజూ కనీసం రూ.1.38 కోట్ల నిల్వ ఉండాలనే నిబంధనను రిజర్వ్ బ్యాంక్ నిర్ధేశించగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా నాలుగు నెలల పాటు అంతకంటే తక్కువ నిల్వలు ఉండటం పట్ల రిజర్వ్ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో రాష్ట్ర సర్కార్ రూ.37,457 కోట్ల మేర రుణాలను ఓవర్ డ్రాఫ్ట్‌గా రిజర్వ్ బ్యాంక్ వద్ద సేకరించింది. కాగా అత్యవసర ఖర్చులకు గాను అవసరమైన నిధులు లేక రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో రిజర్వ్ బ్యాంక్ నుండి తాత్కాలికంగా ఓవర్ డ్రాఫ్ట్ కింద రుణాన్ని పొందవచ్చు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరగానే రిజర్వ్ బ్యాంక్‌కు ఓవర్ డ్రాఫ్ట్ కింద తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

# స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు 20 వరకు పొడిగింపు

## ఇప్పటి వరకు 9.70 లక్షల మంది దరఖాస్తు - గత ఏడాది 10.89 లక్షల మంది

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 31:** తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తు గడువును పొడిగించారు. గతంలో ప్రకటించినట్టుగా దరఖాస్తు గడువు మార్చి 31 వరకు ఉండగా.. దానిని కాస్త ఈ నెల 20 వరకు పొడిగించారు. 2025-26 విద్యా సంవత్సరానికి కొత్తగా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవడంతోపాటు గతంలో దరఖాస్తు చేసుకొని రెన్యూవల్ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం తెలంగాణ ఇపాస్ వెబ్‌సైట్‌లో కళాశాలలు, విద్యార్థుల నమోదుకు గడువును ఈ నెల 20 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల మంజూరు పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి ఇ పాస్ పోర్టల్ అనే ఆన్‌లైన్ సిస్టమ్ వెబ్‌సైట్‌ను అమలు చేస్తున్నారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద కొత్తగా దరఖాస్తు, పునరుద్ధరణ స్కాలర్‌షిప్‌ల మంజూరు కోసం డేటాను ప్రాసెస్ చేయడానికి, నమోదు చేసుకోవడానికి ఈ సిస్టమ్‌లో కళాశాలలు, విద్యార్థుల రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గత ఏడాది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు 10,89,253 మంది స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 9,70,243 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. కొత్తగా వివిధ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థుల్లో ఇప్పటి వరకు 3,70,375 మంది మాత్రమే స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

# సామాన్యులకు ఊరట - తగ్గిన కూరగాయల ధరలు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త** సామాన్యులకు ఊరట కలిగించేలా రాష్ట్రంలో కూరగాయల ధరలు భారీగా తగ్గు ముఖం పట్టాయి. టమాటా, వంకాయ ధరలు పడిపోయాయి. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని వివిధ పట్టణాలు, నగారాల్లో కూడా టమాట తదితర కూరగాయల ధరలు తగ్గాయి. టమాటా ధరల గత ఏడాది ఇదే సమయానికి కిలోకు రూ.30 వరకు ఉండగా, ఈ ఏడాదిలో అది రెండు రెట్లు చొప్పున భారీగా పడిపోయింది. అయితే ఇదే సమయంలో కాకరకాయ, బీరకాయ ధరలు మాత్రం కాస్త పెరిగాయి. గతంలో రాష్ట్రంలో టమాటా కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పలకగా, ఇప్పుడు రూ.10కి పడిపోయింది. తరచూ ప్రతీ కూరలో టమాటాలను ఉపయోగిస్తూ ఉంటారు. దీంతో వీటి ధరలు తగ్గడం సామాన్య ప్రజలకు ఉపశమనంగా చెప్పవచ్చు. ఇక హైదరాబాద్‌లోని కూకట్ పల్లి రైతు బజార్‌లో కిలో టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండకాయ రూ.35, పచ్చిమిర్చి రూ.43, బజ్జి మిర్చి రూ.25, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, క్యాబేజీ రూ.10, బీన్స్ రూ.65, క్యారెట్ రూ.20, గోబి పువ్వు రూ.25, దొండకాయ రూ.35, చిక్కుడుకాయ రూ.45 పలుకుతోంది. అలాగే కేజీ గోరు చిక్కుడు రూ.28, బీట్ రూట్ రూ.18, క్యాప్సికం రూ.40, ఆలుగడ్డ రూ.18, కీర రూ.16, దోసకాయ రూ.16, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.20, కంద రూ.30, ఉల్లపొరక రూ.18కు లభిస్తోంది. చామగడ్డ రూ.30, చిలకడదుంప రూ.30, గుమ్మడికాయ రూ.30, పచ్చి బఠాణి రూ.40, బొప్పాయి రూ.40కు దొరుకుతోంది. కాగా కిలో ఎండుమిర్చి రూ.240, అల్లం రూ.100, వెల్లుల్లి రూ.140, చింతపండు రూ.180, పండుమిర్చి రూ.80, పల్లికాయ రూ.50, ఉసిరి రూ.100కి హైదరాబాద్‌లోని కూకట్ పల్లి తదితర రైతు బజార్లలో లభిస్తున్నాయి.

# గుజరాత్‌పై పంజాబ్ కింగ్





**న్యూచండీగఢ్:** ఐపీఎల్‌లో బౌలర్లు మొదటిసారి డామినేట్ చేశారు. ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై పంజాబ్ కింగ్స్ మూడువికెట్లతో గెలుపొంది బోణీ చేసింది. పలుమలుపులు తీసుకున్న ఈ మ్యాచ్‌లో కూపర్ ఒకే ఒక్కడుగా నిలిచాడు. 44 బంతుల్లో అజేయంగా 77 రన్స్ చేసిన కూపర్... మరో 5 బంతులుండగానే పంజాబ్‌కు గెలుపందించాడు.

163 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన పంజాబ్ కింగ్స్ ఆరంభంలో తడబడింది. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్యా(7)ను తన తొలి ఓవర్‌లోనే రబాడా పెవిలియన్‌కు పంపాడు. క్రీజ్‌లోకి వచ్చిన కూపర్‌తో కలిసి మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఇన్నింగ్స్‌ను కుదుటపరిచాడు. ఇద్దరూ గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. పవర్ ప్లే ముగిసే ఆరు ఓవర్లలో స్కోరును 55 పరుగులకు చేర్చాడు. ఆ తర్వాత కూడా ధాటిగా ఆడుతూ రెండో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. 4 సిక్స్‌లతో 24 బంతుల్లో 37 రన్స్ చేసిన ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను రషీద్‌ఖాన్... ప్రసిద్ కృష్ణ క్యాచ్‌తో అవుట్ చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(18) రెండు సిక్స్‌లతో ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా అది ఎంతో సేపు కొనసా గించలేకపోయాడు. 13వ ఓవర్లో ప్రసిద్ కృష్ణ ఒక వికెట్, 14వ ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్..15వ ఓవర్లో ప్రసిద్ కృష్ణ రెండు వికెట్లు, 18వ ఓవర్లో అశోక్ శర్మ ఒక వికెట్ తీయడంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. చివరి రెండు ఓవర్లలో 16 పరుగులు చేయాల్సిన దశలో బార్ట్‌లెట్ ఒక సిక్స్, కూపర్ ఒక బౌండరీతో 14 రన్స్ రాబట్టారు. కూపర్ 5 ఫోర్లు, 5 సిక్స్‌లతో 72 పరుగులు చేసి పంజాబ్‌కు విజయాన్ని అందించాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్...పంజాబ్ కింగ్స్ బౌలింగ్ ధాటికి స్వల్ప స్కోరుకే పరిమితమైంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ తొలి వికెట్‌కు 37 పరుగులు జోడించారు. ఈ తరుణంలో జెన్సన్ చక్కని బంతితో సాయి సుదర్శన్(13)ను పెవిలియన్‌కు పంపాడు. శుభ్ మన్ గిల్(39), జాస్ బట్లర్(38)ధాటిగా ఆడే ప్రయత్నం చేయగా చాహల్ అద్భుత స్పిన్ బంతులతోవారిని బోల్తా కొట్టించాడు. ఆ తర్వాత వైశాక్ వంతయింది. మిడిల్ ఓవర్లలో మూడు వికెట్లు తీసి గుజరాత్‌ను దెబ్బతీశాడు.గ్లెన్ ఫిలిప్స్(25),వాషింగ్టన్ సుందర్ (18), షారూక్ ఖాన్(4)లను వెంటవెంటనే పెవిలియ న్‌కు పంపాడు.రాహుల్ తెవాతియా (11), రషీద్ ఖాన్ (0) అజేయంగా నిలిచారు. వైశాక్ మూడు, చాహల్ రెండు, మార్కో జెన్సన్ ఒక వికెట్ పడగొట్టారు.

# బుడ్డోడి పంచ్‌కు రికార్డులు షేక్



ఐపీఎల్2026లో మహా మహా ప్లేయర్లు ఎందరున్నా అందరి చూపు ఆ 15 ఏళ్ల కుర్రాడి పైనే. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న అతనికి ఇది రెండో సీజన్ మాత్రమే. తొలి సీజన్‌లో అనూహ్యంగా జట్టులోకి వచ్చి మెరుపు సెంచరీతో రాత్రికి రాత్రే స్టార్ డమ్ తెచ్చుకున్నాడు. అప్పటినుంచి క్రికెట్ ప్రపంచం అతని పేరే జపిస్తోంది. మొన్నటి అండర్19 ప్రపంచకప్ అయినా అదే దూకుడు. దీంతో గౌహతి మ్యాచ్‌పైనే ప్రతి ఒక్కరిచూపు. అందని అంచనాలకు అనుగుణంగానే వైభవ్ సూర్య మెరుపు ఇన్నింగ్స్‌తో ఈ సీజన్‌లో తన ఎంట్రీ గ్రాండ్‌గా చాటాడు.

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్ 2026 సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఓ అసాధారణ రికార్డుతో మొదలుపెట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. ఎదుర్కొన్న తొలి బంతికి బౌండరీతో ఖాతా తెరిచిన వైభవ్.. అదే దూకుడుగా 4 ఫోర్లు, 5 సిక్స్‌లు బాదాడు.అతి పిన్న వయసులో ఫాసెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించిన వైభవ్.. గతంలో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, సురేష్ రైనా, ఇషాన్ కిషన్ లాంటి దిగ్గజాల రికార్డులను అధిగమించాడు. దీంతో ఐపీఎల్‌లో క్రిస్ గేల్ వంటి దిగ్గజాల రికార్డులకే ఎసరు పెడుతున్నాడు. వైభవ్ టార్గెట్ చేస్తున్న ఆ 5 రికార్డులు అలాంటిలాంటివి కావు.

**ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు**

క్రిస్ గేల్ పేరిట ఉంది.2013లో పుణె వారియర్స్‌పై కేవలం 66 బంతుల్లోనే 175రన్స్ చేసి సునామీ సృష్టించాడు. వైభవ్ ఇటీవలే అండర్19 వరల్డ్ కప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 80 బంతుల్లో 175 రన్స్ చేసి తన సత్తా ఏంటో చూపించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో గేల్ రికార్డును దాటడమే లక్ష్యమని చాటుతున్నాడు.

**ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు**

గేల్(17) పేరిటే ఉంది. ఇప్పటి వరకు ఎందరో హార్డ్ హిట్టర్లు వచ్చినా ఆమార్కును అందుకోలేకపోయారు. కానీ వైభవ్ స్టైలే వేరు. ఇటీవలే ఓ యూత్ టీ20 మ్యాచ్‌లో ఏకంగా 15 సిక్సర్లు బాది అందరినీ ఆశ్చర్యపరిచాడు.ఇదే ఊపు ఐపీఎల్‌లో కొనసాగిస్తే, గేల్ సిక్సర్ల రికార్డు గాలిలో కలవడం ఖాయం.

**59 సిక్సర్లు**

2012 సీజన్‌లో క్రిస్ గేల్ ఏకంగా 59 సిక్సర్లు బాది... ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డు నెలకొల్పాడు. గతేడాది 7 మ్యాచ్‌ల్లోనే 24 సిక్సర్లు బాదిన వైభవ్...ఈసారి పూర్తి సీజన్ ఆడితే ఆ 59 సిక్సర్ల రికార్డును ఈజీగాదాటే అవకాశం ఉంది.

**ఒక సీజన్‌లో అత్యధిక స్ట్రైక్ రేట్**

గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ జేక్ ఫ్రేజర్ 234.34 స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. వైభవ్ గతేడాది 206 స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లేలో వైభవ్ చేసే బాదుడుకి ఫ్రేజర్ రికార్డు కూడా ప్రమాదంలో పడేలా ఉంది.

**ఒకే ఓవర్‌లో ఆరు సిక్సర్లు**

ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఏ ఆట గాడూ ఈ ఘనత సాధించ లేదు. క్రిస్ గేల్, జడేజా, రింకూ సింగ్ 5 సిక్సర్ల వరకు వెళ్లారు. కానీ ఆ ఆరో సిక్సర్ మాత్రం ఎవరికీ సాధ్యం కాలేదు.






# లక్నోలో ఢిల్లీకి సవాల్

**లక్నో:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు మరో ఉత్కంఠ మ్యాచ్ జరగనుంది. సొంతగడ్డపై ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడేందుకు లక్నో సూపర్ జెయింట్స్ సిద్ధమైంది.గత సీజన్‌లో ప్లే ఆఫ్ చేరడంలో విఫలమైన ఈ రెండు జట్లు కొత్త సీజ న్‌ను బోణీ ప్రారంభించాలన్న పట్టుదలతో బరి లోకి దిగుతున్నాయి.రిషబ్‌పంత్ కెప్టెన్సీలో లక్నో, అక్షర్ పటేల్ నేతృత్వంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు పోటీపడ నున్నాయి.

లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటింగ్‌లో పటిష్టంగా ఉంది. ముఖ్యంగా మార్క్రమ్, మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లీష్, నికోలస్ పూరన్ వంటి టాప్ క్లాస్ విదేశీ ఆటగాళ్లు జట్టుకు బలం.బౌలింగ్ కాస్త బలహీనంగా ఉంది. మహ్మద్ షమీకు అవేష్ ఖాన్, నార్జే నుంచి లభించే తోడ్పాటుతోనే ప్రత్యర్థిని కట్టడి చేసే అంశం ఆధారపడి ఉంది. గత సీజన్‌లో రాణించిన స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ నుంచి అదే ప్రదర్శనను ఆశిస్తోంది. బ్యాటింగ్ బలంతో ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాలని లక్నో సూపర్ జెయింట్స్ లక్ష్యంగా పెట్టుకుంది.

మరోవైపు, అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్...గత సీజన్‌లో ఆడిన జట్టులోని కీలక ఆటగాళ్లనే కొనసాగించింది. కేఎల్ రాహుల్, నిస్సాంక, నితీష్ రాణా, ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ మిల్లర్ రూపంలో ఢిల్లీ జట్టులో హార్డ్ హిట్టర్లు ఉన్నఆరు. వీరు నిలకడగా రాణిస్తే జట్టు భారీ స్కోర్లకు ఢోకా ఉండదు.డేవిడ్ మిల్లర్ ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించగల సత్తా ఉన్న ప్లేయర్. పేస్, స్పిన్ అటాక్‌తో ఢిల్లీ బౌలింగ్ లైనప్ వైవిధ్యంగా ఉంది. లుంగ్గి ఎన్గిడి పేస్ అటాక్ అదనపు బలం, అక్షర్‌పటేల్, కుల్దీప్ యాదవ్, నబీ రూపంలో టాప్ స్పిన్నర్లు ఉన్నారు. గత సీజన్‌లో ఐదవ స్థానంలో నిలిచిన ఢిల్లీ... ఈ ఏడాది చక్కని విజయాలతో ప్లేఆఫ్ స్థానాన్ని దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతోంది.

**గత సీజన్ రికార్డు**

ఐపీఎల్ 2025లో లక్నో, ఢిల్లీ... రెండూ కూడా టాప్4లో చోటు దక్కించుకోవడంలో విఫలమయ్యాయి.ఢిల్లీ 5వస్థానంలో నిలిచింది.ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఏడింటిలో గెలుపొందగా, 6మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. లక్నో 14మ్యాచ్‌లలో ఆరు విజయాలతో ఏడవ స్థానంలో నిలిచింది. ఏకంగా 8 మ్యాచ్‌ల్లో ఓడింది.

**హెడ్ టు హెడ్**

ఇరుజట్లు 7 మ్యాచ్‌ల్లో తలపడగా ఢిల్లీ ఒకింత పైచేయిగా ఉంది. నాలుగు మ్యాచ్‌ల్లో ఢిల్లీ క్యాపిటల్స్, 3 మ్యాచ్‌ల్లో లక్నో సూపర్ జెయింట్స్ గెలుపొందాయి. గత సీజన్‌లో ఇరు జట్లు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం ఢిల్లీకే దక్కింది.

**పిచ్ రిపోర్ట్**

ఈ మ్యాచ్‌కు వేదికైన లక్నో అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ స్టేడియం పిచ్ సమతుల్యంగా ఉండనుంది. బౌలర్లకు ఒకింత ఎక్కువగా అనుకూలించే అవకాశం ఉంది. తక్కువ స్కోరు నమోదయ్యే ఈపిచ్‌పై స్పిన్నర్లు ప్రభావం చూపవచ్చు.

**లక్నో సూపర్ జెయింట్స్ (అంచనా)**

మిచెల్ మార్ష్, మార్క్రమ్, రిషబ్ పంత్ (కెప్టెన్), పూరన్, బదోని, అబ్దుల్ సమద్, నార్జే, మహ్మద్ షమీ, అవేష్ ఖాన్, మయాంక్, దిగ్వేష్ రాఠీ; ఇంపాక్ట్ ప్లేయర్: షాబాజ్ అహ్మద్

**ఢిల్లీ క్యాపిటల్స్ (అంచనా)**

నిస్సాంక, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ రాణా, ట్రిస్టన్ స్టబ్స్,మిల్లర్, అక్షర్ పటేల్ (కెప్టెన్), అశుతోష్, విప్రజ్ నిగమ్, నబీ, కుల్దీప్ యాదవ్, ఎన్గిడి. ఇంఫాక్ట్ పేయర్:నటరాజన్.

## ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

# అసోం రైఫిల్స్, తెలంగాణ ముందంజ

**హైదరాబాద్, మార్చి 31(వార్త క్రీడా ప్రతినిధి):**74వ బి.ఎన్.ముల్లిక్ స్మారక అఖల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. పురుషుల విభాగంలో తెలంగాణతో పాటు 8 జట్లు ముందంజ వేశాయి. మంగళవారం జరిగిన గ్రూప్-ఇ లీగ్ మ్యాచ్‌లో గోవా 4-0 గోల్స్ తేడాతో హర్యానాపై గెలుపొందగా.. హిమాచల్ ప్రదేశ్, అండమాన్-నికోబార్ జట్ల మధ్య



జరిగిన మ్యాచ్ 0-0తో డ్రా అయింది. మిగతా మ్యాచ్‌ల్లో కేరళ 3-1 గోల్స్‌తో జమ్మూ కశ్మీర్‌పై, ఢిల్లీ 2-1గోల్స్‌తో తమిళనాడుపై, మిజోరం 4-1 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్‌పై విజయం సాధించాయి. లీగ్ మ్యాచ్‌లు ముగిసేసరికి గ్రూప్-ఎలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన సీఐఎస్ఎఫ్, జార్ఖండ్ ముందంజ వేశాయి. గ్రూప్-బిలో బీఎస్ఎఫ్, మణిపూర్.. గ్రూప్-సిలో సీఆర్‌పిఎఫ్, గుజరాత్.. గ్రూప్-డిలో పంజాబ్, ఆర్పీఎఫ్.. గ్రూప్-ఇలో గోవా, హిమాచల్ ప్రదేశ్.. గ్రూప్-ఎఫ్‌లో అసోం రైఫిల్స్, తెలంగాణ.. గ్రూప్-జిలో కేరళ, కర్ణాటక... గ్రూప్-హెచ్‌లో మిజోరం, త్రిపుర జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.





# ఒక్కనెలలోనే 51 లక్షల కోట్ల టర్నోవర్ నష్టం

**ముంబయి, మార్చి 31:** యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టాక్ మార్కెట్లు భారీగా పతనం అయ్యాయి. భారత స్టాక్ మార్కెట్లకు తీవ్ర విఘాతం కలిగింది. యుద్ధం కారణంగా బీఎస్ఈ మార్కెట్ క్యాప్ దాదాపు రూ.51 లక్షల కోట్లకు పైగా పడిపోవడంతో, ఇన్వెస్టర్లలో భయాందోళనలు నెలకొన్నాయి. మార్చి నెలలో బీఎస్ఈ మార్కెట్ క్యాప్, ఆర్ఐఎల్ వంటి మూడు కంపెనీల మార్కెట్ క్యాప్‌కు సమానమైన మొత్తంలో పడిపోయింది. సెన్సెక్స్ 10,000 మార్కును దాటింది వాస్తవానికి, ఈ యుద్ధ కాలంలోసెన్సెక్స్ 12 శాతానికి పైగా అంటే దాదాపు 10,000 పాయింట్లు పడిపోయింది. మరోవైపు నిఫ్టీ 22,500 దిగువకు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పతనం కారణంగా, బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ ఫిబ్రవరిలో సుమారు రూ.463 లక్షల కోట్ల నుంచి ఇప్పుడు రూ.412 లక్షల కోట్లకు పడిపోయింది. కేవలం ఒక్క నెలలోనే సుమారు రూ.51 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. యుద్ధం ప్రపంచ చమురు ధరలలో తీవ్ర పెరుగుదలకు దారితీసింది. దీంతో ఇండియా లాంటి ప్రధాన చమురు దిగుమతిదారులపై ఒత్తిడిని పెరిగింది. ఈ అధిక చమురు ధరలు అనేవి కంపెనీల ఖర్చులను పెంచి, లాభాలను తగ్గించాయి. ఆ ప్రభావం స్టాక్ మార్కెట్‌పై నేరుగా పడి పెద్ద మొత్తంలో నష్టాలు మూటగట్టుకుంటున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. రూపాయి కూడా తీవ్రంగా పతనమవుతూ, డాలర్‌తో పోల్చితే ఏకంగా రికార్డ్ స్థాయిలో 95 స్థాయిని దాటింది. మార్కెట్ పతనం లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కేకాకుండా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ కూడా గణనీయంగా పడిపోయాయి. బ్యాంకింగ్, ఆటో, వినియోగ వస్తువుల వంటి కీలక రంగాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

# కొత్త ఐటీఆర్ ఫారాలు నోటిఫై

**న్యూఢిల్లీ, మార్చి 31:** ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు 26-27 ఆర్థికసంవత్సరానికిగాను పన్ను రిటర్నులు దాఖలుకు ఫారాలను నోటిఫైచేస్తూ ఐటిశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఐటీఆర్ 1,4లను ఈనెల 30వ తేదీనే నోటిఫై చేస్తే ఐటీఆర్ 2, 3, 5, 6, 7 ఫారాలను ఐటిఆర్‌యును మంగళవారం నోటిఫై చేసింది.

వ్యక్తులు, వ్యాపారులు,సంస్థలు 2025-26 సంవత్సరంలో ఆర్జించిన ఆదాయానికిగాను రిటర్నులు దాఖలుచేసుకోవాలి. ఆడిట్ అవసరం లేని వ్యక్తులు వచ్చే జులై 31లోగా ఐటీఆర్ ఫైల్ చేయాలి. ఐటిఆర్‌ఫారమ్‌వన్ సహజ్‌ను ఐటిఆర్ ఫారమ్ 4 సుగమ్ అనేవి చిన్న మధ్యతరహా పన్ను చెల్లింపుదారులకోసం నిర్దేశించారు. ఐటిఆర్‌వన్ వార్షిక ఆదాయం రూ.50 లక్షలవరకూ ఉంటే ఐటిఆర్‌వన్ దాఖలుచేయాలి. జీతం, ఇంటినుంచి వచ్చే ఆదాయం ఇతర మార్గాల్లో ఏడాదికి రూ.5వేలవరకూ వ్యవసాయ ఆదాయం ఉండే వ్యక్తులు సహజ్‌ను ఎంపికచేసుకోవాలి. ఐటిఆర్4 మొత్తం వార్షిక ఆదాయం రూ.50 లక్షలు ఉండి వ్యాపారం, వృత్తి ఆదాయం పొందే వ్యక్తులు హిందూ అవిభాజ్యకుటుంబాలు సంస్థలు సుగమ్ ఫారాన్ని ఎంచుకోవచ్చు.




ఐటిఆర్ రెండు మూలధన లాభాలు, హిందూ అవిభాజ్య కుటుంబాలు ఈ ఫారం ఎంపికచేసుకుంటారు. వ్యాపారం, వృద్ధిలో ఆదాయం ఆర్జించిన వారికి ఇది పనికిరాదు. ఐటిఆర్3 వృత్తివ్యాపారం ద్వారా రాబడి వచ్చే వ్యక్తులు, హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ కోసం ఈ ఐటిఆర్ ఉంది. ఐటిఆర్-5లో అయితే సంస్థలు, ఎల్ఎల్‌పిలు, సహకార సంఘాలుఈ ఐటిఆర్ దాఖలుచేయాలి. ఇక ఐటిఆర్-6 అయితే కంపెనీల చట్టంకింద నమోదయిన కంపెనీలకు వాడతారు. ఐటిఆర్-7 అయితే ట్రస్టులు, స్వచ్ఛందసంస్థలు ఈ ఫారం ఎంపికచేసుకుని రిటర్నులు దాఖలుచేయాలి.

## యేడాది ముగిసింది.. వెంటనే అప్‌డేట్ చేయండి!

# పన్ను చెల్లింపుదారులకు ఐటి వార్నింగ్




**న్యూఢిల్లీ,మార్చి 31:** ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున బ్యాంకులు, డీమ్యాట్, పన్నులకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. మార్చి31న అర్ధరాత్రి 12 గంటలలోపు ఈపనులను పూర్తి చేయకపోతే, బ్యాంకు అకౌంట్స్ పని చేయకపోవచ్చు లేదా భారీ జరిమానాను ఎదుర్కోవలసి ఉంటుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సెబీ, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఇప్పుడు అన్ని బ్యాంక్,డీమ్యాట్ అంకౌట్లకు నామినీని చేర్చడం తప్పనిసరి. ఇంకా నామినీని చేర్చకపోతే, మీ ఖాతా పనిచేయకపోవచ్చు. కస్టమర్లు నెట్ బ్యాంకింగ్ లేదా, స్టాక్‌బ్రోకర్ యాప్‌ను ఉపయోగించి ఇంటి నుంచే ఇ నామి నేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. నామినీ పేరు, వారితో ఉన్న రిలేషన్ పొందుపరుస్తే సరిపోతుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)తో సహా పలు బ్యాంకులు, తమ కస్టమర్లను వారి కేవైసీ వివరాలను అప్‌డేట్ చేసుకోమని నోటిఫికేషన్లు జారీ చేశాయి. రెండేళ్లుగా ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతాలను పనిచేయనివిగా ప్రకటించారు. ఖాతాల వినియోగదారులకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉంది. ఈకేవైసీ ప్రక్రియను మార్చి 31వ తేదీలోగా పూర్తి చేయడం సురక్షితం. మీ ఆధార్ కార్డు, పాన్ కార్డు, మీ తాజా ఫోటోతో మీ హోమ్ బ్రాంచ్‌ను సందర్శించి ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఆర్థిక సంవత్సరం చివరిలో పన్ను ఆదా చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం. రూ. 1.5 లక్షల వరకు మినహాయింపు పొందడానికి మార్చి 31 లోపు పీపీఎఫ్, ఈఎల్ఎస్ఎస్ లేదా జీవిత బీమాలో పెట్టుబడి పెట్టండి. ఒకవేళ పాన్ కార్డ్ ఇంకా ఆధార్‌తో అనుసంధానం కాకపోతే, అది ఇన్ యాక్టివ్ గా మారి ఉండవచ్చు. వెంటనే దానిని తిరిగి అనుసంధానం చేసుకోవాలి.లేకుంటే రూ. 1,000 జరిమానా విధించబడుతుంది. అదేవిధంగా ఆదాయపు పన్ను రిటర్న్‌కూడా దాఖలు చేయలేరు.

# వొడాఫోన్, ఐడియా 8 నగరాలకు 5జి సేవలు

**న్యూఢిల్లీ, మార్చి 31:** టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా (వి) తమ 5జీ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించనున్నట్లు ప్రకటించింది. మే 2026 నాటికి దేశవ్యాప్తంగా మరో 90 నగరాలకు 5జీ సేవలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది. ఈ విస్తరణతో కంపెనీ 5జీ సేవలు అందించే నగరాల సంఖ్య 43 నుంచి 133కి పెరగనుంది. ఎక్కువ 5జీ డివైజ్‌లు ఉన్న ప్రాంతాలు, అధిక డేటా వినియోగం ఉన్న పట్టణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ విస్తరణ చేపడుతున్నట్లు కంపెనీ తెలిపింది.

ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు చెన్నై, కోయంబత్తూర్, గోవా, పుదుచ్చేరి, వారణాసి, ప్రయాగ్‌రాజ్ వంటి పలు కీలక నగరాలు ఉన్నాయి.ఈ విస్తరణ కోసం ఎరిక్సన్, నోకియా, శాంసంగ్ వంటి గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ విస్తరణపై వొడాఫోన్ ఐడియా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ) జగ్బీర్ సింగ్ మాట్లాడుతూ 5జీ డివైజ్‌ల వాడకం ఎక్కువగా ఉన్న కీలక మార్కెట్లలో సేవలను విస్తరించాలన్న మా వ్యూహంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ దశ విస్తరణతో ప్రధాన నగరాల్లో మా 5జీ నెట్‌వర్క్‌ను గణనీయంగా పెంచుతున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు, డిజిటల్ ప్రపంచంలో వారు రాణించేందుకు వీలుగా ఒక పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించడానికి కట్టుబడి ఉన్నామని ఆయన వివరించారు.



# ఇండిగో కొత్త సిఇఒ విల్లీ వాల్ష్

**ముంబయి, మార్చి 31:** భారతదేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగోలో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. పీటర్ ఎల్బర్స్ మార్చి 2026లో తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత సిఇఒ పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసిన తరువాత, ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్‌లైన్ ఎగ్జిక్యూటివ్ విల్లీ వాల్ష్ ను కొత్త సిఇఒగా నియమించారు. ఇండిగో భారతదేశంలో సుమారు 65 మార్కెట్ షేర్ కలిగిన పెద్ద ఎయిర్‌లైన్.

ఇలాంటి కంపెనీలో దినివీ మార్పు అంటే మొత్తం విమానయాన రంగంపై ప్రభావం ఉంటుంది. కొత్త పాలసీలు, వ్యూహాలు వస్తాయి. విల్లీ వాల్ష్ అంతర్జాతీయ విమానయాన రంగంలో అనుభవజ్ఞుడు. ప్రస్తుతం అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం ఐఎటిఎ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. ముందుగా బ్రిటిష్ ఎయిర్‌వేస్ సిఇఒగా పనిచేశారు. 2026 జూలై 31 వరకు ఐఎటిఎలో పని చేసి, ఆగస్టు 2026లో ఇండిగోలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఇండిగో ఇప్పుడు గ్లోబల్ స్థాయి అనుభవం ఉన్న నాయకుడిని తీసుకువచ్చింది. గత ఏడాది ఇండిగో దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయ సర్వీసుల పరంగా కూడా తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. వందలాది సర్వీసులు రద్దుకావడం లేదా నిలిచిపోవడం వంటివిజరిగి ప్రభుత్వ అగ్రహాన్ని కూడా చవిచూసింది. అన్నింటినీ అధిగమించి ఇపుడిపుడే సర్దుకుంటున్న ఇండిగోను విల్లీవాల్ష్ గాడిలో పెట్టగలరన్న ధీమా వ్యక్తం అవుతోంది.



# శశిధర్ జగదీశన్‌వైపే హెచ్‌డిఎఫ్‌సి బోర్డు

**ముంబయి, మార్చి 31:** ప్రైవేటురంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సిఇఒ ఎండిగా శశిధర్ జగదీశన్‌ను పునర్నియామకం చేయాలని బ్యాంకు బోర్డు ఆమోదించనున్నది. బ్యాంకులో వరుసగా మూడోసారి ఆయన ఎండి సిఇఒగా విధులు నిర్వహిస్తున్నట్లవుతుంది. నాయకత్వ నిర్ణయాలు సంతృప్తికరమైన ఆయన కెరీర్ ఇందుకు దోహదం చేసిందని అంచనా. ఆర్‌బిఐ నిర్దేశించిన ఫిట్‌నెస్ క్రైటేరియాకు అనుగుణంగా జగదీశన్ ఉన్నట్లు బ్యాంకు భావిస్తోంది.

బ్యాంకు తదుపరి బోర్డు సమావేశం ఏప్రిల్ 18వ తేదీ జరుగుతుంది. ఆరోజే బ్యాంకు నాలుగోత్రైమాసిక ఫలితాలను ఆమోదిస్తుంది. జగదీశన్ ప్రస్తుత కాలం 2026 అక్టోబరుతో ముగుస్తుంది. ఈ బోర్డు సమావేశంలోనే జగదీశన్ పేరును ఆమోదిస్తారని ఆ తర్వాత చట్టపరంగా అనుమతులు పొందిన తర్వాత జగదీశన్ బాధ్యతలు స్వీకరిస్తారని తెలుస్తోంది.ప్రస్తుత ఛైర్మన్ అతను చక్రవర్తి హటాత్తుగా రాజీనామాచేయడంతో బ్యాంకు చీఫ్ నియామకం అత్యవసరం అయింది.

బ్యాంకు యాజమాన్యంతో అతను చక్రవర్తికి పొసగకపోవడంతోనే ఆయన రాజీనామాచేసారన్న వార్తలు విస్తృతంగా బ్యాంకింగ్‌రంగంలో వినిపించాయి. హెచ్‌డిఎఫ్‌సికి పదివేల శాఖలు, రెండు లక్షల మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు ఉన్నారు. ఎలాంటి అవకతవకలు తేలినా వెంటనే చర్యలపట్ల బ్యాంకు కఠినంగా ఉంటుంది. హెచ్‌డిఎఫ్‌సి పరిణామాలతో షేర్లు 3శాతం దిగువన ట్రేడ్ అయ్యాయి. ముందురోజు బిఎస్ఇలో రూ.732చొప్పున ట్రేడ్ అయ్యాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.